
సోమవారం 10-6-2024



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 79

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఐఐటి జగతిపై చెరిగిపోని సంతకం...
మేధోప్రపంచంలో తిరుగులేని దిగ్గజం... నారాయణ

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో 100 లోపు ఆల్ కేటగిరీ ర్యాంకులు,

AIR 24 KUNCHAM SHIVA HT. No.: 246121222
AIR 25 VIVEK NAGELLI HT. No.: 246157667
AIR 27 BADRINADH VARMA B HT. No.: 246014058
AIR 27 ARJAV JAIN HT. No.: 242002218 (DLP)
AIR 28 SHEKHAR JHA HT. No.: 242031290 (DLP)
AIR 31 SUSHANTH P HT. No.: 246149232

AIR 31 ISHAN GUPTA HT. No.: 242014288 (DLP)
AIR 33 SPARSH GUPTA HT. No.: 247019253 (DLP)
AIR 34 POLISETTY RITISH BALAJI HT. No.: 246161257
AIR 35 SARVAJITH KOLANU HT. No.: 246138129
AIR 36 AARUSH C HT. No.: 241050053
AIR 37 REVANTH ESWAR D HT. No.: 245014025

AIR 40 HARIPREETH P.S HT. No.: 246130165
AIR 40 ARNAV BARANWAL HT. No.: 242052079 (DLP)
AIR 42 SIDDHARTHI VIVEKANAND HT. No.: 246047026
AIR 44 SHRIJANI KOREPAKA HT. No.: 246183040
AIR 45 DHANUSH SANJAY N HT. No.: 246011188
AIR 49 BODIGEPALLY ARNAV B HT. No.: 246186124

AIR 49 AVADH HINDOCHA HT. No.: 241021073 (DLP)
AIR 50 DEV RAJ DAS HT. No.: 242103211
AIR 51 B CHARAN HT. No.: 246161542
AIR 51 RISHI GOUTHAM B HT. No.: 246153396
AIR 54 SAI TEJESH D HT. No.: 246056017
AIR 59 RISHIVARDHAN MAJJI HT. No.: 245014078

AIR 63 HUNDEKAR VIDITH HT. No.: 246163469
AIR 66 MRIGANK GOEL HT. No.: 241007021 (DLP)
AIR 69 SATYAM RAKESH SHARMA HT. No.: 241153239
AIR 69 VARUN SAI POTHULA HT. No.: 246158603
AIR 70 SRI SURYA VARMA D HT. No.: 246124096
AIR 72 B VENKATA SAKETH HT. No.: 246150205

AIR 73 MAHATHI REDDY CH HT. No.: 246049273
AIR 74 BHARATH KUMAR B HT. No.: 245010213
AIR 74 HIMANSHU THALOR HT. No.: 242050438 (DLP)
AIR 75 HEMANTH ALLU HT. No.: 245008033
AIR 76 EPPA LAXMI NARASIMHA HT. No.: 246154128
AIR 77 REVANTH SAI P HT. No.: 245010574

AIR 77 MD EMAAD ARIF HT. No.: 242054030 (DLP)
AIR 78 E SAI SHERVAN HT. No.: 246120066
AIR 81 SRINANDAN M HT. No.: 246162431
AIR 81 SAMNAVDEEP K HT. No.: 245010372
AIR 82 AMBAR GOGIA HT. No.: 2422014235 (DLP)
AIR 85 P SAI SINDHUSH HT. No.: 246121033

AIR 85 BIBASWAN BISWAS HT. No.: 245058146 (DLP)
AIR 87 MORA. ADARSH HT. No.: 246161228
AIR 87 V V AKASH REDDY HT. No.: 246053404
AIR 87 DEVANSH GATTANI HT. No.: 241113047 (DLP)
AIR 88 SATEESH KUMARCHINTU HT. No.: 245007385
AIR 89 JAIVEER SINGH HT. No.: 242061031 (DLP)

AIR 90 KRISHIV GOYAL HT. No.: 241101225
AIR 91 AMAR SINHA HT. No.: 242057008 (DLP)
AIR 94 NV SRI HARSHA HT. No.: 246037052
AIR 94 N NIRMALKUMAR HT. No.: 241110182 (DLP)
AIR 99 TANAY KAKLIYA HT. No.: 242057318 (DLP)

అడ్మిషన్ల కొరకు మీకు దగ్గరలోని బ్రాంచీలను సంప్రదించండి

JEE ADV. Repeater Batch starts from 15th June 2024



Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

Scan QR For Admissions

SRAMAYEVA JAYATHE

NARAYANA
EDUCATIONAL INSTITUTIONS

Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams

Toll Free: 1800 102 3344 | /TheNarayanaGroup | www.narayanagroup.com

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 79

సోమవారం 10-6-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



న్యూయార్క్‌లో నమో భారత్

పాకిస్తాన్‌తో జరిగిన టి20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లో 6 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా.


- వివరాలు 8లో



ఒడిశా సీఎంగా సురేశ్ పూజారి?

ఒడిశా సీఎం పదవి ఆ రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత సురేశ్ పూజారికి దక్కే అవకాశం ఉందంటూ ప్రచారం జరుగుతోంది.

వివరాలు 6లో ▸



తీర్థయాత్రికుల బస్సుపై కాల్పులు

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులతో బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. 9 మంది తీర్థయాత్రికులు చనిపోయారు.

వివరాలు 6లో ▸



'ఫ్రెంచ్ కింగ్' అల్‌కరాజ్

స్పెయిన్ టెన్నిస్ స్టార్ అల్‌కరాజ్ మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో చాంపియన్‌గా అవతరించాడు.

వివరాలు 8లో ▸



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అభివాదం చేస్తున్న మోదీ

మోదీ అనే నేను..

ప్రధానిగా నరేంద్రుని ప్రమాణస్వీకారం

వరుసగా మూడోసారి, నెహ్రూ రికార్డు సమం..

- 72 మందితో కొలువుదీరిన నూతన మంత్రివర్గం
- షా, రాజ్‌నాథ్, నిర్మల, గడ్కరీ, జైశంకర్ కొనసాగింపు
- ఆంధ్రప్రదేశ్‌కు 3, తెలంగాణకు 2 పదవులు
- యూపీకి 9, బిహార్‌కు 8, మహారాష్ట్రకు 6 బెర్తులు
- గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు ఐదేసి స్థానాలు
- 30 కేబినెట్, 5 స్వతంత్ర, 36 మంది సహాయ మంత్రులు
- 11 బెర్తులతో ఎన్డీఏ భాగస్వాములకు సముచిత ప్రాధాన్యం

న్యూఢిల్లీ: స్వతంత్ర భారత రాజకీయాల్లో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. దేశ ప్రధానిగా నరేంద్ర దామోదర్ దాస్ మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఈ ఘనత సాధించిన నాయకునిగా రికార్డులకెక్కారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 73 ఏళ్ల మోదీతో ప్రధానిగా ప్రమాణంచేయించారు. ఆయన దైవసాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం రాత్రి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అన్ని రంగాలకూ చెందిన అతిరథ మహారథుల సమక్షంలో కార్యక్రమం 155 నిమిషాల పాటు అత్యంత వేడుకగా జరిగింది. మోదీ సహా 72 మందితో పూర్తిస్థాయి నూతన కేంద్ర మంత్రివర్గం కూడా ఈ సందర్భంగా కొలువుదీరింది. 30 మందితో కేబినెట్ మంత్రులుగా, ఐదుగురితో స్వతంత్ర, 36 మందితో సహాయ మంత్రులుగా రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేయించారు. బీజేపీకి పూర్తి మెజారిటీ రాని నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన ఎన్డీఏ మిత్రపక్షాలకు మంత్రివర్గంలో 11 బెర్తులతో

మిగతా 2వ పేజీలో ▶

తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు

ఏపీ నుంచి శ్రీనివాసవర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్

తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు చోటు

9లో

కేబినెట్ మంత్రులుగా కిషన్‌రెడ్డి, రామ్మోహన్.. సహాయ మంత్రులుగా మిగతా ముగ్గురు



రామ్మోహన్‌నాయుడు



పెమ్మసాని చంద్రశేఖర్



శ్రీనివాసవర్మ

అడ్వాన్స్‌డ్‌లో ఏపీ మెరుపులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటిన రాష్ట్ర విద్యార్థులు



వేద్ 1వ ర్యాంకు




సందేశ్ 3వ ర్యాంకు



తేజేశ్వర్ 8వ ర్యాంకు

- టాప్–10లో నాలుగు ర్యాంకులు ఏపీ విద్యార్థులవే
- వందలోపు ర్యాంకుల్లో 20 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు
- భోగలపల్లి సందేశ్‌కు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు
- ఓబీసీ కేటగిరీలో మత బాలాదిత్య టాపర్
- జాతీయ స్థాయిలో 355 మార్కులతో టాపర్‌గా నిలిచిన వేద్ లహోటి
- ఈ ఏడాది 1,86,584 లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు దరఖాస్తు
- 1,80,200 మంది పరీక్షకు హాజరు.. 48,248 మంది ఉత్తీర్ణత
- రెండు రాష్ట్రాల్లో 12 వేల మందికి అర్హత
- అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణతలో బాలికల సంఖ్య పెరుగుదల
- పెరిగిన కటాఫ్.. నేటి నుంచి జోసా కౌన్సెలింగ్

7లో



కన్నుల పండువగా...

- మోదీ ప్రమాణోత్సవం సందర్భంగా కళకళలాడిన రాష్ట్రపతి భవన్
- రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలు, సినీ తారల సందడి
- వేడుకలో పాల్గొన్న 8,000 మందికి పైగా వీఐపీలు

వినయంగా ఉండండి.. కష్టపడి పని చేయండి

- రుజువర్తన, పారదర్శకత విషయంలో రాజీ వద్దు
- నూతన మంత్రులకు మోదీ సూచన

-వివరాలు 6లో

'నైరుతి' మందగమనం!

ఉత్తరాంధ్ర ప్రాంతంపై అధిక పీడన ద్రోణి

ఆపై పుంజుకోనున్న రుతుపవనాలు రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రల్లో వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రల్లో ప్రభావం చూపుతున్న నైరుతి రుతుపవనాలు ఉత్తరాంధ్రకు వచ్చేసరికి ఒకింత మందగమనంలో ఉన్నాయి. దీంతో ఉత్తరాంధ్ర మినహా రాష్ట్రంలో ఆ రెండు ప్రాంతాల్లో చెప్పుకోదగిన స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక ఒక్కోసారి ఉపరితలంలో అధిక పీడన ద్రోణి (రిడ్జ్) ఏర్పడుతుంటుంది. ఇది అల్పపీడన ద్రోణికి విరుద్ధం. అంటే అల్పపీడన ద్రోణి ఏర్పడినప్పుడు ఉపరితలంలో గాలులు గడియారపు ముల్లు తిరిగే దిశ (క్లాక్ వైజ్ డైరెక్షన్)లో తిరుగుతూ మేఘాలు, వర్షాలకు కారణమవుతాయి. అదే అధిక పీడన ద్రోణి ఏర్పడితే గాలులు యాంటీ క్లాక్ వైజ్ డైరెక్షన్‌లో తిరుగుతాయి. ఫలితంగా అరకొర మేఘాలు ఏర్పడడమే కాకుండా సూర్యరశ్మి నేరుగా కిందకు ప్రసరిస్తుంది. దీంతో ఉష్ణతీవ్రత పెరగడంతో పాటు వర్షాలకు

మిగతా 2వ పేజీలో ▶



ఇదేనా ప్రజాస్వామ్యం!?

రోజురోజుకూ పెరుగుతున్న దాడులు..

పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు చోద్యం చూస్తున్న పోలీసులు

రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయి. చంద్రబాబు, లోకేశ్ కనుసన్నల్లో ఇష్టానుసారం దాడులు చేస్తూ పేట్రేగిపోతున్నారు. అధికారంలోకి వచ్చింది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను చితకబాదడానికే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల తొలగింపు, శిలాఫలకాల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. ఎప్పుడో చరిత్ర పుస్తకాల్లో చదువుకున్న ఆటవిక రాజ్యాన్ని తలపిస్తూ పోటీపడి మరీ దాడులు చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దుస్తులు విప్పి కొట్టడమే కాకుండా, లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై కూర్చోబెట్టి బూతులు తిట్టారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెలో 50 ఇళ్లకు మంచి నీరు బంద్ చేశారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలంలో అర్చకత్వ బాధ్యతలు తమ వర్గీయులకు అప్పగించాలంటూ ఓ పూజారి ఇంటిపై దాడి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ వర్గీయుల దాష్టీకాలు ఊరూరా కనిపిస్తున్నాయి. సభ్య సమాజం ఏమనుకుంటుందనే విచక్షణ మరచి బరితెగింపుతో వ్యవహరిస్తున్నారు. మహిళలని కూడా చూడకుండా ఇళ్లలోకి చొరబడి కొడుతున్నారు. ఎక్కడో సినిమాల్లో కనిపించే ఇలాంటి దృశ్యాలు ఐదు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిజ జీవితంలోనూ చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం చోద్యం చూస్తుండటం దారుణం, దుర్మార్గం. పైగా కొన్ని చోట్ల వారే టీడీపీ కార్యకర్తలుగా మారి పూనకం వచ్చినట్లు ఊగిపోతుండటం గమనార్హం. ఏ తప్పూ చేయకపోయినా పల్నాడు జిల్లాలో ఊరు విడిచి వెళ్లాలని ఒక ఉప సర్పంచ్‌ను ఓ సీఐ తీవ్రంగా హెచ్చరించడం, బాధితుడు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకోవడం అరాచకానికి పరాకాష్ట. పరిస్థితి చూస్తుంటే రాష్ట్రం రావణ కాష్టం అవ్వాలన్నదే బాబు, లోకేశ్‌ల అభిమతంగా అనిపిస్తోంది.

5లో



మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజ్‌కుమార్‌ను చితకబాది మోకాళ్లపై కూర్చోబెట్టిన టీడీపీ నాయకులు

ఇదండీ వరస



సమీప భవిష్యత్తులో అంటే 2029లోనే కదా మేడం!

పెరిగిన గృహావసరాల వినియోగ వ్యయం



- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో 9.20శాతం పెరుగుదల.. ఇతర వర్గాల్లో 8.5 శాతం
- గృహ వినియోగ వ్యయంలో వివిధ సామాజికవర్గాల మధ్య తగ్గుతున్న అంతరం
- జాతీయ గృహావసరాల వినియోగ వ్యయ నివేదిక వెల్లడి

9లో

అలా వాడేయటం ఆరోగ్యానికి 'యాంటీ'

- యాంటీ బయోటిక్స్ విచ్చలవిడి వాడకంతో ఆరోగ్యానికి ముప్పు
- శరీరంలో సూక్ష్మజీవనాశక నిరోధకత (ఏఎంఆర్) ఉత్పన్నం
- ఆరోగ్య విపత్తుల్లో ఏఎంఆర్ ప్రధానమైనదంటున్న డబ్ల్యూహెచ్‌వో
- జలుబు, దగ్గు, జ్వరం వంటి వాటికి యాంటీ బయోటిక్స్ వాడొద్దని హెచ్చరిక

3లో





రామోజీకి అశ్రు నివాళి

- ఫిలింసిటీలోని నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమయాత్ర
- పాడె మోసిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- రామోజీ చితికి నిప్పంటించిన ఆయన కుమారుడు కిరణ్
- రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు హాజరు

2లో

'నీట్'పై టెన్షన్

వెల్లడించిన ఫలితాలు ఉంచుతారా? రద్దు చేస్తారా?

- దేశవ్యాప్తంగా కోర్టులను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై విమర్శల వెల్లువ
- చెప్పిన తేదీకి పది రోజుల ముందే ఫలితాల వెల్లడిపై సందేహాలు
- ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేయడంపైనా అనుమానాలు
- కొందరికి గ్రేస్ మార్కులిచ్చారు సరే... మరి తెలుగు విద్యార్థులకు ఇవ్వరా?

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. ప్రవేశ పరీక్ష సందర్భంగా లోపాలు తలెత్తడం... ఫలితాల వెల్లడి సమయంలో మార్కుల్లో అవకతవకలు జరిగినట్లుగా ఆరోపణలు రావడంతో ఏం జరుగుతుందా అన్న చర్చ జరుగుతోంది. అవకతవకలు జరిగినట్లు భావిస్తున్న అనేకమంది విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా వందలాది మంది కోర్టుల్లో పిటిషన్లు వేశారు. దీంతో

మిగతా 2వ పేజీలో ▶



మోదీ అనే నేను..

▶ మొదటి పేజీ తరువాయి

సముచిత ప్రాధాన్యం దక్కింది. బీజేపీ నుంచి రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, ఎస్.జైశంకర్ వంటి అతిరథులతో పాటు మిత్రపక్షాల నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), లలన్‌సింగ్ (జేడీయూ), చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ), హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్) తదితరులు ప్రమాణస్వీకారం చేసిన ప్రముఖుల్లో ఉన్నారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జేడీ(యూ) చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమంలో పాల్గొనగా తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీతో పాటు పలు విపక్షాలు గైర్హాజరవడం విశేషం. 140 కోట్ల మంది భారతీయులకు మరోసారి సేవ చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉందని కార్యక్రమం అనంతరం మోదీ పేర్కొన్నారు. "నూతన మంత్రివర్గ సహచరులతో కలిసి ప్రగతి పథంలో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తా. అనుభవం, యువత కలబోతగా కొత్త మంత్రివర్గం అలరారుతోంది. ప్రజల జీవితాలను మెరుగు పరిచేందుకు నిరంతరం శ్రమిస్తాం" అంటూ ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. నూతన మంత్రులకు శాఖల కేటాయింపు సోమవారం జరిగే అవకాశముంది.

ఆరుగురు మాజీ సీఎంలు

మోదీ 3.0 మంత్రివర్గం పలు విశేషాల సమాహారంగా రూపుదిద్దుకుంది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఐదేళ్ల విరామం తర్వాత కేంద్ర మంత్రివర్గంలోకి అడుగు పెట్టారు. మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్, కుమారస్వామిలకు తొలిసారి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. వారితో పాటు నూతన మంత్రివర్గంలో 33 మంది కొత్త ముఖాలున్నాయి. శివరాజ్, కుమారస్వామి, రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్‌లాల్ ఖట్టర్, సర్బానంద సోనోవాల్, జితిన్‌రాం మాంఝీ రూపంలో నూతన మంత్రివర్గంలో ఆరుగురు మాజీ సీఎంలుండటం విశేషం! 43 మందికి మూడుసార్ల కంటే ఎక్కువగా కేంద్ర మంత్రులుగా చేసిన అనుభవముంది.

37 మందికి ఉద్వాసన

మోదీ 2.0 మంత్రివర్గంలో పని చేసిన వారిలో స్మృతీ ఇరానీ, అనురాగ్ ఠాకూర్, నారాయణ్ రాణే సహా ఏకంగా 37 మందికి ఈసారి కేబినెట్లో చాన్స్ దొరకలేదు. వీరిలో పలువురు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. 2.0 మంత్రివర్గంలోని 19 మంది కేబినెట్ మంత్రులతో సహా మొత్తం 34 మంది తిరిగి చోటు దక్కించుకున్నారు. వీరిలో తమిళనాడుకు చెందిన ఎల్ మురుగన్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా చాన్స్ దక్కడం విశేషం. ఆయన రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. కొత్త మంత్రుల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు చొప్పున 12 మంది రాజ్యసభ సభ్యులున్నారు. 58 మంది లోక్‌సభ సభ్యులు కాగా రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, జార్జి కురియన్ ఏ సభలోనూ సభ్యులు కారు. వారు ఆర్నెల్లలోగా పార్లమెంటు సభ్యులుగా ఎన్నికకావాల్సి ఉంటుంది.

కొత్త మంత్రులు 33 మంది

మోదీ 3.0 మంత్రివర్గంలో 33 కొత్త ముఖాలకు చోటు దక్కింది. మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్‌సింగ్, కుమారస్వామి, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితర దిగ్గజాలతో పాటు తొలిసారి ఎంపీలుగా నెగ్గిన సురేశ్ గోపి తదితరుల దాకా వీరిలో ఉన్నారు.



మోదీని ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

24 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం

కేంద్ర మంత్రివర్గంలో 24 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం దక్కింది. గోవా, అరుణాచల్ వంటి చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే నలుగురు, అంతకంటే ఎక్కువ మంది లోక్‌సభ సభ్యులున్న ప్రతి రాష్ట్రం నుంచీ కనీసం ఒక్కరికి మంత్రివర్గంలో స్థానం లభించింది.

ఏడుగురు మహిళలు

నూతన మంత్రివర్గంలో మహిళలు 10 శాతం కంటే తక్కువే ఉన్నారు. మొత్తం ఏడుగురికి స్థానం దక్కింది. మంత్రివర్గంలో 27 మంది ఓబీసీ, 10 మంది ఎస్సీ, ఐదుగురు ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు. కాగా ఐదుగురు మైనారిటీలున్నారు. ముస్లింలు ఒక్కరు కూడా లేరు.

ఇంకో 9 మందికి అవకాశం

కేంద్ర మంత్రివర్గ గరిష్ఠ పరిమాణం 81 (543 మంది లోక్‌సభ సభ్యుల్లో 15 శాతం). దాంతో మరో 9 మందికి మంత్రులుగా అవకాశముంది. అయితే 2019–24 మధ్య మోదీ 2.0 మంత్రివర్గంలో 78 మంది సభ్యులే ఉన్నారు.

అత్యంత పిన్న వయస్కులు రామ్మోహన్, ఖడ్సే

కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), మహారాష్ట్రకు చెందిన రక్షా ఖడ్సే (బీజేపీ) అత్యంత పిన్న వయస్కులు. వారికి 37 ఏళ్లు. అత్యంత పెద్ద వయస్కునిగా 79 ఏళ్ల హెచ్ఏఎల్ అధినేత జితిన్‌రాం మాంఝీ నిలిచారు.

నేడు కేబినెట్ తొలి భేటీ

మోదీ 3.0 మంత్రివర్గ తొలి సమావేశం సోమవారం జరగనుంది. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని మోదీ నివాసంలో సాయంత్రం భేటీ ఉంటుందని సమాచారం.

భాగస్వాములకు పెద్దపీట

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు నూతన మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కింది. తాజా మాజీ మంత్రివర్గంలో వాటికి ఒక్క కేబినెట్ హోదా, స్వతంత్ర హోదా మంత్రి పదవి కూడా లేదు. ఈసారి మాత్రం కుమారస్వామి (జేడీఎస్), మాంఝీ (హెచ్ఏఎల్), లలన్‌సింగ్ (జేడీయూ), రామ్మోహన్ నాయుడు (టీడీపీ), చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ–ఆర్‌వీ) రూపంలో ఏకంగా ఐదు కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి! ప్రతాప్‌రావ్ జాదవ్ (శివసేన), జయంత్ చౌదరి (ఆరెల్డీ)లకు స్వతంత్ర హోదా కూడిన పదవులు లభించాయి. 2.0 మంత్రివర్గంలో సహాయ మంత్రులైన అనుప్రియా పటేల్ (అప్నాదళ్–యూపీ), రామ్‌దాస్ అథవాలె (ఆర్పీఐఏ–మహారాష్ట్ర)లకు మళ్లీ చాన్సిచ్చారు. వారితో పాటు రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ)లకు సహాయ మంత్రి పదవులు దక్కాయి.

యూపీకి అత్యధికంగా 9 బెర్తులు

కేంద్ర మంత్రివర్గంలో ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా 9 స్థానాలు దక్కాయి. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్న కీలకమైన బిహార్‌కు ఏకంగా 8 బెర్తులు దక్కాయి! ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రకు కూడా ఆరు బెర్తులు లభించాయి. గుజరాత్‌కు ఐదు; మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు ఐదేసి; హరియాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులకు మూడేసి; ఒడిశా, అస్సోం, జార్ఖండ్, తెలంగాణ, పంజాబ్, పశ్చిమబెంగాల్‌కు రెండేసి చొప్పున స్థానాలు దక్కాయి. అయితే యూపీకి ఒకే కేబినెట్ హోదా బెర్తు దక్కగా బిహార్‌కు ఏకంగా నాలుగు లభించడం విశేషం! గుజరాత్‌కు కూడా మోదీ, అమిత్ షా, మాండవీ, సీఆర్ పాటిల్ రూపంలో ఏకంగా నాలుగు కేబినెట్ హోదా బెర్తులు దక్కాయి! మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు మూడేసి; మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఒడిశాలకు రెండేసి కేబినెట్ మంత్రి పదవులు దక్కాయి. తెలంగాణ, ఏపీలతో పాటు హరియాణా, పంజాబ్‌లకు ఒక్కో కేబినెట్ హోదా బెర్తు దక్కాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి 13 మందికి మంత్రివర్గంలో చోటు దక్కింది.

మోదీ 3.0 టీమ్

1. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి

కేబినెట్ హోదా

2. రాజ్‌నాథ్‌సింగ్, 3. అమిత్ షా, 4. నితిన్ గడ్కరీ, 5. జేపీ నడ్డా, 6. శివరాజ్‌సింగ్ చౌహాన్, 7. నిర్మలా సీతారామన్, 8. ఎస్.జైశంకర్, 9. మనోహర్‌లాల్ ఖట్టర్, 10. హెచ్.డి.కుమారస్వామి (జేడీఎస్), 11. పీయూష్ గోయల్, 12. ధర్మేంద్ర ప్రధాన్, 13. జితిన్ రాం మాంఝీ (హెచ్ఏఎల్), 14. రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) (జేడీయూ), 15. సర్బానంద సోనోవాల్, 16. వీరేంద్ర కుమార్, 17. కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), 18. ప్రహ్లాద్ జోషీ, 19. జ్యుయల్ ఓరం, 20. గిరిరాజ్‌సింగ్, 21. అశ్వినీ వైష్ణవ్, 22. జ్యోతిరాదిత్య సింధియా, 23. భూపేందర్ యాదవ్, 24. గజేంద్రసింగ్ షెకావత్, 25. అన్నపూర్ణాదేవి, 26. కిరణ్ రిజిజు, 27. హర్దీప్‌సింగ్ పురి, 28. మన్‌సుఖ్ మాండవీయ, 29. జి.కిషన్‌రెడ్డి, 30. చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ), 31. సి.ఆర్.పాటిల్.

స్వతంత్ర హోదా

32. రావ్ ఇందర్‌జీత్ సింగ్, 33. జితేంద్ర సింగ్, 34. అర్జున్‌రాం మేఘ్వాల్, 35. ప్రతాప్‌రావ్ జాదవ్ (శివసేన), 36. జయంత్ చౌదరి (ఆరెల్డీ).

సహాయ మంత్రులు

37. జితిన్ ప్రసాద్, 38. శ్రీపాద నాయక్, 39. పంకజ్ చౌదరి, 40. కృషన్‌పాల్ గుర్జర్, 41. రామ్‌దాస్ అథవాలె (ఆర్పీఐ), 42. రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), 43. నిత్యానంద్ రాయ్, 44. అనుప్రియా పటేల్ (అప్నాదళ్), 45. వి.సోమన్న, 46. చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ), 47. ఎస్పీ సింగ్ భగెల్, 48. శోభా కరంద్లాజె, 49. కీర్తివర్ధన్ సింగ్, 50. బి.ఎల్.వర్మ, 51. శాంతను ఠాకూర్, 52. సురేశ్ గోపీ, 53. ఎల్.మురుగన్, 54. అజయ్ టంటా, 55. బండి సంజయ్ కుమార్, 56. కమలేశ్ పాశ్వాన్, 57. భగీరథ్ చౌదరి, 58. సతీశ్‌చంద్ర దూబె, 59. సంజయ్ సేథ్, 60. రవ్‌నీత్‌సింగ్ బిట్టూ, 61. దుర్గాదాస్ ఉయికే, 62. రక్షా ఖడ్సే, 63. సుకాంత మజుందార్, 64. సావిత్రీ ఠాకూర్, 65. తోఖన్ సాహు, 66. రాజ్‌భూషణ్ చౌదరి, 67. భూపతిరాజు శ్రీనివాస వర్మ, 68. హర్ష్ మల్హోత్రా, 69. నిమూబెన్ బంభానియా, 70. మురళీధర్ మొహోల్, 71. జార్జి కురియన్, 72. పబిత్రా మార్గరీటా.

'నైరుతి' మందగమనం!

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డంకులేర్పడతాయి. ప్రస్తుతం రెండు రోజుల నుంచి ఉత్తరాంధ్రపై అధిక పీడన ద్రోణి కొనసాగుతోందని ఆంధ్రా విశ్వవిద్యాలయం వాతావరణం, సముద్ర అధ్యయన విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ 'సాక్షి'కి చెప్పారు. దీనివల్ల విజయనగరం వరకు విస్తరించిన రుతుపవనాలు చురుకుదనం సంతరించుకోకుండా స్తబ్దుగా ఉన్నాయన్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా.. ఉత్తరాంధ్రలో అక్కడక్కడ తేలికపాటి జల్లులే పడుతున్నాయని తెలిపారు. పైగా ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయన్నారు. మరో రెండు మూడు రోజుల్లో అధిక పీడన ద్రోణి బలహీనపడుతుందని చెప్పారు. ఆ తర్వాత రుతుపవనాలు పుంజుకుంటాయని.. దీంతో మళ్లీ వర్షాలు ఊపందుకుంటాయని వివరించారు.

మూడు రోజులపాటు వర్షాలు..



మరోవైపు రానున్న మూడు రోజులు రాయలసీమ, కోస్తాంధ్రల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే బుధవారం ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. అలాగే అల్లూరి, పల్నాడు, బాపట్ల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది.

ప్రధాని మోదీకి వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: దేశ ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

అమరావతిలో సీఎస్ పర్యటన

సాక్షి, అమరావతి/తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పర్యటించారు. ఉద్దండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్ట్ స్థలాన్ని సందర్శించారు. ఐఏఎస్, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో ఉద్యోగుల నివాస భవన సముదాయాలు తదితరాలను పరిశీలించారు. పనులను ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే దానిపై సీఆర్డీఏ అధికారులతో చర్చించారు.

నసనకోట ఆలయంలో అరాచకం

హుండీని ధ్వంసం చేసి.. అర్చకులపై దాడికి టీడీపీ నేతల యత్నం

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీసత్యసాయి జిల్లా నసనకోటలోని ముత్యాలమ్మ ఆలయంలో టీడీపీ నేతలు అరాచకానికి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి ఆలయ అర్చకులపై దాడికి యత్నించారు. ఈ ఆలయం కొన్నేళ్లపాటు టీడీపీకి చెందిన పరిటాల కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంది. వారే ఆలయ ధర్మకర్తలుగా ఉండేవారు. ఆలయ అభివృద్ధిని మాత్రం పట్టించుకునేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చి ఆలయ కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తూ వచ్చారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించిన తర్వాత ఆ పార్టీ నేతలు ఆలయాన్ని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకునేందుకు పథకం వేశారు. ఆదివారం ముత్యాలమ్మ ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టారు. అర్చకులు, సిబ్బందిపై దాడికి యత్నించారు. ఇక నుంచి తాము చెప్పినట్టే నడుచుకోవాలంటూ హుకుం జారీ చేశారు. సొంతంగా ఆలయ నిర్వహణ చేపట్టాలనే ఉద్దేశంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు ఆలయ కమిటీ చైర్మన్ బోయ ముత్యాలప్ప తెలిపారు.

నేటి భవితలో..

- టీఎస్ సెట్ 2024:
  అచార్యులు కావడానికి అర్హత పరీక్ష!
  తెలంగాణ యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, లెక్చరర్లుగా నియమితులయ్యే అభ్యర్థులకు అకడమిక్ నైపుణ్యాలతోపాటు, సంబంధిత సబ్జెక్టులపైనా లోతైన అవగాహన ఉండాలి. ఇలాంటి ప్రతిభ, నైపుణ్యాలను అంచనా వేయడానికి నిర్వహించే అర్హత పరీక్ష.. టీఎస్ సెట్ (తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష). ఇందులో సాధించిన స్కోరు ఆధారంగానే లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపడతారు. ప్రస్తుతం 2024 సంవత్సరానికి టీఎస్ సెట్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ సెట్‌కు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..
- గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ స్టడీ మెటీరియల్, విద్య, ఉద్యోగ సమాచారం.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

రామోజీకి అశ్రు నివాళి

ఫిలింసిటీలోని నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమయాత్ర

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రముఖ వ్యాపారవేత్త చెరుకూరి రామోజీ రావు అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. ఉదయం ఫిలింసిటీలోని ఆయన నివాసం నుంచి స్మృతివనం వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. రామోజీ చితికి ఆయన కుమారుడు కిరణ్ నిప్పంటించారు.



రామోజీ పాడెను మోస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

ప్రముఖుల నివాళి

రామోజీరావు (88) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం నుంచి ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం రామోజీ మృతదేహాన్ని ఫిలింసిటీలోని నివాసంలో ఉంచారు. ఆదివారం ఉదయం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, బీజేపీ ఎంపీలు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్, దేవినేని ఉమా, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను, నటుడు మురళీ మోహన్ తదితరులు రామోజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. రామోజీతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

పాడె మోసిన చంద్రబాబు

ఆదివారం ఉదయం 9.30 గంటలకు రామోజీ నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమైంది. అంతిమ యాత్ర వాహనంపై కుమారుడు కిరణ్, కోడళ్లు శైలజ, విజయేశ్వరి, మనవరాళ్లు సహరి, బృహతి, దివిజ, కీర్తి, సోహన, మనవడు సుజయ్‌తోపాటు జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి తదితరులు కూర్చున్నారు. ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర స్మృతివనానికి చేరుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అంతిమ యాత్రలో పాల్గొని రామోజీ పాడె మోశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. 11.30 గంటల సమయంలో రామోజీ భౌతికకాయాన్ని చితిపై ఉంచారు. పోలీసులు గౌరవ వందనం చేసి, గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపిన తర్వాత.. రామోజీ కుమారుడు కిరణ్ చితికి నిప్పంటించారు.

'నీట్'పై టెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి

అసలు నీట్ ఫలితాలు ఇవే ఉంటాయా? వాటిని రద్దు చేస్తారా? మళ్లీ నీట్ పరీక్ష ఏమైనా పెడతారా? అన్న భయాందోళనలు విద్యార్థుల్లో నెలకొన్నాయి. మరోవైపు నీట్ ఫలితాలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఒక కమిటీని ఏర్పాటు చేయడంతో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. రద్దు ఉండకపోవచ్చని... దానివల్ల విద్యార్థులు మరింత నష్టపోతారని అధికారులు అంటున్నారు.

ఎన్టీఏపై విమర్శల వెల్లువ

మే 5న నీట్ పరీక్ష జరగ్గా, ఫలితాలను జూన్ 14న ప్రకటిస్తామని ఎన్టీఏ ముందుగానే ప్రకటించింది. కానీ జూన్ 4న దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠగా ఎదురుచూస్తుంటే... అదే రోజు చడీచప్పుడు కాకుండా నీట్ ఫలితాలను ఎన్టీఏ ప్రకటించడం అనుమానాలకు తావిస్తోంది. అంత హడావుడిగా ప్రకటించాల్సిన అవసరం ఏమొచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పక్కదారి పట్టించేందుకు ఆరోజు విడుదల చేశారన్న చర్చ జరుగుతోంది. అలాగే ఫలితాలను చూసుకునేందుకు విద్యార్థులకు ముందే అవకాశం కల్పించారు. అయితే, ఆలిండియా ర్యాంకులు.. మార్కులు.. ఫలితాల సమగ్ర సమాచారాన్ని మాత్రం ఆరోజు మరింత ఆలస్యం చేసి ఇచ్చారు. ఇలా అనుమానాలకు తావిచ్చేలా ఎన్టీఏ వ్యవహరించిందన్న చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనూ ఆలస్యం

పలువురు విద్యార్థులకు ఎన్టీఏ గ్రేస్ మార్కులు ఇచ్చిన అంశంపైనా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. నీట్ పరీక్ష సమయం 3 గంటల 20 నిమిషాలు. కొన్ని కేంద్రాల్లో ప్రశ్నాపత్రాల అందజేతలో ఆలస్యం, చిరిగిన ఓఎంఆర్ పత్రాలు తదితర కారణాల నేపథ్యంలో సమయం వృథా అయ్యిందంటూ కొందరు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పంజాబ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, హరియాణ న్యాయస్థానాల్లో రిట్ పిటిషన్లు కూడా దాఖలు చేశారు. దీంతో సీసీటీవీ ఫుటేజీ, ఇతర ఆధారాలను ఎన్టీఏ సమీక్షించి వారికి గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలిపింది. అలాగైతే దేశంలో అనేకచోట్ల విద్యార్థులకు ఆలస్యంగా పరీక్ష పేపర్ ఇచ్చారు. వారిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న ప్రశ్నలూ వినిపిస్తున్నాయి. హైదరాబాద్ మాదాపూర్‌లోని మెరీడియన్ స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోని ఒక రూంలో ప్రశ్నపత్రాన్ని 20 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చారు. ఆ గదిలో గడియారం ఆగిపోవడం... తప్పుగా చూపించకపోవడంతో ఆలస్యం చేశారు. తప్పు సిబ్బందిదే అయినా కానీ విద్యార్థులకు అదనపు సమయం ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు అనేకమంది ప్రశ్నలు రాయలేకపోయారు. అంత సమయం పోవడం వల్ల తమకు మార్కులు తగ్గుతాయని, రావాల్సిన సీటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. మరి వారికెందుకు గ్రేస్ మార్కులు కలపలేదని ప్రశ్నిస్తున్నారు.

ప్రసవానంతరమే మాతృ మరణాలెక్కువ..

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మాతృ మరణాలు ఎక్కువగా ప్రసవానంతరం చోటు చేసుకుంటున్నాయి. గర్భంతో ఉన్నప్పుడు లేదా ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం 42 రోజుల్లో మహిళ ప్రాణాలు కోల్పోతే ప్రసూతి మరణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పరిగణిస్తుంది. 2023–24లో రాష్ట్రంలో 362 మాతృ మరణాలు సంభవించాయి. వీటిపై వైద్యశాఖ ఆడిట్ నిర్వహించింది. ఈ క్రమంలో 265 మరణాలు (73 శాతం) ప్రసవానంతరం చోటుచేసుకున్నట్లు తేలింది. మరో 26 శాతం అంటే 94 మరణాలు ప్రసవానికి ముందు, మరో ఇద్దరి మరణం ప్రసవం సమయంలో సంభవించింది.

30 వారాలు దాటాక 45 మరణాలు..

ఇక ప్రసవానికి ముందు సంభవించిన 94 మరణాల్లో 30 వారాలు దాటాక అత్యధికంగా 45 మరణాలున్నాయి. 25–29 వారాల్లో 18 మంది, 16 వారాల్లోపు 14 మంది, 7–20 వారాల మధ్య 11 మంది, 21–24 మధ్య ఆరు మంది గర్భిణులు మృతిచెందారు. ఇక ప్రసవానంతరం చోటుచేసుకున్న మరణాల్లో 2/3వంతు తొలి 48 గంటల్లోనే ఉన్నాయి.

మూడు ప్రధాన కారణాలు..

గర్భ ధారణ మహిళకు పరీక్షా సమయం అనే చెప్పొచ్చు. ఈ సమయంలో వారి శరీరంలో అనేక మార్పులు వస్తాయి. వీటిల్లో అధిక రక్తపోటు, ప్రసవానంతర రక్తస్రావం, సెప్టిసీమియా.. ఈ మూడు మాతృ మరణాలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. గర్భం ధరించిన తర్వాత మహిళలు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బీపీసీఎల్ ఆర్‌అండ్‌డీ విభాగం జీఎంగా 'తోట'

తెనాలి శాస్త్రవేత్తకు అరుదైన గౌరవం



తెనాలి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)కు నొయిడాలో ఉన్న పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) విభాగంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న తెనాలికి చెందిన డాక్టర్ తోట చిరంజీవి ఆ విభాగం జీఎంగా పదోన్నతి పొందారు. పెట్రోలియంను శుద్ధిచేసే క్యాటలిస్ట్‌ను స్వదేశీ పరిజ్ఞానంతో ఆవిష్కరించిన ఘనతను చిరంజీవి సాధించారు. ఆ విభాగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ పదవిలోకి వచ్చారు. సీనియర్ శాస్త్రవేత్తగా జాతీయస్థాయిలో ఫిక్కీ అవార్డుతో సహా పలు గౌరవాలను అందుకున్నారు. గతేడాది కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియన్ ఆయిల్ అండ్ గ్యాస్ అవార్డ్స్‌లో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఇనీషియేటివ్ ఆఫ్ ది ఇయర్, ఇండియా అవార్డును స్వీకరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్-ఇన్నోవేషన్ కేటగిరీల్లో సీఐఐ బెస్ట్ ప్రాక్టీసెస్ అవార్డును అందుకున్నారు. తోట రాసిన 91 పరిశోధన పత్రాలు జాతీయ/అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పలు పేటెంట్లు లభించాయి. 24 మంది బీటెక్/ఎంఎస్సీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనలు/ప్రాజెక్ట్‌లకు మార్గనిర్దేశనం చేశారు. వీరి స్వస్థలం తెనాలి రూరల్ మండలం అంగలకుదురు గ్రామం. సాధారణ కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నారు. డాక్టర్ చిరంజీవిని బీపీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.కృష్ణకుమార్ అభినందించారు.


కంగనాను కొట్టిన కానిస్టేబుల్‌కు గోల్డ్ రింగ్

ప్రకటించిన తంథై పెరియార్ ద్రావిడ కళగం పార్టీ

సాక్షి, చెన్నై: బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్‌కు తమిళనాడులోని తంథై పెరియార్ ద్రావిడ కళగం పార్టీ గోల్డ్‌రింగ్‌ను కానుకగా ప్రకటించింది. ఇటీవల చండీగఢ్ విమానాశ్రయంలో కంగన రనౌత్‌ను సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చెంపదెబ్బ కొట్టిన విషయం తెలిసిందే. పంజాబ్ రైతులను కించపరిచే విధంగా ఆమె చేసిన వ్యాఖ్యలకే చెంప దెబ్బ కొట్టినట్టు విచారణలో తేలింది. ఈ కారణంగా విధుల నుంచి సస్పెండ్ అయిన కుల్విందర్ కౌర్‌కు మద్దతు పెరుగుతోంది. ఈక్రమంలోనే తమిళనాడులోని తంథై పెరియార్ ద్రావిడ కళగం ఆమెకు గోల్డ్‌రింగ్‌ను కానుకగా ఇవ్వనున్నట్లు ఆదివారం కోయంబత్తూరులో పార్టీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణన్ ప్రకటించారు.

అలా వాడేయటం ఆరోగ్యానికి యాంటీ

- యాంటీ బయోటిక్స్ విచ్చలవిడి వాడకంతో ఆరోగ్యానికి ముప్పు
- శరీరంలో సూక్ష్మజీవ నాశక నిరోధకత (ఏఎంఆర్) ఉత్పన్నం
- ఆరోగ్య విపత్తుల్లో ఏఎంఆర్ ప్రధానమైనదంటున్న డబ్ల్యూహెచ్‌వో
- జలుబు, దగ్గు, జ్వరం వంటి వాటికి యాంటీ బయోటిక్స్ వాడొద్దని హెచ్చరిక



సాక్షి, అమరావతి: జలుబుకు మందు వేస్తే వారానికి.. వేయకపోతే ఏడు రోజులకు తగ్గిపోతుందనేది తెలుగునాట తరచూ వినిపించే మాట. స్మార్ట్ ఫోన్లు వచ్చాక దగ్గు.. జలుబు.. జ్వరం.. ఒంట్లో నలతగా అనిపిస్తే వెంటనే గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారు. అందులో సూచించే మందులను మెడికల్ షాపులకు వెళ్లి కొనేస్తున్నారు. వాటిలో యాంటీ బయోటిక్స్ కూడా ఉంటున్నాయి. కొందరైతే మెడికల్ షాపులకు వెళ్లి తనకొచ్చిన నలత ఏమిటో చెప్పి నేరుగా యాంటీ బయోటిక్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. ఈ అలవాటు ఆరోగ్యానికి పెనుముప్పు తెచ్చిపెడుతోంది.

చాలా ప్రమాదం సుమా!

యాంటీ బయోటిక్స్‌ను మితిమీరి వినియోగించడం వల్ల సూక్ష్మజీవనాశక నిరోధకత (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్) సమస్య ఉత్పన్నం అవుతోంది. వైద్య నిపుణుల సలహా లేకుండా యాంటీ బయోటిక్స్‌ను ఇష్టారీతిన వినియోగిస్తే.. వ్యాధి కారకాలు రోగనిరోధక శక్తి పెంచుకుని.. చివరకు ఏ మందుకూ లొంగకుండా మరింత బలం పుంజుకుంటాయి. టీకాలు, ఔషధాలు ప్రయోగించినా ఫలితం లేకుండాపోతుంది. ఇలా తయారు కావటాన్ని యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అంటారు. ఏఎంఆర్ కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది మరణిస్తున్నారు. గత ఏడాది దక్షిణాఫ్రికా, యూకేలో జరిగిన ఓ అధ్యయనంలో ఈ అంశం వెల్లడైంది. కాగా.. 2050 నాటికి ఏఎంఆర్ కారణంగా మృత్యువాత పడేవారి సంఖ్య కోటికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రపంచం ఎదుర్కొంటున్న తొలి పది ఆరోగ్య సంక్షోభాల్లో ఏఎంఆర్ ఒకటని డబ్ల్యూహెచ్‌వో సైతం స్పష్టం చేస్తోంది.


ప్రిస్క్రిప్షన్ లేకుండానే..

వైద్యులను సంప్రదించకుండా.. ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ వాడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డ్రగ్ అండ్ కాస్మొటిక్స్ చట్టం 1945లోని షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించకూడదని ఔషధ నియంత్రణా శాఖ హెచ్చరిస్తున్నా మెడికల్ షాపుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు వైద్య శాఖ సైతం ఏఎంఆర్‌పై ప్రత్యేక ప్రణాళికను రచించింది. పశుసంవర్థక, పంచాయతీరాజ్, మునిసిపాలిటీ, ఇతర శాఖలను సమన్వయ పరుచుకుంటూ ఏఎంఆర్ నియంత్రణపై ముందుకు అడుగులు వేస్తోంది. ప్రజలకు సైతం యాంటీబయోటిక్స్ వాడకంపై అవగాహన కల్పిస్తోంది.

స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



చింతల సుబ్బారావు, రాష్ట్ర అధ్యక్షుడు



నరోత్తమ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సాక్షి, అమరావతి: స్కూలు అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం తిరుపతి టీపీపీఎం పాఠశాలలో నిర్వహించినట్టు యూనియన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆకాంక్షలు తప్పక నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు, జెడ్పీపీఎఫ్, ఏపీజీ ఎల్ఐసీ లోన్స్, కరువు భత్యం బకాయిలు, ఐఆర్, 117 జీవో రద్దు, సమాంతర తెలుగు మాధ్యమం, 3, 4, 5 తరగతుల విలీన ఉపసంహరణ, +1, +2లో పదోన్నతులు, అన్ని రకాల ఖాళీల పదోన్నతులు, '0' సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా శరత్ బాబు(ప్రకాశం), రాష్ట్ర అధ్యక్షుడిగా చింతల సుబ్బారావు (బాపట్ల), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూతలపట్టు నరోత్తమరెడ్డి, మహిళా ప్రతినిధిగా బి.సుజాతతో పాటు మరో నలుగురిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్టు ప్రధాన కార్యదర్శి నరోత్తమరెడ్డి వివరించారు.

సర్వదర్శనం టైమ్‌స్లాట్ టికెట్ల కోసం..



విష్ణు నివాసం రైల్వే స్టేషన్ రోడ్‌లో శ్రీవారి దర్శన టికెట్ల కోసం బారులు తీరిన భక్తులు

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుపతిలోని కౌంటర్ల వద్ద శనివారం అర్ధరాత్రి సర్వదర్శనం టైమ్‌స్లాట్ టిక్కెట్ల కోసం రైల్వే స్టేషన్ సమీపంలోని విష్ణు నివాసం నుంచి పీజీఆర్ థియేటర్ రోడ్డు వరకు భక్తులు బారులు తీరారు. తగిన ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

రెండు వజ్రాలు లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి, చిన్నజొన్నగిరి గ్రామాల్లో ఇద్దరికి విలువైన వజ్రాలు లభ్యమైనట్లు సమాచారం. పగిడిరాయిలో దొరికిన వజ్రాన్ని రూ.4.40 లక్షలు, చిన్నజొన్నగిరిలో దొరికిన వజ్రాన్ని రూ.1.30 లక్షలు, రెండు తులాల బంగారం ఇచ్చి వ్యాపారులు ఆదివారం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

సమాజానికి అండగా ఉండాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్



వేడుకలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సామాజిక సేవలందించే సంస్థలు సమాజానికి మరింత అండగా ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సూచించారు. అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ.. అన్నసంతర్పణ సమితి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం, వాసవి క్లబ్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, కార్యదర్శి పీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. మూడేళ్లుగా నిర్విరామంగా నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో ఒక సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అనంతరం సేవలందించిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించారు.

దుర్గమ్మ సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

పి.కొత్తపల్లిలో శిలాఫలకం ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం

ఎన్పీకుంట: శ్రీసత్యసాయి జిల్లా ఎన్పీకుంట మండలం పి.కొత్తపల్లి గ్రామ సచివాలయం సమీపాన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎన్పీ కుంట - పెడబల్లి ప్రధాన రహదారి నుంచి పి.కొత్తపల్లికి రూ.34 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు వేసి, అప్పటి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆనాడు సీఎం, ఎమ్మెల్యే ఫొటోలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఇప్పుడు ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ఎవరో పగులగొట్టారని వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఉపసర్పంచ్ సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ సామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నమనాయుడు, మాధవరెడ్డి ఆదివారం ఎన్పీకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు.



మొదటి సూత్రం ఏమిటంటే, మిమ్మల్ని మీరు అసలు మోసం చేసుకోవద్దు: మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడం అత్యంత సులువు.

– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 10 జూన్ 2024

అత్యున్నత ఐదువేలు

దాదాపు నూట నలభై కోట్ల మంది భారతీయుల్లో ఒక పదకొండు వేల మంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది? పోనీ నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల నుంచి, ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల నుంచి కలిపి వేయిమంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది? లెక్క తరువాత మాట్లాడుదాం.

'సినిమా రంగంలో రచయితకు అత్యంత తక్కువగా డబ్బు ఇవ్వాలని నిర్మాతకు ఎందుకనిపిస్తుందంటే అతను ఖాళీ చేతులతో వస్తాడు కనుక' అని రచయిత సోదా అంటాడు. నిజమే. మేకప్ వేసేవాడు పెద్ద కిట్ తెస్తాడు. విగ్గులకు డబ్బు అడుగుతాడు. కాస్ట్యూమ్ డిజైనర్ బోలెడన్ని బట్టలు కొనాలి కనుక బిల్లు ఎక్కువ. సినిమాటోగ్రాఫర్ కెమెరాలు, లెన్సులు, క్రేన్లు, భారీ పరికరాలు... ఇన్ని వాడుతున్నాడంటే అతనికి ఎంతిచ్చినా తక్కువే. కళా దర్శకుడు వేసే సెట్ కనిపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ దగ్గర వాద్యాల బృందం కనిపిస్తుంది. మరి రచయిత దగ్గరో? ఒక తెల్లకాగితం, పెన్ను. ఐదు రూపాయల పెన్ను జేబులో పెట్టుకుని వచ్చేవాడికి, కాగితం మీద అప్పటికప్పుడు రాసిచ్చి వెళ్లేవాడికి డబ్బు ఇవ్వడం అవసరమా అని నిర్మాతకేం ఖర్మ, ఎవరికైనా అనిపిస్తుంది. చిత్రమేమిటంటే సినిమా 'సీన్ పేపర్' నుంచే మొదలవుతుంది. దానిని రచయితే రాయాలి.

తన దగ్గరకు వచ్చిన ఆసామీకి టీ ఇచ్చి, అతను తాగి కప్పు దించే లోపలే పాట రాసి ఇచ్చాడట ఆత్రేయ. 'ఐదు నిమిషాల్లో రాశారు. దీనికింత డబ్బు ఇవ్వడం అవసరమా' అన్నాడట ఆసామీ లాల్చీ జేబులో చేయి పెట్టి నసుగుతూ. ఆత్రేయ మొహమాటపడక డబ్బు అందుకుని 'ఈ ఐదు నిమిషాల వెనుక ముప్పై ఏళ్ల తపస్సు ఉంది నాయనా' అన్నాడట. రచయిత చేతికి పని చెప్పే మెదడు ఉందే, అది రాతకు తయారుగా ఉందే, ఆ మెదడు అలా తయారు కావడానికి రచయిత ఏమేమి చేసి ఉంటాడు? ఎన్ని రాత్రులను పుస్తకాలు చదువుతూ తగలెట్టి ఉంటాడు? ఎన్ని తావుల్లో తిరుగుతూ మనుషుల్లో పాత్రలను వెతుకుతూ వారి చెమట, కన్నీరు, రక్తపు చారికలు పూసుకుని ఉంటాడు? వారి సద్బుద్ధుల చందనంలో, దుర్బుద్ధుల దుర్గంధంలో వారే తానై బతికి ఉంటాడు? ఆ రాత్రి ఉదయించిన సంపూర్ణ చంద్రుడి రంగును సరైన మాటల్లో వర్ణించడానికి ఎన్ని గుప్పుల పొగను తాగి ఊపిరిని నలుపు చేసుకుని ఉంటాడు? ఒక గొప్ప వాక్యం కోసం ఎన్ని వందల కాగితాలను చించి ఉంటాడు? ఒక కావ్యజన్మ కోసం ఎన్ని ఊహా పరిష్వంగాలలో పదేపదే సొమ్మసిల్లి ఉంటాడు?

లాల్చీ, పైజామా, జేబులో పెన్నుతో అతడు ఎదురు పడినప్పుడు– అవశ్యం– అతని మేధాశ్రమ ఏదీ కనిపించదు. కనుక కలం పట్టి అతను రాసే రాతకు అత్యల్ప రుసుము ఇవ్వవచ్చనే ఆనవాయితీ ఎవరైనా పాటించవచ్చు. కథకు, కవితకు 500 రూపాయల పారితోషికం ఇవ్వొచ్చు. ఇవ్వక ఎగ్గొట్ట వచ్చు. పదుగురిని అడిగో, పి.ఎఫ్ బద్దలు కొట్టో పుస్తకం వేస్తే అమ్మిన ప్రతుల సొమ్ము అమ్మకందారు ఇవ్వొచ్చు. ఇవ్వక పోవచ్చు. పబ్లిషర్లు ఎవరైనా ఉంటే వారు రాయల్టీ ఇవ్వొచ్చు. ఇవ్వకపోనూవచ్చు. ఒకసారి రచయిత పుస్తకం వేశాక వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితరాలలో ఉండే సాహితీ సూక్ష్మక్రిములు అది తమ సొంతంగా భావించి వందలాది పి.డి.ఎఫ్‌లు పంచొచ్చు... పుస్తకం కొనకనే చదువుకోవచ్చు.

ఇవన్నీ ఇలాగుంటే తెలుగునాట సాహితీకారులను ప్రోత్సహించడానికి 'ఐదు వేలు' అనే అచ్చొచ్చిన నంబర్ ఒకటి ఉంది. పాతిక, ముప్పై ఏళ్ల క్రితం మొదలైన 'ఐదు వేల రూపాయల' అవార్డు/బహుమతి తెలుగు సాహితీజాతికి లక్ష్మణరేఖ. నేటికీ, 2024లో కూడా, 'చార్జీలతో కలిపి 5000 రూపాయల' అవార్డు ప్రకటిస్తే అదే పదివేలనుకుని భార్యాపిల్లలను వెంటబెట్టుకువెళ్లే దుఃస్థితి తెలుగు రచయితది. తెలుగు నేలన ఎక్కడ పట్టినా నేటికీ 'మొదటి బహుమతి 5 వేలు, రెండవ బహుమతి 3 వేలు, మూడవ బహుమతి వేయి రూపాయల' దిక్కుమాలిన కథాపోటీలు. వాటికి రాసే సీనియర్ రచయితలు! సాహితీ అకాడెమీ పురస్కార గ్రహీతలు! వెయ్యి రూపాయల లిస్టులో వీరి పేర్లు! రూపాయి ఊసెత్తక తలపాగా, ముఖం తుడవను పనికిరాని శాలువాతో ఇచ్చే అవార్డులు కొల్లు. వీటికి తోడు 116 డాలర్లు మొహానకొట్టే ఎన్.ఆర్.ఐ వితరణశీలత ఏమని చెప్పుట?

ఇంటికి చెద పట్టిందని ఫోన్ చేస్తే ఐదు వేలకు తక్కువగా ఎవరూ రావడం లేదు. గంట కార్పెంటర్ పని చేస్తే రెండు వేలు నిలబెట్టి వసూలు చేస్తాడు. ప్లంబర్ వచ్చి వాష్‌బేసిన్ వైపు చూడాలంటే కనీస వెల వెయ్యి. కాని తెలుగు రచయిత మాత్రం తన దశాబ్దాల తపస్సుకు 'బాబూ... ఒక్క ఐదు వేలు' అంటున్నాడు. తెలుగు సాహితీవరణంలో నిషేధించాల్సిన ఒకే ఒక నంబర్– ఐదు వేలు!

140 కోట్ల భారతీయులలో పదకొండు వేల మంది వంద రూపాయలు ఇస్తే పదకొండు లక్షలు అవుతాయి. అది మన జ్ఞానపీఠ్ అవార్డు నగదు బహుమతి! 9 కోట్ల తెలుగువారిలో వెయ్యి మంది వంద రూపాయలు ఇస్తే లక్ష అవుతుంది. అది సాహిత్య అకాడెమీ నగదు బహుమతి. జీవితంలో ఒకసారి పొందే వీటి నగదులే ఇలా ఉంటే ఐదు వేల అవార్డుకు వంకలేల అంటారా? ఆ అత్యున్నత అంకెతో అత్యల్పంగా బతికేద్దాం!

పాత మోదీపై 'కొత్త మోదీ' నెగ్గగలరా?

కామెంట్



కరణ్ థాపర్

నరేంద్ర మోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావటం అన్నది జరిగింది. కీలకమైన ప్రశ్న ఏమిటంటే – ప్రధాన మంత్రిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరన్నదే! సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవటం, తరచూ వారికి లోబడి ఉండటం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచటం వంటి వాటికి ఆయన సంసిద్ధతను కలిగి ఉంటారా? గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా 10 సంవత్సరాలు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. అందుకు భిన్నంగా పాత మోదీ ఇప్పుడు కొత్త మోదీ కాగలరా?

మునుపు మీరీ నానుడిని నిస్సందేహంగా విని ఉంటారు. ఎంచేతనంటే ఇదొక కాదన లేని సత్యం. కొరుకుడు పడనివిగా కనిపించే పరిస్థితులను ఓటర్ల సమష్టి విజ్ఞత చక్కబెట్టగలగటమే ప్రజాస్వామ్యంలోని అద్భుతమైన విషయం. 1977లో ఇలా జరిగింది. మళ్లీ ఈ జూన్ 4న ఇది సంభవించింది. ఫలితాల్లో పై విధమైన అద్భుతాన్ని చాలామందే ఆశించినప్పటికీ, నిజానికి కొద్దిమందే అది కార్యరూపం దాల్చుతుందని భావించారు.

నరేంద్ర మోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావటం అన్నది జరిగింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత దారుణమైన ఫలితాలను ఈ ఎన్నికల్లో బీజేపీ చవి చూసింది. మెజారిటీకి 30కి పైగా తక్కువ సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి, విశ్వసనీయత ఎల్లప్పుడూ ప్రశ్నార్థకమైన మిత్ర పక్షాల మద్దతు అవసరం. గతంలో వారు బీజేపీని విడిచి పెట్టిన సందర్భాలు ఉన్నాయి. వారు మళ్లీ అలా చేస్తారనటాన్ని తోసిపుచ్చలేము.

ఇది ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి పాలనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇప్పటికైతే వాటికి మన దగ్గర సమాధానాలు లేవు. బహుశా మోదీకి కూడా అవి తెలియక పోవటానికే అవకాశం ఎక్కువ. కానీ ఆ ప్రశ్నలు ఆయన ఎదుర్కొనే సవాలును సూచిస్తాయి. ఆ ప్రశ్నల సమాధానాలు ఆయన గురించి ఎన్నో విషయాలు వెల్లడిస్తాయి. భారతదేశానికి ఎదురవనున్న ప్రమాదాలను, లేదంటే కనీసం సమస్యలను అవి బయటపెడతాయి.

బీజేపీ 370 సీట్లు గెలుచుకుంటుందని మోదీ మొదటి నుంచి జోస్యం చెబుతూ వచ్చారు. ఐదో విడత పోలింగ్ అయ్యాక 'ఎకనమిక్ టైమ్స్'తో మాట్లాడుతూ తమ పార్టీ అప్పటికే 272 మార్కును దాటేసిందని అన్నారు. కానీ, చివరికి అది 240 సీట్లతోనే ముగిసింది. మెజారిటీకి చాలా తక్కువ. కనుక, ఇవాళ ఆయన... కలవరపడే మనిషా లేక దులిపేసుకుని వెళ్లగలిగినంత మొద్దు చర్మం ఉన్నవారా?

వారణాసిలో ఆయనకు వచ్చిన ఓట్ల మాటేమిటి? 2019లో ఆయనకు 4 లక్షల 80 వేల మెజారిటీ వచ్చింది. అదిప్పుడు కేవలం లక్షా ఐదు వేలకు పరిమితం అయింది. ''గంగా మేరీ మా హై, ముఝే గంగా నే గోద్ లియా హై'' (గంగానది నా మాతృమూర్తి. గంగమ్మ తల్లి నన్ను దత్తత తీసుకుంది) అని గత నెలలో చెప్పుకున్న ఒక మనిషి.. పూర్తి వ్యక్తిగతమైన ఈ తిరోగమనాన్ని ఎలా తీసుకుంటారు?



2019 నాటి ఒక బహిరంగ ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ

ఏదేమైనా కీలకమైన ప్రశ్న ఏమిటంటే – ప్రధాన మంత్రిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరు? లేదా, సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవటం, తరచూ వారికి లోబడి ఉండటం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచటం వంటి వాటికి ఆయన సంసిద్ధంగా కలిగి ఉన్నారా?

గుర్తు చేసుకోండి. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా 10 సంవత్సరాలు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. బదులుగా ఆయన అభీష్టం ప్రతి ఒక్కరికీ ఆదేశం అయింది. ఆయన కేంద్రీకృత ప్రభుత్వాన్ని నడిపారు. ప్రధాని కార్యాలయం కోరినట్లే మంత్రులు నడుచుకున్నారు. ఒక్కరు కూడా ఇదేమిటి అని అడిగే సాహసం చేయలేదు.

పార్లమెంటు, జ్యుడీషియరీ, మీడియా వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థల పట్ల ఆయన వైఖరి గురించి ఏమిటి? శ్రీ 'పాత మోదీ' పార్లమెంటును పలుమార్లు విస్మరించారు. న్యాయశాఖలోని నియామకాలను నిలిపివేశారు. మీడియాను తీసిపడేశారు. కానీ ఇప్పుడు శ్రీ 'బలహీన మోదీ' మరింతగా ఏకాభిప్రాయ విధానాన్ని అవలంబించవలసిన అవసరం ఉంటుంది. లేదంటే తన మిత్రపక్షాలకు ఆయన కోపం తెప్పించవచ్చు. తన సంకీర్ణాన్ని ప్రమాదంలోకి నెట్టేసుకోవచ్చు. అలా చేయటానికి ఆయన సిద్ధంగా ఉంటారా?

ఇక విమర్శలకు, అసమ్మతికి ఆయన స్పందించే ధోరణి ఒకటి ఉంటుంది. శ్రీ పాత మోదీకి ఆ రెండూ నచ్చవన్నది రహస్యమేం కాదు. కనుక శ్రీ కొత్త మోదీ సహించటాన్ని, సమ్మతించటాన్ని మాత్రమే కాదు... రెండింటితో కలిసి ముందుకు సాగటాన్ని కూడా నేర్చుకోవాలి. అది అంత సులభమేనా?

మరికొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇటీవల ఆయన చేసిన ప్రకటనలకు సంబంధించినవి. వాటిని ప్రజలు మరిచి పోయి ఉంటారని ఆయన అనుకోవచ్చు. ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ వాతావరణంలో కాకపోవచ్చు కానీ, మొత్తానికైతే నేననుకోవటం అవి గుర్తుండే ఉంటాయని!

మొదటిగా, ఎన్నికల ప్రచారంలో ఆయన చెప్పిన కొన్ని విషయాలు ఉన్నాయి. ఆయన కనుక నవ్వటాన్ని, తేలిగ్గా తీసుకోవటాన్ని అలవరచుకోకపోతే అవి ఆయన్ని వెంటాడగలిగినవి. కానీ ఆయన అలా చేయగలరా? తనది దైవాంశ జననం అని ఆయన చెప్పుకోవడంపై అవహేళనలు ఎదురైతే ఆయన నవ్వుతూ, వాటిని పట్టించుకోకుండా ఉండగలరా? నా మాట గుర్తుపెట్టుకోండి. అవహేళనలు ఉంటాయి. అది జరిగినప్పుడు ఆయన కోపం తెచ్చుకుంటారా?

మరీ ముఖ్యంగా, ముస్లింలను దయ్యాలుగా చూపించకుండా ఉండలేకపోవటాన్ని నిలువరించుకోగలరా? ముస్లింలను చొరబాటుదారులుగా; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్‌లను లాక్కుని లబ్ధి పొందేవారిగా చూపే తదుపరి సందర్భాలలో మిత్రపక్షాలు అందుకు అంగీకరించే అవకాశం లేదు. కానీ అలాంటి భాష తన నుంచి స్వభావసిద్ధంగా బయటికి రాకుండా తనను తాను సంబాళించుకోగలరా? ఇది 2001 నుండి ఆయన వాక్చాతుర్యంలోని ఒక భాగమని గుర్తుంచుకోండి.

నిజానికి నేను లేవనెత్తిన ప్రతిదాన్నీ ఒకే ఒక సాధారణ ప్రశ్నగా కుదించవచ్చు: శ్రీ పాత మోదీ ఇప్పుడు శ్రీ కొత్త మోదీ కాగలరా? ఆయన ప్రభుత్వం దాని పైనే ఆధారపడి ఉంటుంది. మన పాలన దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఆయన రాజకీయ భవిష్యత్తు కూడా! కానీ ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటి?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సమస్య అదేనా?



దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్స్ (బీజేపీకి) ఒకే సంఖ్యలో స్థానాల్నీ, ఓటు శాతాన్నీ ఎందుకు అంచనా వేశాయి? అన్నీ ఆమడ దూరంలో తప్పిపోయాయి. అవన్నీ ఒకే ఉమ్మడి మూలం నుంచి ఉచితంగా ముడి సమాచారాన్ని పొందాయా?

– ప్రభు చావ్లా, జర్నలిస్ట్

జాగ్రత్త



జిల్లా కోర్టు నుంచి సమన్లు వచ్చాయి. వివరాల కోసం 9 నొక్కమని గనక ఫోన్ వస్తే దాన్ని పట్టించుకోవద్దు. ఒకవేళ మీరు 9 నొక్కితే, సమన్లు డౌన్‌లోడ్ చేసుకొమ్మని వాళ్లొక లింక్ పంపుతారు. దాన్ని క్లిక్ చేయొద్దు. అది మాల్‌వేర్ (వైరస్) ఫైల్.

– అన్షుల్ సక్సేనా, న్యూస్ జంకీ

పేద అమెరికన్లు



ఇంటి అద్దె చెల్లించడం కోసం భోజనాలు మానేస్తుంటామని 39 శాతం మంది అమెరికన్లు నివేదించారు. అద్దె చెల్లించడం కోసం లక్షలాది మంది తమ 'బ్లడ్ ప్లాస్మా'(రక్తంలోని జీవ ద్రవ్యం) అమ్ముతుంటారు. చాలామందికి నెలజీతం పడితే తప్ప పొద్దు గడవడం లేదు. ఆరోగ్య సంరక్షణ లేక ఏటా 68,000 మంది అమెరికన్లు చనిపోతున్నారు. దీనిమీద మాట్లాడాలి, చర్యలు తీసుకోవాలి.

– మేరియాన్ విలియమ్‌సన్, అమెరికా నేత

ఆడాల్సిన ఆట



కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని చైనా గుర్తించదు. 38 వేల చదరపు కిలోమీటర్ల మేర కశ్మీర్‌ను చైనా లాక్కొంది. పైగా కశ్మీర్ మీద పాకిస్తాన్‌కు మద్దతిస్తుంది. అయినా చైనాతో బంధం పెట్టుకున్న మనం తైవాన్‌తో దౌత్య సంబంధాలు పెట్టుకోవడం లేదు. తైవాన్‌ను ఒక దేశంగానైనా ఇండియా గుర్తించడం లేదు. సరిచేసుకోవడానికి ఇదే సమయం.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

అందరం సమానం



ఒక ఎంపీగా నేను ఎప్పుడూ క్యూలో నిల్చుని, సాధారణ సెక్యూరిటీ చెక్‌కు వెళ్తాను. ఇతర పౌరుల కంటే తాము అధికులమని ఎంపీలు ఎందుకు భావిస్తారు? మన భారతీయులం ఈ భూస్వామ్య వలసవాద ధోరణి నుంచి బయటపడాలి. ఎన్నిక కాగానే వాళ్లు ప్రత్యేక మర్యాదలు కోరుకుంటారు. ప్రజాసేవకులుగా వినయంగా ఉండటం నేర్చుకోవాలి.

– షాహిద్ సిద్దిఖీ, మాజీ రాజ్యసభ ఎంపీ

ఆగని లయ



మీలో ఆరోగ్యకరమైన జీవ గడియారపు లయ కొనసాగుతోందని చెప్పడానికి ఒక సంకేతం – వారాంతాల్లో కూడా త్వరగా మేలుకోవడం!

– జాన్ కాన్‌స్టాస్, హెల్త్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఆ విజయానికి అయిదు శతాబ్దాలు

దక్షిణ భారత చరిత్రలో స్వర్ణయుగం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల కాలం. అప్పట్లో కళింగరాజ్యం అత్యంత బలమైనది. దీన్ని గజపతులు పాలిస్తూ ఉండేవారు. వారి రాజ్యం ఒరిస్సా నుంచి ప్రస్తుత నెల్లూరు జిల్లా ఉదయగిరి వరకూ విస్తరించి ఉండేది. ఉదయగిరి విజయనగర రాజ్య సరిహద్దుల్లో ఉండి రాజ్య ముఖద్వారంగా ఉండేది. ప్రతాపరుద్ర గజపతి కళింగాధిపతి. అతడు రాహుత్త రాయలను ఉదయగిరి కోట రక్షకునిగా నియమించాడు. ఉదయగిరిపై కొండవీటి రెడ్డిరాజులు, మహమ్మదీయ రాజులూ ఒక కన్నేసి ఉంచారు. కానీ బలమైన గజపతులతో తలపడలేక అదను కోసం ఎదురు చూశారు. ఇదే సమయంలో విజయనగర పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు ఉదయగిరిని ఎలాగైనా జయించాలని క్రీ. శ. 1513లో బయలుదేరాడు. గుత్తి, గండికోట మీదుగా తన సేనతో ఉదయగిరి రాజ్యంలో ప్రవేశించాడు. ఉదయగిరిలో ఘోర యుద్ధం జరిగింది.

దుర్గ రక్షకుడు రాహుత్త రాయలకు అండగా ప్రతాపరుద్ర గజపతి తన సైనికులను పంపి కృష్ణరాయలను ఎదుర్కొన్నాడు. రాయలు తన చతురంగ బలగాలను ఎంతో చాకచక్యంగా నడిపినా దుర్గం వశం కాకపోవడంతో అసహనంతో ఊగిపోయాడు. చివరికి ఒక రోజు సైనికులకు ఉత్తేజాన్ని కలిగిస్తూ... దుర్గాధిపతి తలను రేపటి కల్లా కాలితో తంతానని శపథం చేశాడు.

యుద్ధాన్ని ఉధృతపర్చి సైనికులను ఉత్సాహపరిచాడు. తాను స్వయంగా యుద్ధరంగంలో దూకి సైనికులను కోట గోడల మీదికి ఎగబాకించాడు. దీనితో గజపతి సైనికులు హాహాకారాలు చేస్తూ శరణు వేడారు. అలా అతి కష్టం మీద దుర్గాన్ని రాయలు చేజిక్కించుకొన్నాడు. శరణు కోరిన అందరినీ రక్షించాడు.

దుర్గాధిపతి రాహుత్త రాయలు తన స్వర్ణ కిరీటాన్ని బంగారు పళ్లెరంలో పెట్టి శ్రీకృష్ణదేవరాయలకు సమర్పించాడు. అన్నట్లుగానే రాయలు దాన్ని కాలితో తన్ని తన పంతం నెగ్గించుకున్నాడు. రాహుత్త రాయలను బంధించాడు. 1514 జూన్ 9న సాధించిన ఈ విజయాన్ని రాయలు తన 'ఆముక్తమాల్యద'లో చెప్పుకున్నాడు. చారిత్రక దృష్టి గల నంది తిమ్మన తన 'పారిజాతాపహరణం'లోనూ, అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లోనూ ఉదయగిరి ముట్టడిని అభివర్ణించారు. పాశ్చాత్య చరిత్రకారులు కృష్ణరాయల ఉదయగిరి ముట్టడి 18 నెలలు సాగిందని పేర్కొన్నారు.

ఉదయగిరి విజయంతో రాయలు పూర్వ విజయనగర సామ్రాజ్యాన్ని పునరుద్ధరించినట్లయింది. ఉదయగిరి విజయం శ్రీ వెంకటేశ్వస్వామి దయ వల్లనే లభించిందని నమ్మిన రాయలు ఇక్కడి నుండి నేరుగా తిరుమలకు బయలుదేరాడు. క్రీ.శ. 1514 జూలై 6న స్వామి వారిని దర్శించుకున్నాడు. 30 వేల వరహాలతో స్వామి వారికి కనకాభిషేకం చేయించాడు. విలువైన ఆభరణాలు సమర్పించాడు. తాళ్ళపాక గ్రామాన్ని రాయలు స్వామి వారి పేరిట ధర్మంగా ఇచ్చాడు. విజయనగర సామ్రాజ్య చరిత్రలో ఉదయగిరి దుర్గాన్ని సాధించటం అత్యంత ప్రతిష్ఠాత్మక విజయంగా భావిస్తారు.

– ఈతకోట సుబ్బారావు । 94405 29785

(శ్రీకృష్ణ దేవరాయలు ఉదయగిరి రాజ్యాన్ని జయించి 510 ఏళ్లు)

పారిభాషిక పదాలు సృష్టించుకోవాలి!

అభిప్రాయం



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు

ఖగోళ శాస్త్రం వంటివాటిల్లో పరిశోధనలు చేస్తూనే బ్రహ్మ గుప్తుడు లాంటి భారతీయ గణిత మేధావులు ప్రపంచానికి సున్నా (0) ను అందించారు. సున్నా (0) విలువ కూడా భారతీయ గణిత వేదవేదాంగ సాహిత్యవేత్తే కనిపెట్టాడు. అయితే అది ఇంకా వెలుగులోకి రాలేదు. దీనికి కారణం గణితం, భౌతిక, రసాయనిక జీవ శాస్త్రాదులను బాగా కప్పివేసిన ఆధ్యాత్మిక, జ్యోతిష్య సంబంధ భావజాలం. ఆ ముసుగును తీసి భారతీయ గణిత, భౌతిక, రసాయనిక, జీవ శాస్త్రాదుల తేజాన్ని ప్రయోగశాలలో చూపించాలన్న ఆసక్తితో ముందుకు వెళ్ళేవారికి ఇక్కడ సరైన ఆదరణ లభించడం లేదు.

సమస్త విజ్ఞానం మన వేదాలలోనే ఉందని మన ఆధ్యాత్మిక, ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్తలు ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా... ప్రయోగ శాలలో నిలవని విజ్ఞానం తుదకు అజ్ఞానంగానే మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రయోగశాలలో నిలవాలని తపించే భారతీయ వేదవేదాంగ శాస్త్రాలలో నిపుణులైనవారికి ఆర్థిక శక్తి లేమి అడ్డు వస్తోంది. కాస్త సైన్స్ చదువుకున్నవారు ఆధ్యాత్మిక జ్యోతిష్యాదులను అడ్డు పెట్టుకొని మాట్లాడే మాయగాళ్ళను సూడో సైన్స్‌గాళ్ళు అంటే, వీరు వారిని మరో విధంగా వెక్కిరిస్తారు. ఈ చర్వితచర్వణాలు కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికిరావు. భారతీయ వేదవేదాంగ పురాణేతిహాసాలలో ఏ శాస్త్రం ఎంత ఉంది అనే విషయాన్ని పక్కన పెడితే ఆ యా విషయాల గురించి మాట్లాడటానికి తగినంత పారిభాషిక (టెర్మినాలజీ) పదజాలం లేదన్నది అక్షర సత్యం.



వేదవేదాంగ పురాణేతిహాసాల విజ్ఞానం కథా రూపంలో ఉంటుంది. కథా భాష, ప్రయోగ శాల భాష ఒక రీతిన ఉండదు. ఉదాహరణకు రాజకుమారి ఉద్యానవనంలో చెలికత్తెలతో ఆడుకుంటోంది. ఆకాశంలోని పక్షుల వరుసలను చూసింది. మొదటి వరుసలో ఒకటి, రెండవ వరుసలో రెండు ఇలా... పదవ వరుసలో పది! మొత్తం పక్షులు ఎన్ని అంటే అందరి పప్పులు ఉడికాక రాజకుమారి 55 అని సమాధానం చెబుతుంది.

$n(n+1/2)$ అనే ఆధునిక గణిత సూత్రం రాజకుమారికి తెలియకపోవచ్చును. అయితే వేగంగా $10+(9+1=10)+(8+2=10)+(7+3=10)+(6+4=10)+5=55$ అని నోటితో గణించే మేధ రాజకుమారికి ఉండి ఉండవచ్చు. పదికి దగ్గరకు వచ్చి కూడికలు, తీసివేతలు వంటివి చేస్తే లెక్క సులభం అవుతుంది అని ఆమెకు తెలిసి ఉండవచ్చు. ఏదేమైనప్పటికీ రాజకుమారి మేధను సూత్ర బద్ధం చేస్తే, భారతీయ గణితం అందరికీ అర్థమవుతుంది. అయితే సూత్ర బద్ధం చేయడానికి కావలిసినంత టెర్మినాలజీని మనవారు మనకు అందించలేదన్నది నిజం. టెర్మినాలజీ లేకుండా ఆధ్యాత్మికతతో, జ్యోతిష్యాది గణింపుతో ఎన్ని చెప్పినా ప్రయోజనం ఉండదు.

మన వేదవేదాంగ పురాణేతిహాసాల శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి కావల్సినంత టెర్మినాలజీని మనం పెంచుకోవాలంటే... మన పండితులు ఛాందస భావాలకు అతీతంగా, అసూయాద్వేషాలకు అతీతంగా మెలగాలి. రేపటి తరానికన్నా మన శాస్త్రవిజ్ఞానాన్ని తెలిపే టెర్మినాలజీని పెంచే దిశగా పోయేటందుకు ఇంగ్లిష్ మీడియం వైపునకు వెళ్ళాలంటే కొందరు తెలుగు భాషాభిమానులకు కోపం వస్తుంది. మన సంప్రదాయం, మన పద్యం, మన ఛందస్సు అంటూ ఆవేశ పడిపోతారు.

నిజమే... కొన్ని వందల ఏళ్ళ నుండి మన ఛందస్సులో కొందరు మహాకవులు, కవులు పద్యాలు రాస్తున్నారు. సంతోషమే. కానీ అదే ఛందస్సులో కంప్యూటర్‌కు చెందిన ద్విసంఖ్యా మానాది గణితాంశాలు ఉన్నాయని ఎందరికి తెలుసు? పోనీ కొందరికి తెలుసు అనుకుందాం. తెలిసినవారు ఆ యా అంశాలను ప్రయోగశాల వద్ద ఎంత మేర సక్సెస్ చేశారు? వారికి తెలిసినదానిని ఎంత మంది గణిత సూత్రాలుగా మలచారు?

రేపటి తరమన్నా ఇంగ్లిష్ మీడియం వైపునకు వెళ్ళి మన వేదాంగాదులలో ఉన్న విజ్ఞాన ఛాయలకు చక్కని టెర్మినాలజీ తయారుచేస్తే, మనం పశ్చిమ దేశాల కంటే ముందే ఉంటాము. మాతృభాష లోనే ఈ పని చెయ్యవచ్చు కదా అని కొందరు అనవచ్చు. అది సాధ్యం కాని పని. ఎందుకంటే మన మాతృభాషా పదజాలం కొంచెం ముందుకు వెళితే అది ఆధ్యాత్మికతలో కూరుకుపోతుంది. లేదా ఖగోళం, జ్యోతిషం అంటూ కాలక్షేపం చేస్తుంది.

ఇంగ్లిష్ మీడియం విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డేరింగ్ స్టెప్ వేశారు. దానిని అలాగే కొనసాగించాలి. ఛందస్సు కేవలం పద్యాలు రాసుకోవడానికి పుట్టింది కాదనీ, అందులో ద్విసంఖ్యా మాన గణితం, ఇంకా ఆధునిక గణితంలోకి ప్రవేశించని ఉదాత్తానుదాత్తాదుల గణితం ఉందనీ రేపటి తరమన్నా గమనించాలి.

రెండు రెళ్ళు ఆరు అన్నది సాహిత్యంలో చెప్పుకోవడానికి ఆహ్లాదంగా ఉండవచ్చు. కానీ రెండు రెళ్ళు నాలుగు అన్నది నిజం. ఆ నిజం మాటున ఉన్న సైన్స్, మాథ్స్ వైపు వెళ్ళాలంటే ఆ యా భారతీయ సబ్జెక్టులకు సరిపడ టెర్మినాలజీ తప్పక ఉండాలి.

వ్యాసకర్త విశ్రాంత ఉపాధ్యాయులు । 9849448947

సరైన చోటు

మనం బస్సులో ఎక్కినప్పుడు కూర్చోవటానికి చోటు ఉందా లేదా అని వెతుక్కుంటాం. అది కూడా వెనక్కి అయితే కుదుపులు ఉంటాయని ముందు వరసల్లోనే కూర్చోవటానికి పోటీ పడతాం. రైల్లో ఎక్కినప్పుడు కూడా సౌకర్యంగా కిటికీ దగ్గర చోటుకు ఇష్టపడతాం. అంతేకాదు... సభలకు, సమావేశాలకు వెళ్ళినప్పుడు బాగా వినటానికి, చూడటానికి బాగుంటుందని ముందు వరుసల్లో చోటు చూసుకుంటాం. చదువుకునే రోజుల్లో విద్యార్థులు ముందు బెంచీల్లో చోటు కోసం ప్రతిరోజూ పోటీ పడుతుంటారు.



జ్యోతిర్మయం

కొన్ని గంటల సేపు ప్రయాణం చేయటానికే సౌకర్యవంతమైన చోటును చూసుకుంటున్నాం. ఆ కాసేపు అదేదో మన సొంత చోటులా భావిస్తూ అందులోకి ఎవరూ రాకుండా జాగ్రత్త పడుతున్నాం. మరి, శాశ్వతమైన చోటు సంపాదించుకోవాలంటే ఎంత ప్రయత్నించాలి? ఆ శాశ్వతమైన చోటు ఎక్కడుంది? దాని నెలా పొందాలి?

శాశ్వతుడు, నిత్య సత్యుడు అయిన భగవంతుని హృదయంలో చోటు సంపాదించుకోవాలి. తరతరాలుగా వచ్చే ధన ధాన్యాలు, బంగారం వంటి సంపదలు వదలలేక మానవుడు పూర్తిగా సంసారంలో పడిపోతాడు. కష్టాలు కోరకుండానే వచ్చినట్లు, సుఖాలు ఆ సమయానికి అవే వస్తాయి. అందుకోసం ఎంతో విలువైన జీవితాన్ని వృథా చేసుకోకూడదంటాడు భాగవతంలో ప్రహ్లాదుడు. ధర్మాన్ని ఆచరించటానికి తగిన మానవ జన్మను పొందటం చాలా కష్టం. ఈ అవకాశాన్ని మనుషులు సార్థకం చేసుకోవాలి.

ధర్మాన్ని, సత్యాన్ని శ్రద్ధగా పాటించే వ్యక్తులకు దైవం హృదయంలో చోటు లభిస్తుంది. ఆ పరమ పురుషుని పాద పద్మాలను మన హృదయాలలో నిలుపుకోవాలి. మంచితనం, సత్ప్రవర్తన, సత్సాంగత్యం, భక్తి, పరిపూర్ణ విశ్వాసం వంటి వానితో దైవం హృదయంలో చోటు పొందాలి. అదే నిజమైన పొందవలసిన చోటు. భగవంతుడు మెచ్చుకుంటే మనకు లభించనిది ఏదీ లేదు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చవితి సా.4.48 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పుష్యమి రా.10.35 వరకు, తదుపరి ఆశ్రేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.17 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.54 వరకు, **అమృతఘడియలు:** ప.3.55 నుండి 5.36 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లకు నీటిసరఫరా బంద్

- కుళాయిలు తొలగించిన టీడీపీ కార్యకర్తలు



కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రోజురోజుకు టీడీపీ నాయకుల దాడులు, బెదిరింపులు పెరిగిపోతున్నాయి. అధికారం రావడంతో గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. ఆదివారం నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లెల్లో టీడీపీ కార్యకర్తలు మంచినీటి కుళాయిలను కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.17 లక్షలతో గ్రామంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు వీధుల్లో 50కి పైగానే కుళాయిలకు నీళ్లు రాకుండా చేశారు. కుళాయిలకు డమ్మీలు వేయడం, కర్రలు అడ్డుపెట్టడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. పట్టపగలే టీడీపీ కార్యకర్తలు వీధుల్లో కలియతిరుగుతూ వైఎస్సార్‌సీపీ తరఫున చురుగ్గా పనిచేసిన వారి ఇళ్లకు నీళ్లు రాకుండా చేశారు. ప్రధాన రహదారిలో బోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగను కత్తిరించారు. పలుచోట్ల మహిళలు ఎందుకు కుళాయిలకు నీళ్లురాకుండా చేస్తున్నారని ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఎవరైనా ఎదురు తిరిగితే దాడులకు సిద్ధంగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మిన్నకుండిపోయారు. గ్రామంలో జరుగుతున్న అరాచకంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దాడి, చోరీ



జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో టీడీపీ కార్యకర్తలు పట్టణంలోని తొర్రగుంటపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాటి సాంబ ఇంటిపై శనివారం రాత్రి దాడిచేసి విధ్వంసం సృష్టించారు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేసి చోరీచేశారు. చంపుతామని బెదిరించారు. ఈ సందర్భంగా బాధితుడు పాటి సాంబ తన ఇంటిపై జరిగిన దాడిని వివరించారు. టీడీపీ కార్యకర్తలు తోట నరసింహారావు, ముత్యాల గోపి, తోట నాగరాజు, పాశం శ్రీరాం, పాశం అశోక్, నాగేశ్వరరావు తనకు ఫోన్‌చేసి 'ఎక్కడున్నావురా.. నిన్ను చంపేస్తాం..' అంటూ బెదిరించారని పాటి సాంబ చెప్పారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంట్లోకి చొరబడి ఏసీ, వాషింగ్‌మెషిన్, ఎల్ఈడీ టీవీ, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేశారని, నగదు, బంగారం అపహరించారని తెలిపారు. వారివల్ల తనకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి, చోరీపై కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, దువ్వల రామకృష్ణతో కలిసి సీఐ జానకీరామ్‌కు ఫిర్యాదు చేశారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆగని టీడీపీ దాష్టీకాలు

కుందుర్పి: అనంతపురం జిల్లాలో టీడీపీ దాష్టీకాలు ఆగడం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు చేస్తూనే ఉన్నారు. ఆదివారం కుందుర్పి మండలం జంబుగుంపల ఆర్‌బీకే కేంద్రం వద్ద ఉన్న శిలాఫలాకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. పట్టపగలే విధ్వంసం సృష్టించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మలను పగులగొట్టి రోడ్డుపై పడేశారు. శనివారం రాత్రి మలయనూరు ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు లక్ష్మీకాంత్ ఇంటిపై రాళ్లదాడి చేశారు. ఇంటిపై ఉన్న లైట్లు, అద్దాలు పగులగొట్టారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఆరేళ్లుగా తన భర్త అర్చక వృత్తి సాగిస్తున్నారని, దాన్ని తమకు వదలేయాలంటూ టీడీపీ కార్యకర్తలు సంజీవప్ప, నరసింహమూర్తి గొడవలకు దిగి దాడిచేయడంతో ఆలయం తాళాలను ఇప్పటికే వారికి ఇచ్చేశామని లక్ష్మీకాంత్ భార్య చందన చెప్పారు. అయినా కక్షతో ఇంట్లోకి రాళ్లు వేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తుమ్మకోటలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామంలోని రజకుల కాలనీ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. 2009 సెప్టెంబర్ 2న వైఎస్సార్ అకాల మృతిచెందిన తరువాత రాష్ట్రంలోనే మొదటి విగ్రహం ఇక్కడ ఏర్పాటు చేశారు. రాత్రి 11.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపేసి దుండగులు ఈ ఘటనకు పాల్పడ్డారు. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఐ ఎం.ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఘటన వివరాలను గురజాల డీఎస్పీ శ్రీనివాసరావుకు వివరించగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల్ని విచారించారు.

పోలీసుల వేధింపులతో ఉప సర్పంచ్ ఆత్మహత్య

- నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూత
- వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతితో రెంటపాళ్లలో ఉద్రిక్తత



నాగమల్లేశ్వరరావు(ఫైల్)

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఉప సర్పంచి, వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు (37) నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం మృతిచెందాడు. అతడి మృతితో సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఉద్రిక్తత నెలకొంది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈనెల 4న పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు కౌంటింగ్‌కు వెళ్లాడు. ఆయన కుమారుడు రెంటపాళ్ల గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఇంటి వద్ద ఉన్నాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఈనెల 4వ తేదీ ఉదయం ఏడుగంటల సమయంలో నాగమల్లేశ్వరరావును ట్రబుల్ మంగర్స్ బైండోవర్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమికి అనుకూలంగా రావడంతో రెంటపాళ్లలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగమల్లేశ్వరరావు ఇంటిపై, ఎస్సీ కాలనీపై దాడులకు దిగారు. నాగమల్లేశ్వరరావు ఇంట్లో ఆయన భార్య నందిని, కుమార్తె యశస్విని ఉన్నారు. ఇంటిమీద దాడిచేస్తున్న విషయాన్ని యశస్విని తన తండ్రి నాగమల్లేశ్వరరావుకు ఫోన్‌చేసి చెప్పింది. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆయన ఫోన్ మాట్లాడబోతుండగా పోలీసులు ఫోన్ లాక్కున్నారు. ఈ నెల 5న సాయంత్రం మర్యాదగా గ్రామం విడిచి వెళ్ల.. లేకుంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిస్తానంటూ సత్తెనపల్లి రూరల్ సీఐ రాజేష్‌కుమార్ బెదిరించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో నాలుగు రోజులపాటు దూరంగా ఉంటే గొడవలు సర్దుబాటవుతాయని భావించిన తండ్రి వెంకటేశ్వర్లు కూడా నాగమల్లేశ్వరరావును గుంటూరులో సోదరుడు కొర్లకుంట శ్రీకాంత్ వద్దకు పంపాడు. తనపై ఒక్క కేసు కూడా లేకపోయినా, ఇంటిపైకి వచ్చి గొడవచేసి దాడులు చేసిన టీడీపీ, జనసేన నాయకులను వదిలేసి పోలీసులు తనను బెదిరించటంతో మనస్తాపానికి గురైన నాగమల్లేశ్వరరావు ఈనెల 6న పేరేచర్ల వద్ద గడ్డిమందు కొనుగోలు చేసి 14వ మైలు వద్ద తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటినుంచి మృత్యువుతో పోరాడిన నాగమల్లేశ్వరరావు ఆదివారం మరణించాడు. నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సమయంలో మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ పోలీసులు ఫిర్యాదును ట్యాంపరింగ్ చేశారు. నాగమల్లేశ్వరరావు మృతి వార్తతో రెంటపాళ్లలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో పోలీసు బలగాలను మోహరించారు. నాగమల్లేశ్వరరావు మృతదేహాన్ని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, అంబటి అల్లుడు ఉపేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, నాయకులు నల్లబోతు శివనారాయణ, చల్లా శ్రీను, కొమెర శివశంకర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లును ఓదార్చారు. తన కుమారుడి మృతికి కారకులపై పోలీసు ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నాగమల్లేశ్వరరావు మృతదేహానికి గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు.



గుంటూరు జీజీహెచ్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి

చితకబాది.. కాళ్లు పట్టించి..

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల అమానుషం
- లోకేశ్ ఫ్లెక్సీ ఎదుట మోకాళ్లపై నిలబెట్టి సారీ చెప్పించిన వైనం
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ నేత దాష్టీకం
- వీడియో వైరల్.. స్పందించని పోలీసులు

సాక్షి, అమరావతి : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పెదవడ్లపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పట్ల టీడీపీ నాయకులు దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణవేణి భర్త రాజ్‌కుమార్‌ను గ్రామానికి టీడీపీ నాయకుడు జవ్వాది కిరణ్ చంద్ ఆదివారం తన అనుచరుల ద్వారా ఊరి మధ్యకు రప్పించాడు. అందరూ చూస్తుండగా దారుణంగా దాడి చేశారు. ఒంటిపై దుస్తులు విప్పి మరీ చితకబాదారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు లోకేశ్ ఫొటో ఉన్న ఫ్లెక్సీ చేత్తో పట్టుకోగా, విలపిస్తున్న రాజ్‌కుమార్‌ను దాని ఎదురుగా మోకాళ్లపై కూర్చోబెట్టారు. 'నన్ను క్షమించండి.. చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేశాను. ఇక ఎప్పుడూ అలా చేయను' అని చెప్పించారు. అనంతరం రాజ్‌కుమార్.. తనను మన్నించమని టీడీపీ నేత కిరణ్‌చంద్ కాళ్లు పట్టుకున్నాడు. ఫ్లెక్సీలో లోకేశ్ కాళ్లు కూడా పట్టుకోమని టీడీపీ నేత ఆదేశించాడు. బాధితుడు వారు చెప్పినట్లే చేశాడు. తన కుటుంబాన్ని క్షమించాలని పదే పదే విజ్ఞప్తి చేశాడు. ఈ వీడియో పెద్ద ఎత్తున వైరల్ అయినప్పటికీ పోలీసుల నుంచి ఎలాంటి చర్యలూ లేకపోవడం గమనార్హం.

అప్పారావుపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై దాడి

కమలాపురం: వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం అప్పారావుపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచం శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఆదివారం గ్రామంలోని టీడీపీ వర్గీయులు దాడిచేశారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న వారు ఇంటి తలుపులు, మంచినీటి ట్యాంక్ నుంచి కిందివరకు ఉన్న పైప్‌లైన్‌ని ధ్వంసం చేశారు. ఇంటిపక్కనే పొలంలో ఉన్న శ్రీనివాసరెడ్డి భార్య శారద ఈ ఘటనను గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న శ్రీనివాసరెడ్డి అక్కడికి చేరుకునేసరికే రెండు తలుపుల్ని ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని శ్రీనివాసరెడ్డి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు కానిస్టేబుళ్లు ఇక్కడే ఉంటారని, ఉదయం స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పారని బాధితుడు వాపోయారు. రాజకీయ కక్షతోనే తన ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడిచేశారని చెప్పారు. పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరారు.



ధ్వంసమైన ఇంటి తలుపులు

వేల్పూరు ఎస్సీ కాలనీవాసులపై టీడీపీ కార్యకర్తల దాడి

నలుగురికి తీవ్రగాయాలు

వినుకొండ (నూజెండ్ల): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామమైన శావల్యాపురం మండలం వేల్పూరులోని ఎస్సీ కాలనీ వాసులపై ఆదివారం టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే అక్కసుతో 50 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు దాడిచేసి నలుగురిని గాయపరిచారు. ఎన్నికల అనంతరం బూత్‌ల వారీగా ఓట్లు లెక్కేసుకున్న టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీకి ఎక్కువ ఓట్లు పడ్డాయని ఆ కాలనీ వాసులతో గొడవకు దిగారు. అదేమని ప్రశ్నించిన బీర్నీడి దినేష్‌కుమార్, తిరుపతి, రోశయ్య, నాగమ్మపై దాడిచేసి కొట్టి గాయపరిచారు. గాయపడిన వారిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్, టౌన్ సీఐ సాంబశివరావు గ్రామానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ముందస్తు జాగ్రత్తగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన దినేష్



గాయపడిన తిరుపతి, నాగమ్మ

ప్రగతి సీబీఎస్ఈ పాఠశాలపై టీడీపీ దౌర్జన్యం

- డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ల అపహరణ
- పాఠశాల భవనానికి, గేట్లకు తాళాలు
- భవనంపైన, ప్రహరీపైన టీడీపీ జెండాలు
- ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యాసంస్థల వ్యవస్థాపకుడు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రగతి సీబీఎస్ఈ పాఠశాలపై శనివారం టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాఠశాలపై దాడి చేసి పాఠశాలలో ఉన్న డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్ అపహరించుకెళ్లారు. పాఠశాల భవనానికి, గేట్లకు తాళాలు వేసి తెలుగుదేశం పార్టీ జెండాలు కట్టారు. దీనిపై ప్రగతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య మాట్లాడుతూ.. తాను, తన సతీమణి మక్కెన పద్మజ 2013లో ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చ్ గుంటూరు (ఏఈఎల్‌సీ) వారి నుంచి విద్యాసంస్థలు నిర్వహించడానికి 2.20 ఎకరాల స్థలాన్ని దీర్ఘకాలిక లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. పాఠశాల భవన నిర్మాణ సమయంలో మొక్కపాటి చంద్రశేఖర్, వెలినేడి కోటేశ్వరరావు, సూర్యదేవర శ్రీనివాసరావు తనను కలిసి విద్యాబోధన అంటే ఇష్టమని నమ్మబలికి 2015లో ప్రగతి ఎడ్యుకేషనల్ సొసైటీలో సభ్యులుగా చేరారని, ఆరునెలలు గడవక ముందే తనతో గొడవపడ్డారని చెప్పారు. పాఠశాలకు చిన్న భవనం సరిపోతుందని, రెండెకరాల ఖాళీస్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించాలని ప్రతిపాదిస్తే తాను తిరస్కరించానని, ఆ స్థలం విద్యాసంస్థల నిర్వహణకు మాత్రమే ఉపయోగించాలని చెప్పానని పేర్కొన్నారు. అందుకోసమే ఆ స్థలాన్ని లీజుకి ఇచ్చారని చెప్పడంతో ఘర్షణ మొదలైందన్నారు. విద్యా సంవత్సరం మొదలయ్యే సమయంలో పాఠశాల మీద అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీ నాయకులు దాడిచేస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి? రక్షణ కల్పించమని ఎవరిని అడగాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెయ్యిమంది విద్యార్థులు సీబీఎస్ఈ విద్యా విధానానికి దూరమవుతారేమోనని ఆందోళనగా ఉందన్నారు. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం మూడుగంటలకు టీడీపీ నాయకుడు సూర్యదేవర శ్రీనివాసరావు తన అనుచరులతో పాఠశాల మీద దాడిచేసి కార్యాలయ తలుపులు పగలగొట్టి, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి వాచ్‌మన్‌ను చంపుతామని బెదిరించి పాఠశాల డాక్యుమెంట్స్‌ను తస్కరించడానికి ప్రయత్నించారని చెప్పారు. ఆయన, ఆయన అనుచరులతో తనకు ప్రాణహాని ఉందని సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు ఆ ఫిర్యాదును నమోదు చేయలేదని, ఎటువంటి చర్య తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సూర్యదేవర శ్రీనివాసరావు స్పందించారు. గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని మక్కెన అచ్చయ్య తన స్కూల్‌ను కబ్జా చేశాడని, తన స్కూల్‌ను తాను స్వాధీనం చేసుకుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడుతున్నాడని ఒక ప్రకటలో పేర్కొన్నారు. దీనికి, టీడీపీకి సంబంధం లేదని ఆయన తెలిపారు.



సత్తెనపల్లిలోని ప్రగతి పాఠశాల గేట్లకు తాళాలు వేసి గోడలకు కట్టిన టీడీపీ జెండాలు

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి

చిత్తూరు జిల్లా చిన్నరెడ్డిపల్లిలో ఎనిమిది మందికి గాయాలు

యాదమరి (పూతలపట్టు): చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలంలోని చిన్నరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం దాడికి పాల్పడ్డారు. చిన్నరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన ఓ యువకుడు పనికి వెళుతుండగా అడ్డగించి టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఆ యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి టీడీపీ కార్యకర్తలను ప్రశ్నించడంతో మరింత రెచ్చిపోయి కర్రలతో వారిని కూడా చితకబాదారు. ఈ ఘటనలో ఎనిమిదిమంది గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు యాదమరి పోలీసులు గ్రామానికి వచ్చి పరిశీలించారు. గాయపడిన యువకుడిని, అతని కుటుంబ సభ్యులను టీడీపీ కార్యకర్తలు కొన్నిరోజులుగా ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. కాగా, మంగళవారం ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు. మద్యం తాగి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై రాళ్లు విసరడం, ఇళ్లలోని వస్తువులు, బైక్‌లను ధ్వంసం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కోరుతున్నారు.



టీడీపీ దాడిలో ధ్వంసమైన కిటికీ తలుపు

పెరికీడులో వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై రాళ్ల దాడి

- రాళ్లదాడితో కిటికీ అద్దాలు ధ్వంసం
- ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): కృష్ణాజిల్లా బాపులపాడు మండలం పెరికీడులో వైఎస్సార్‌సీపీకి చెందిన వైస్ ఎంపీపీ పందు రాణి, మాజీ ఉప సర్పంచ్ పందు నాగార్జున దంపతుల నివాసంపై ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడిచేసి బీభత్సం సృష్టించారు. ఇంటిపైకి రాళ్లు విసురుతూ దుర్భాషలాడారు. మద్యంతాగి బైక్‌లపై వచ్చిన టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ భయానక వాతావరణం సృష్టించారు. బైక్‌లపై చక్కర్లు కొడుతూ ఇంట్లో ఉన్న పందు రాణి, వారి కుమార్తెను తీవ్ర భయాందోళనలకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తల రాళ్లదాడితో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. దాడి జరిగిన సమయంలో గ్రామాంతరం వెళ్లిన పందు నాగార్జున ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టీడీపీ కార్యకర్తలు వెళ్లిపోయారు. ఎస్ఐ-2 పి.ఆర్జమ్మ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.



పెరికీడులో వైస్ ఎంపీపీ పందు రాణి ఇంటిపై రాళ్లు రువ్వటంతో ధ్వంసమైన కిటికీ అద్దాలు

వణుకూరులో టీడీపీ, జనసేన దాడి, బెదిరింపు

పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరు మండలం వణుకూరులో వైఎస్సార్‌సీపీ అభిమానులపై టీడీపీ, జనసేన నేతలు దాడులు చేశారు. ఆలస్యంగా అందిన సమాచారం ప్రకారం.. వణుకూరులో తాపీమేస్త్రీగా పనిచేస్తూ మసీదు సమీపంలో నివాసం ఉంటున్న మైనార్టీ వ్యక్తి ఇంటిపై రెండురోజుల కిందట టీడీపీ నేతలు రాళ్లువేశారు. ఇంట్లో ఉన్న వారిని అంతుచూస్తామంటూ బెదిరించారు. ఇంటి బయట ఉన్న కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంతుచూస్తామని హెచ్చరించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. వణుకూరు గ్రామంలో ఉంటున్న వైద్యుడి ఇంటికి జనసేన నేతలు వెళ్లి బెదిరించారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించారు. టీడీపీ, జనసేన నేతల వైఖరి పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాలేపల్లిలో ఆదివారం టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకుడు హిదయతుల్లాపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. హిదయతుల్లా ప్రెసిడెంట్‌గా ఉన్న కాలేపల్లి దేవరచెరువు సొసైటీలో 40 మంది సభ్యులున్నారు. వీరంతా చెరువులో చేపలు వదిలి జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీ గెలవగానే గ్రామానికి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు చంద్ర, అతడి అనుచరులు సాంబశివ, మధు, చిరంజీవి, నారాయణస్వామి తదితరులు చెరువులో వలలు తీసేయాలని హిదయతుల్లాను రెండు రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం చెరువు వద్దనున్న హిదయతుల్లా వద్దకు వీరంతా వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చినందున చెరువు తమకే సొంతమని, ఇక్కడ మీరెవరూ చేపలు పట్టరాదని హెచ్చరించారు. పరుష పదజాలంతో దూషిస్తూ హిదయతుల్లాపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడిని కుటుంబ సభ్యులు కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



టీడీపీ దాడిలో గాయపడ్డ హిదయతుల్లా

వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ వీరంగం



కావలి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మద్దతుదారులపై టీడీపీ నేతలు దాడులు కొనసాగిస్తున్నారు. కావలిలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం ముందు ఆదివారం టీడీపీ నేతలు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. డీజే పెట్టి, బాణసంచా పేలుస్తూ రామిరెడ్డి ఇంటి గేటును కాళ్లతో తన్నుతూ వీరంగం సృష్టించారు. దగదర్తిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాండ్ర శ్రీనివాసులు ఇంటికి సంబంధించిన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చేశారు. తడకలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆత్మకూరు గిరినాయుడిపై దాడిచేశారు. ఈ దాడిలో గిరినాయుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడి ఇంటి ఎదుట కవ్వింపు చర్యలకు పాల్పడి బాణసంచా కాల్చి ఇంట్లో వేశారు.

మన్నెసుల్తాన్‌పాలెంలో ఇటుకలతో దాడి

ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన శ్రీనివాసరెడ్డి

బెల్లంకొండ: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్‌పాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు రాళ్లదాడి చేశారు. టీడీపీ విజయోత్సవాలలో భాగంగా నాయకులు ఆదివారం సాయంత్రం డీజే పెట్టుకుని టపాసులు కాలుస్తూ గ్రామంలో తిరిగారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లవద్దకు రాగానే ఆ ఇళ్లపై ఇటుకరాళ్లతో దాడిచేశారు. ఇళ్లలో ఉన్న వస్తువులను ధ్వంసం చేశారు. సర్పంచ్ దారం వెంకటనరసమ్మ, నాయకులు అన్నపరెడ్డి రామిరెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బోనం వెంకట్రామిరెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇళ్లపై దాడులు చేశారు. అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి తలపై ఇటుకరాయితో కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్పృహ కోల్పోయిన శ్రీనివాసరెడ్డిని సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మనస్తాపంతో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభిమానులు ఆత్మహత్య

బాపట్ల జిల్లా గంగపాలెం, ఏలూరు జిల్లా పుట్రేపులో విషాదం



రామయ్య(ఫైల్)



గుర్రం శ్రీనివాస్(ఫైల్)

బల్లికురవ/టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక తీవ్ర మనస్తాపంతో ఇద్దరు అభిమానులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గంగపాలెం గ్రామానికి చెందిన పెయ్యల రామయ్య(64) 4వ తేదీ ఉదయం ఎన్నికల ఫలితాలను టీవీలో చూస్తూ బాధపడ్డాడు. ప్రజలకు ఎంతో మేలు చేసిన వైఎస్సార్‌సీపీని ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా ఓడించారంటూ మనోవ్యథకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గంగపాలెం గ్రామం నుంచి మల్లాయపాలెం వెళ్లే రోడ్డులో ని వ్యవసాయ భూమిలో ఉన్న విద్యుత్ స్తంభానికి తాడుతో ఉరి వేసుకుని ప్రాణాలొదిలాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అతని భార్య సులోచన మాట్లాడుతూ.. 'జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందడంతో మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉండేది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో నా భర్త ఎంతో బాధపడ్డాడు. ఆయన్ను ఎంతగానో ఓదార్చాం. కానీ, ఇంతలోనే ఆత్మహత్య చేసుకున్నాడు' అంటూ విలపించింది. రామయ్య కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి సురేష్, కొణిదెన సర్పంచ్ కె.లేపాక్షి విష్ణు, పెయ్యల రంగనాథ్, గుంజి ఆంజనేయులు తదితరులు పరామర్శించారు.

అన్యాయం జరిగిందంటూ..

ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం పుట్రేపు గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్(24) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వైఎస్సార్‌సీపీ అంటే విపరీతమైన అభిమానం ఉన్న శ్రీనివాస్.. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలిచి.. మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పదవి చేపడతారని భావించాడు. కానీ అందుకు భిన్నంగా ఫలితాలు రావడంతో శ్రీనివాస్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎక్కడో అన్యాయం జరిగిందంటూ ఆవేదన చెందాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు శ్రీనివాస్‌ను వెంటనే జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న శ్రీనివాస్ మరణించడంతో భార్య, ముగ్గురు పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం దహనం

అమరావతి: పల్నాడు జిల్లా అమరావతి మండలం మునగోడులో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దహనం చేశారు. మండలంలోని లింగాపురంలో కంభంపాటి సుబ్బారావు ఇంటిపై కూటమి కార్యకర్తలు దాడిచేశారు. ఈ దాడిలో గాయపడిన సుబ్బారావు అమరావతి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు.


ఆదివారం రాష్ట్రపతి భవన్ వద్ద జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆహ్వానితులు


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నేపాల్ ప్రధాని ప్రచండ, బంగ్లాదేశ్ ప్రధాని హసీనా, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, శ్రీలంక అధ్యక్షుడు విక్రమ సింఘే తదితరులు


కార్యక్రమానికి హాజరైన ఎన్‌డీఏ పక్ష నేతలు పవన్‌కల్యాణ్, నితీశ్ కుమార్, చంద్రబాబు తదితరులు

కన్నుల పండువగా...

మోదీ ప్రమాణోత్సవం సందర్భంగా కళకళలాడిన రాష్ట్రపతి భవన్

రాజకీయ, పారిశ్రామిక దిగ్గజాలు, సినీ తారల సందడి

వేడుకలో పాల్గొన్న 8,000 మందికి పైగా వీఐపీలు

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. దేశాధినేతల నుంచి రాజకీయ దిగ్గజాల దాకా వేడుకలో పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రముఖులు మొదలుకుని సినీ తారల దాకా తళుక్కుమన్నారు. 8,000 మందికిపైగా వీవీఐపీలు, వీఐపీలతో రాష్ట్రపతి భవన్ ఆవరణ కళకళలాడింది. వరుసగా మూడోసారి ప్రధానిగా మోదీతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయిస్తుండగా ప్రాంగణమంతా కరతాళ ధ్వనులు, హర్షధ్వానాలతో మారుమోగింది. మాజీ రాష్ట్రపతులు ప్రతిభా పాటిల్, రామ్‌నాథ్ కోవింద్ తదితరులు పాల్గొన్నారు. షారుఖ్ ఖాన్ నుంచి రజనీకాంత్ దాకా పలువురు సినీ ప్రముఖులు కుటుంబ సమేతంగా హాజరై అలరించారు. పారిశ్రామికవేత్తలు గౌతం అదానీ దంపతులు, ముకేశ్ అంబానీ దంపతులు వేడుకకు హాజరయ్యారు. భిన్న మతాలకు చెందిన పెద్దలు పాల్గొనడం అందరినీ ఆకర్షించింది. బీజేపీ నుంచి తొలిసారి ఎంపీగా నెగ్గిన ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధానాకర్షణగా నిలిచారు. కేరళలోని త్రిసూర్ ఎంపీ, మలయాళ సినీ స్టార్ సురేశ్ గోపీ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం అందరి దృష్టినీ ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో బీజేపీకి ఇదే తొలి విజయమన్నది తెలిసిందే. మోదీకి పలు రంగాల ప్రముఖుల అభినందనలు, శుభాకాంక్షల సందేశాలతో ఎక్స్ తదితర సోషల్ సైట్లు హోరెత్తిపోయాయి.

ఏడుగురు దేశాధినేతలు: మోదీ ప్రమాణ స్వీకారానికి 7 దేశాల అధినేతలు హాజరయ్యారు. బంగ్లాదేశ్ అధ్యక్షురాలు షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మారిషస్ ప్రధాని ప్రవింద్ కు మార్ జగన్నాథ్, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, నేపాల్ ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్ర ధాన మంత్రి త్సెరింగ్ టాగ్‌బే, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మాల్దీవుల మధ్య సంబంధాలు బలహీనపడ్డ నేపథ్యంలో ముయిజ్జు హాజరు ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 నవంబర్‌లో అధ్యక్షుడయ్యాక ఆయన భారత్ రావడం ఇదే తొలిసారి.

మోదీ తీన్‌మార్...



తెలుపు కుర్తా-చుడీదార్, నీలి రంగు జాకెట్‌లో... మెరిసిపోయిన మోదీ

విశేష సందర్భాల్లో తన వస్త్రధారణతో ఆకట్టుకునే మోదీ ఈసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలుపు కుర్తా, చుడీదార్, దానిపై నీలి రంగు జాకెట్ ఎంచుకున్నారు. 2014లో తొలిసారి ప్రధానిగా ప్రమాణ చేసిన సందర్భంగా ఆయన క్రీం కలర్ కుర్తా, తెల్ల పైజామా, బంగారు రంగు జాకెట్ ధరించారు. 2019లో రెండోసారి ప్రధాని అయినప్పుడు తెలుపు రంగు కుర్తా, పైజామా, వాటిపై బంగారు రంగు జాకెట్ ధరించి ప్రమాణస్వీకారం చేశారు. పంద్రాగస్టు, గణతంత్ర వేడుకలకు మోదీ రంగురంగుల తలపాగాలు ధరించి అలరిస్తుంటారు.


ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీ, రాజ్‌నాథ్, షాలకు అభివాదం చేస్తున్న నిర్మల

వినయంగా ఉండండి.. కష్టపడి పని చేయండి

- రుజువర్తన, పారదర్శకత విషయంలో రాజీ వద్దు
- నూతన మంత్రులకు ప్రధాని మోదీ ఉద్బోధ

న్యూఢిల్లీ: అధికార దర్పం ప్రదర్శించకుండా వినయంగా ఉన్న నాయకులనే ప్రజలు అభిమానిస్తారని నరేంద్ర మోదీ చెప్పారు. అందుకే వినయంగా ఉండాలని నూతన మంత్రులకు సూచించారు. రుజువర్తన, పారదర్శకత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చెప్పారు. ఆదివారం ప్రమాణ స్వీకారం చేయబోతున్న మంత్రులు, గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన నేతలకు మోదీ తన నివాసంలో తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనపై ప్రజలకు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని, వాటిని నెరవేర్చడమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని అన్నారు. మీకు అప్పగించిన పనిని నిజాయతీగా పూర్తి చేయండి అని సూచించారు. పార్టీలకు అతీతంగా పార్లమెంట్ సభ్యులందరికీ తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని పేర్కొన్నారు. మంత్రులు అందరితో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులను, అధికారులను గౌరవించాలని చెప్పారు. అందరిని కలుపుకొనిపోవాలని, బృంద స్ఫూర్తితో పని చేయాలని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి కేంద్రమంత్రి పదవి చేపట్టిన వారిలో పలువురి విశేషాలు...

‘మామ’కు తొలిసారి కేంద్ర మంత్రి పదవి



నాలుగు సార్లు మధ్యప్రదేశ్ సీఎంగా చేసిన బీజేపీ సీనియర్ నేత ‘మామ’ శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు తొలిసారి కేంద్ర మంత్రి పదవి దక్కింది. 1977లో ఆర్‌ఎస్‌ఎస్‌లో వాలంటీర్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. సీఎంగా రైతులు, మహిళలు, గ్రామీణ ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేశారు. మృదు స్వభావి. నిరాడంబర నాయకుడు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో బీజేపీకి బంపర్ మెజారిటీ సాధించినా సీఎంగా కొనసాగింపు దక్కలేదు. ఆయనను పూర్తిగా పక్కన పెడతారన్న ప్రచారానికి భిన్నంగా కేంద్ర మంత్రి పదవి దక్కడం విశేషం.

నడ్డా.. వివాదాలకు దూరం



బీజేపీ జాతీయ అధ్యక్షుడు 63 ఏళ్ల జగత్ ప్రకాశ్ నడ్డా హిమాచల్ ప్రదేశ్ నుంచి కేబినెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక నాయకుడు. ఏబీవీపీలో చురుగ్గా పనిచేశారు. బీజేపీలో పలు హోదాల్లో పలు రాష్ట్రాల్లో పనిచేశారు. 2012లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. మోదీ తొలి కేబినెట్లో 2014 నుంచి 2019 దాకా ఆరోగ్య మంత్రిగా ఉన్నారు. 2020లో బీజేపీ అధ్యక్షుడయ్యారు. వివాదరహితుడు.

మోదీ సన్నిహితుడిగా పదవీ యోగం

గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు 69 ఏళ్ల చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌కు అనూహ్యంగా కేంద్ర మంత్రి పదవి లభించింది. నాలుగోసారి ఎంపీగా నెగ్గారు. ఈసారి ఏకంగా 7.73 లక్షల మెజార్టీ సాధించారు. మహారాష్ట్రలో జన్మించిన పాటిల్ గుజరాత్‌లో బీజేపీకి సారథ్యం వహించడం విశేషం. కానిస్టేబుల్‌గా చేసిన ఆయన 1989లో బీజేపీలో చేరారు. 1991లో నవగుజరాత్ అనే పత్రికను స్థాపించారు. 1995 నుంచి మోదీతో సాన్నిహిత్యముంది. సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉంటారు.

బిహార్ దళిత తేజం



లోక్‌జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) పార్టీ చీఫ్, దళిత నాయకుడు చిరాగ్ పాశ్వాన్ తన తండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బిహార్‌లో ఐదుకు ఐదు ఎంపీ స్థానాలూ గెలుచుకున్నారు. 41 ఏళ్ల చిరాగ్ 2011లో ఓ హిందీ సినిమాలో నటించారు. అందులో హీరోయిన్ ఈసారి బీజేపీ తరఫున తొలిసారి ఎంపీగా గెలిచిన బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కావడం విశేషం. చిరాగ్‌కా రోజ్‌గార్ సంస్థ ద్వారా బిహార్ యువతకు ఉపాధి కల్పించేందుకు చిరాగ్ కృషి చేస్తున్నారు.

యాక్షన్ హీరో మాస్ ఎంట్రీ

ప్రముఖ మలయాళ యాక్షన్ హీరో 65 ఏళ్ల సురేశ్ గోపి తన సొంత రాష్ట్ర కేరళలో బీజేపీ తరఫున గెలిచిన తొలి ఎంపీగా చరిత్ర సృష్టించారు. అలా మాస్ ఎంట్రీ ఇచ్చి, అదే ఊపులో కేంద్ర మంత్రి అయ్యారు! ఆయన వామపక్షాలు, కాంగ్రెస్‌కు పట్టున్న త్రిసూర్ లోక్‌సభ స్థానంలో 2019 లోక్‌సబ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా పట్టు విడవకుండా ఈసారి గెలవడం విశేషం. బీజేపీతో ఆయనకు చాలా ఏళ్లుగా అనుబంధం ఉంది. మోదీ, అమిత్ షాలకు సన్నిహితుడు. 2016లో రాజ్యసభకు నామినేటయ్యారు. ‘మోదీ ఆదేశిస్తారు, నేను పాటిస్తా’ అంటారు సురేశ్ గోపి.

బిహార్ ఈబీసీ నేత



ప్రముఖ సోషలిస్టు నాయకుడు, భారతరత్న కర్పూరి ఠాకూర్ కుమారుడైన రామ్‌నాథ్ ఠాకూర్ మోదీ మంత్రివర్గంలో చేరారు. జేడీ(యూ) అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు ఆయన సన్నిహితుడు. ప్రముఖ ఈబీసీ నాయకుడిగా ఎదిగారు. 74 ఏళ్ల రామ్‌నాథ్ 2014 ఏప్రిల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన తండ్రి కర్పూరి ఠాకూర్ రెండు సార్లు బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ప్రతాప్ జాదవ్

64 ఏళ్ల జాదవ్‌కు శివసేన కోటాలో చోటు దక్కింది. నాలుగుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంపీగా లోక్‌సభలో పలు చర్చల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు.

ఒకప్పటి చురుకైన విద్యార్థి నేత..

సంజయ్ సేఠ్ (64) జార్ఖండ్‌కు చెందిన వ్యాపారవేత్త. 1976లో ఏబీవీపీ నేతగా ప్రస్థానం ప్రారంభించి అనేక సమస్యలపై జైలుకూ వెళ్లారు. ఈయనను 2016లో జార్ఖండ్ ప్రభుత్వం ఖాదీ గ్రామోద్యోగ్ బోర్డు చైర్మన్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. 2019లో తొలిసారి రాంచీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేత సుబోధ్ కాంత్ సహాయ్‌ను, తాజా ఎన్నికల్లో ఆయన కుమార్తె యశస్వినిని ఓడించారు!

గిరిజన నేత ఉయికె

మధ్యప్రదేశ్‌కు చెందిన గిరిజన నేత దుర్గా దాస్ ఉయికె(58). తాజా ఎన్నికల్లో బెతుల్(ఎస్‌టీ) నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున వరుసగా రెండోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్కూల్‌లో ఈయన టీచర్‌గా పనిచేసేవారు. 2019లో బీజేపీలో చేరి మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన రాము టెకంపై 3.79 లక్షల మెజారిటీతో విజయం సాధించారు. కుల సమీకరణాల ఆధారంగానే తాజాగా కేంద్రంలో సహాయ మంత్రి పదవి ఈయన్ను వరించిందని భావిస్తున్నారు.


– సాక్షి, నేషనల్ డెస్క్

జిల్లా పంచాయతీ సభ్యురాలి నుంచి కేంద్రమంత్రిగా




ఇటీవలి ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని ధార్ లోక్‌సభ నియోజకవర్గం (ఎస్‌టీ)నుంచి సావిత్రీ ఠాకూర్(46) ఎన్నికయ్యారు. 2003లో మొదటిసారిగా జిల్లా పంచాయతీ సభ్యురాలిగా ఈమె రాజకీయ ప్రస్థానం మొదలైంది. పార్టీలో వివిధ పదవులను రాష్ట్రం, జాతీయ స్థాయిలో నిర్వహించిన సావిత్రీ ఠాకూర్ మధ్యప్రదేశ్‌లో ప్రముఖ గిరిజన మహిళా నేతగా ఎదిగారు. 2014లో మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019లో బీజేపీ ఆమెకు టిక్కెటివ్వలేదు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాధేశ్యామ్ ముువెల్‌పై 2.18లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

రెండుసార్లు భావ్‌నగర్ మేయర్..



తాజా లోక్‌సభకు గుజరాత్ నుంచి ఎన్నికైన ముగ్గురు మహిళల్లో నిముబెన్ బంభానియా(57) ఒకరు. భావ్‌నగర్ నుంచి ఆప్ అభ్యర్థి ఉమేశ్ మక్వానాపై 4.55 లక్షల భారీ మెజారిటీతో ఈమె విజయం సాధించారు. 2009-10, 2015-18 సంవత్సరాల్లో భావ్‌నగర్ మేయర్‌గా రెండుసార్లు పనిచేశారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలిగా 2013 నుంచి 2021 వరకు బాధ్యతల్లో ఉన్నారు. కోలి వర్గానికి చెందిన మాజీ ఉపాధ్యాయిని అయిన నిముబెన్ 2004లో బీజేపీ కండువా కప్పుకున్నారు. అదే ఏడాదిలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది రాజకీయ జీవితం ప్రారంభించారు.

సినీ నిర్మాత.. రాజకీయ నేత



రెండు సాంస్కృతిక మేగజీన్‌లకు ఎడిటర్‌గా ఉన్న పబిత్రా మర్ఘెరిటా(49)..అస్సామీస్ ఫీచర్, షార్ట్ ఫిల్మ్‌లను నిర్మించారు. జున్‌బాయ్ సిరీస్‌తో తీసిన తక్కువ నిడివి కలిగిన చిత్రాలకు ఎంతో పేరు వచ్చింది. ఈయన నటించిన ఫీచర్ ఫిల్మ్ ‘మొన్ జాయ్’ పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రముఖ అస్సామీ నటి గాయత్రి మహంతాను పెళ్లి చేసుకున్నారు. 2014లో బీజేపీలో చేరి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2022 మార్చిలో రాజ్యసభకు ఎన్నికయ్యారు.

వీరేంద్ర కుమార్

మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులానికి చెందిన బీజేపీ సీనియర్ నేత వీరేంద్ర కుమార్(70). ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. చిన్నతనంలో తండ్రి నడిపే సైకిల్ షాపులో పంక్చర్లు వేశారు. అంచెలంచెలుగా ఎదిగి బాల కార్మికుల వెతలే అంశంగా పీహెచ్‌డీ చేయడం విశేషం. 2017లో మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి అయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో 16 నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. ఇప్పటికీ సొంతూళ్లో స్కూటర్‌పై తిరుగుతూ సైకిల్ రిపేర్ దుకాణదారులతో ముచ్చటిస్తుంటారు.

మాంఝీకి దక్కిన ఫలితం



బిహార్ రాజకీయాల్లో సుపరిచితుడు జితన్ రాం మాంఝీ(80). మాజీ సీఎం. హిందుస్తానీ ఆవామ్ మోర్చా(సెక్యులర్) వ్యవస్థాపకుడు. 2014 నితీశ్ కుమార్ వైదొలగడంతో సీఎం అయినా ఆయనతో విభేదాలతో కొద్దినెలలకే తప్పుకుని సొంత పార్టీ పెట్టారు. కాంగ్రెస్‌తో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం జనతాదళ్, ఆర్‌జేడీ, జేడీయూల్లో సాగింది.

రెండుసార్లు సీఎం.. నేడు కేంద్ర మంత్రి



మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు కుమారస్వామి (64). ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో వేర్వేరుగా జట్టుకట్టి రెండుసార్లు కర్నాటక సీఎంగా చేశారు. జేడీఎస్ అధ్యక్షుడు. కర్ణాటకలోని పలుకుబడి గత వొక్కలిగ వర్గానికి చెందిన నేత. సినిమాలంటే తెగపిచ్చి. అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని చెబుతుంటారు!

టంటా.. ఉత్తరాఖండ్ సీనియర్ నేత

ఉత్తరాఖండ్‌కు చెందిన సీనియర్ బీజేపీ ఎంపీ అజయ్ టంటా(51). అల్మోరా నుంచి వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. అంతకుపూర్వం, 2009లో తన చిరకాల ప్రత్యర్థి కాంగ్రెస్ నేత ప్రదీప్ టంటా చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత 2014, 2019, 2024 ఎన్నికల్లో ప్రదీప్‌పై వరుస విజయాలు సాధించడం గమనార్హం. 2014లో టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2007, 2012 ఎన్నికల్లో రెండుసార్లు రాష్ట్ర శాసనసభకు సైతం ఎన్నికయ్యారు. 2007లో రాష్ట్రమంత్రిగా ఉన్నారు. 23 ఏళ్లకే రాజకీయాల్లోకి ప్రవేశించి పంచాయతీ స్థాయిలో చురుగ్గా అనేక ఏళ్లపాటు పనిచేశారు. వివాదరహితుడిగా, స్వచ్ఛమైన నేతగా పేరుంది.

ఖట్టర్.. ప్రచారక్ నుంచి కేంద్ర మంత్రి



1977లో ఆర్‌ఎస్‌ఎస్ శాశ్వత సభ్యుడిగా మారిన మనోహర్ లాల్ ఖట్టర్(70)కు ఆ సంస్థతో దాదాపు 40 ఏళ్ల అనుబంధం ఉంది. బ్రహ్మచారి. మోదీకి సన్నిహితునిగా పేరుంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన 2014లో హరియాణా సీఎం అయ్యారు. పదేళ్ల అనంతరం గత మార్చిలో నాయబ్ సింగ్ సైనీకి బాధ్యతలు అప్పగించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ నుంచి ఈయన కుటుంబం వలస వచ్చి 1954లో హరియాణాలోని రోహ్‌తక్ జిల్లా నిందానలో స్థిరపడింది.

ఓరం.. ఒడిశా గిరిజన నేత

63 ఏళ్ల జువల్ ఓరమ్‌ఒడిశాలో గిరిజన నేతగా ఎంతో పేరుంది. వాజ్‌పేయీ కేబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖకు తొలి మంత్రిగా చరిత్ర నెలకొల్పారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. మూడుసార్లు ఒడిశా బీజేపీ చీఫ్‌గా చేశారు.

రాజీవ్ రతన్ సింగ్ ‘లలన్’



లలన్ సింగ్‌గా సుపరిచితుడు. 69 ఏళ్ల ఈ నేత బిహార్‌లో పలుకుబడి కలిగిన భూమిహార్ వర్గానికి చెందిన నేత. నితీశ్ కుమార్‌కు అత్యంత సన్నిహితుడు. 2009, 2019, 2024 ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ రాజ్యసభకు నితీశ్ కుమార్ ఈయన్ను జేడీయూ తరఫున నామినేట్ చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సహాయ మంత్రి మాకొద్దు: ఎన్‌సీపీ

న్యూఢిల్లీ: కొత్తగా ఏర్పాటైన ఎన్డీఏ ప్రభుత్వంలో బీజేపీ ఇవ్వజూపిన సహాయమంత్రి (స్వతంత్ర హోదా) పదవిని భాగస్వామ్య పార్టీ ఎన్‌సీపీ నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారు. కేంద్రంలో ఇప్పటికే ఒకసారి కేబినెట్ మంత్రిగా పనిచేసిన తాను సహాయమంత్రి పదవిని తీసుకోవడం అంటే స్థాయిని తగ్గించుకోవడమేనని ప్రఫుల్ పటేల్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని బీజేపీ అగ్ర నాయకత్వానికి తెలపగా మరో ప్రత్యామ్నాయం దొరికే వరకు వేచి ఉండాలని తనను కోరారని వివరించారు. భవిష్యత్తులో జరిగే విస్తరణలో ఎన్‌సీపీకి కేబినెట్ హోదా పదవి లభిస్తుందని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ చెప్పారు. పార్లమెంట్‌లో ఎన్‌సీపీకి ఇద్దరు సభ్యులున్నారు. ప్రఫుల్ పటేల్ రాజ్యసభలో, సునీల్ తత్కారే లోక్‌సభలో సభ్యులుగా ఉన్నారు.

బీజేపీకి కొత్త సారథి ఎవరో?

న్యూఢిల్లీ: అధికార బీజేపీ తదుపరి అధ్యక్షుడెవరనేది హాట్ టాపిక్‌గా మారింది. ఆదివారం ప్రమాణం చేసిన ప్రధాని మోదీ సారథ్యంలోని కేబినెట్‌లో ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా ఉండటం తెల్సిందే. నడ్డాతోపాటు బీజేపీ సీనియర్ నేతలు భూపేందర్ యాదవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. దీంతో, తాజా ఎన్నికల్లో నెగ్గిన మాజీ మంత్రులు కొందరిని పార్టీ పదవుల్లోకి తీసుకోవచ్చనే చర్చ జరుగుతోంది. వీరిలో అధ్యక్ష పదవి ఎవరిని వరించనుందనే విషయం చర్చనీయాంశమైంది. బీజేపీ చీఫ్‌గా నడ్డా పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈయన 2020లో అమిత్ షా నుంచి పార్టీ పగ్గాలు చేపట్టారు. అంతకు ముందు పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన మంత్రుల్లో నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి ట్రాన్స్‌జెండర్లు, పారిశుధ్య కార్మికులు, కూలీలు

న్యూఢిల్లీ: మోదీ ప్రమాణ స్వీకారానికి భిన్న వర్గాల ప్రజలు హాజరయ్యారు. ట్రాన్స్‌జెండర్లు, పారిశుధ్య కార్మికులతోపాటు నూతన పార్లమెంట్ భవన నిర్మాణంలో పాలుపంచుకున్న కూలీలు సైతం హాజరుకావడం విశేషం. ప్రమాణ స్వీకారం కంటే ముందు ట్రాన్స్‌జెండర్లను కేంద్ర మాజీ మంత్రి వీరేంద్ర కుమార్, పారిశుధ్య కార్మికులను బీజేపీ ఎంపీ గజేంద్రసింగ్ షెకావత్ ఘనంగా సత్కరించారు. ‘సబ్‌కా సాత్ సబ్‌కా విశ్వాస్ సబ్‌కా ప్రయాస్’ అంటూ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకుంటూ ట్రాన్స్‌జెండర్లను సత్కరించినట్లు వీరేంద్ర కుమార్ తెలిపారు.

ఒడిశా సీఎంగా సురేశ్ పూజారి?

ఢిల్లీకి రావాలంటూ అధిష్టానం పిలుపు

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో దాదాపు 24 ఏళ్లకు బీజేపీ గెలుపు సొంతం చేసుకోవడం తెల్సిందే. ముఖ్యమంత్రి కుర్చీని అధిరోహించేదెవరన్న విషయంలో మాత్రం సందిగ్ధం కొనసాగుతోంది. అయితే, సీనియర్ నేత, తాజాగా ఎమ్మెల్యే సురేశ్ పూజారిని పార్టీ హైకమాండ్ ఢిల్లీకి రావాలంటూ కబురు పంపించింది. దీంతో, సీఎం పదవి ఆయనకే దక్కవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. శాసనసభా పక్ష నేత ఎవరనేది అధిష్టానమే చూసుకుంటుందని రాష్ట్ర వర్గాలు అంటున్నాయి. ఇలా ఉండగా, ప్రధానమంత్రి బిజీ షెడ్యూల్ దృష్ట్యా కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఈ నెల 10కి బదులుగా 12న చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

క్రియాశీల రాజకీయాలకు గుడ్ బై: వీకే పాండ్యన్

ఒడిశా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేడీ ఘోర ఓటమి చవిచూడటంతో క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు మాజీ అధికారి, ఆ పార్టీ నేత వీకే పాండ్యన్ ప్రకటించారు. బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్‌కు సాయంగా ఉండేందుకు మాత్రమే రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదని చెప్పారు.

ఒకే రన్‌వేపైకి రెండు విమానాలు

ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఇండిగో విమానం ల్యాండైన రన్‌వేపైనే కేవలం నిమిషంలోపే ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకుంది. శనివారం జరిగిన ఈ ఘటనను డీజీసీఏ సీరియస్‌గా పరిగణించింది.ఘటన సమయంలో బాధ్యతల్లో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్(ఏటీసీ)ను విధుల నుంచి తొలగించింది. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు డీజీసీఏ ఆదివారం తెలిపింది. ఒక విమానం ల్యాండవటం, మరో విమానం అదే రన్‌వే నుంచి టేకాఫ్ తీసుకుంటున్నట్లుగా ఉన్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో డీజీసీఏ షేర్ చేసింది. కాగా, ఏటీసీ సూచనల మేరకే తమ పైలట్ విమానాన్ని ల్యాండ్ చేసినట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది.

పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా

నీట్ లీకేజీపై బాధిత విద్యార్థులకు రాహుల్ భరోసా

న్యూఢిల్లీ: నీట్ -యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షలో అవకతవకల వ్యవహారం దేశంలోని 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో పడేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బాధిత విద్యార్థుల గొంతుకనవుతానన్నారు. లీకేజీ ఆరోపణలతో ప్రశ్నార్థకంగా మారిన విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానన్నారు. ఆదివారం ‘ఎక్స్’లో రాహుల్ గాంధీ...‘నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం కూడా చేయకమునుపే నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులు, వారి కుటుంబాల ఆశలు గల్లంతయ్యాయి. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు గరిష్ట మార్కులు సాధించి, టాప్ ర్యాంకు సాధించారు. ఇలాంటిది సాంకేతికంగా అసాధ్యం. కానీ, పేపర్ లీక్ కాలేదంటూ ప్రభుత్వం పదేపదే అంటోంది. దీని వెనుక మాఫియా, ప్రభుత్వ యంత్రాంగం కుట్ర ఉంది. ఇలాంటి వాటి గుట్టురట్టు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వద్ద పక్కా ప్రణాళిక ఉంది. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు మా పార్టీ ప్రత్యేకంగా చట్టం తీసుకువస్తుంది. మీ భవితకు సంబంధించిన అన్ని అంశాలపై పార్లమెంట్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తా. మీ గొంతుకనై ప్రశ్నిస్తా’అని విద్యార్థులకు రాహుల్ హామీ ఇచ్చారు.

తీర్థయాత్రికుల బస్సుపై కాల్పులు.. 9 మంది మృతి..33 మందికి గాయాలు

కశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య

జమ్మూ: తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సుపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. డ్రైవర్ గాయపడటంతో అదుపు తప్పి బస్సు లోయలో పడిపోయింది. ఘటనలో 9 మంది తీర్థయాత్రికులు చనిపోగా మరో 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో ఆదివారం సాయంత్రం 6.15 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 53 మంది యాత్రికుల బస్సు శివ్ ఖోరి నుంచి కాట్రాలోని మాతా వైష్ణోదేవి ఆలయం వైపు వెళుతోంది. పోని ఏరియాలో టెర్యాత్ గ్రామం వద్ద బస్సుపైకి ఉగ్రవాదులు హఠాత్తుగా కాల్పులకు దిగారు. కాల్పుల్లో డ్రైవర్ గాయపడటంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది.

అడ్వాన్స్‌డ్‌లో ఏపీ మెరుపులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ...

శశి వేలివెన్ను విజయభేరి

ఉండ్రాజవరం: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో శశి వేలివెన్ను విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఆలిండియా స్థాయిలో పి.సత్యసాయి పవన్ రానా 13, బి.గరిమ 73, కె.సృజన్ 97, కె.సంజయ్ పవన్ 200, కె.రామ్‌సాయిదొర 227, సీహెచ్ డేవిడ్ రూఫస్ 320, సీహెచ్ పురంధర సత్య 342, కె.రేష్మిత 355, పి.నితిష్ శ్రీసత్య 399, ఎస్.సుప్రియ 460 ర్యాంకులు పొందారని వివరించారు. వీరితోపాటు 100 లోపు ముగ్గురు, 500లోపు 10మంది, 1,000లోపు 20 మంది, 5,000లోపు 69 మంది, 10,000 లోపు 86 మంది ఆలిండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

'తిరుమల' జయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 పరీక్ష ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు 542 మంది ర్యాంకులు సాధించి జయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ విద్యార్థులు జీఎస్ వెంకట దుర్గసాయి 53వ ర్యాంకు, కె.శరణ్‌తేజ అనురూప్‌రెడ్డి 62, కె.సాకేత్ ప్రణవ్ 92, బి.హర్షనాగ వర్ధన్ 95, జి.సత్యనారాయణ 114, పి.రాహుల్ 119, బి.హేమంత్ 123, ఎస్.నిషాంత్ 126, ఆర్.పవిత్ర 129, ఎం.వినేష్ కుమార్ 133, ఎంజీ వెంకట మహేష్ 136వ ర్యాంకులు సాధించారని వివరించారు. వీరితోపాటు 300 మంది పైగా తమ విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని తిరుమలరావు వివరించారు.

'ఆదిత్య' అద్భుత ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. 100లోపు నలుగురు, 500లోపు 12 మంది, వెయ్యిలోపు 22మంది, ఐదు వేలలోపు 82మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. ర్యాంకర్లను శేషారెడ్డితోపాటు కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్లు లక్ష్మీరాజ్యం, శృతి, సుగుణ, కో–ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్ అభినందించారు.

'భాష్యం' విజయకేతనం


విద్యార్థులతో భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ అఖిల భారత స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించిందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో ఆయన మాట్లాడుతూ ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో 50వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 62వ ర్యాంకు కైవసం చేసుకున్నారని చెప్పారు. వీరితోపాటు వివిధ కేటగిరీల్లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, పి.గౌతమి 19, కె.శ్రేయ 23, కె.జాషువా వివేక్ 26, జి.జాన్ 36, ఎం.అర్జున్‌కుమార్ 37, కె.హర్షిత 43, కె.చైతన్య 52, పి.శ్యామ్ 61, డి.భరత్‌చంద్ర 86వ ర్యాంకులను సాధించారన్నారు. ఆలిండియా స్థాయిలో 100 లోపు 12, 200లోపు 20, 500లోపు 51, వెయ్యిలోపు 86, రెండు వేల లోపు 107, ఐదు వేల లోపు 193 ర్యాంకులు పొందడంతో పాటు ఐఐటీ సెలక్షన్స్‌లో ఆలిండియా ఆల్‌టైం ది బెస్ట్‌గా భాష్యం నిలిచిందని వివరించారు. విద్యార్థులను రామకృష్ణతోపాటు డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

విశ్వభారతి పూర్వ విద్యార్థికి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

గుడివాడ రూరల్: ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్–24లో గుడివాడ విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థులు జగన్నాథన్ మోహిత్ ఆలిండియా 1వ ర్యాంక్, బోతమోళ్ల చరణ్ ఆలిండియా 2వ ర్యాంక్‌తో సంచలన విజయం సాధించారని పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆదివారం తెలిపారు. దొరిశాల శ్రీనివాసరెడ్డి 13వ ర్యాంక్, ఎం.సాయిదివ్య తేజరెడ్డి 15వ ర్యాంక్, ఎం.సాయి శివలోచన్ 16వ ర్యాంక్, కె.ప్రభాకరరెడ్డి 18వ ర్యాంక్, వై.సత్యసాయి నిలేష్ 20వ ర్యాంక్, కె.జాహ్నవి 75వ ర్యాంక్, డి.ఉపేంద్ర 91వ ర్యాంక్, కె.సూర్యశశాంక్ 94వ ర్యాంక్‌లు సాధించారని వివరించారు. పెదపారుపూడి మండలం వానపాముల గ్రామంలోని విశ్వభారతి వైజీవుడ్స్ విద్యార్థి కె.దూండి ఈశ్వరసాయి యశ్వంత్‌కు ఆలిండియా 2వ ర్యాంక్ సాధించారని తెలిపారు.

కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్–24లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో 5, 55 ర్యాంకులు సాధించారు. పుట్టి కుషల్‌కుమార్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 5వ ర్యాంక్, సతివాడ జ్యోతిరాదిత్య 55వ ర్యాంక్ సాధించారు. మొదటి 100లోపు వివిధ కేటగిరీల్లో 3, 5, 9, 12, 17, 26, 28, 45, 55, 55, 64, 88 వంటి 12 ర్యాంకులను సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేకేఆర్, డైరెక్టర్లు అభినందించారని ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ తెలిపారు.

'ఎస్ఆర్' విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి : జేఈఈ–2024 అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి అన్ని కేటగిరీల్లో కలిపి జి.నవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్‌కుమార్ 36వ ర్యాంకు, స్నేహిత్‌సందేశ్ 123 ర్యాంకు, వి.రాంబాబు 125వ ర్యాంకు, వి.వేదవంచన్‌రెడ్డి 127, జె.శ్రేతన్‌రెడ్డి 133, బోడ దినేష్ 157, మాలోతు వెంకటేశ్వర్లు 185, దాసరి కార్తీక్ 299, తిలావత్ అఖిల్‌నాయక్ 323, కె.శ్రీరామ్‌రెడ్డి 324వ ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే ఓపెన్‌లో అన్ని కేటగిరీలు కలిపి 450, 598, 621, 654, 689, 737, 737, 751, 901, 966తో పాటు మరిన్ని ర్యాంకులు వచ్చాయని వివరించారు.

సత్తాచాటిన 'నారాయణ'

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జయభేరి మోగించారు. అఖిల భారత ఓపెన్ కేటగిరీలో టాప్ 20 లోపు 7 ర్యాంకులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల గ్రూప్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో సందేష్ భోగాలపల్లి 3 వర్యాంకు, రాజ్‌దీప్ మిశ్రా 6వ ర్యాంకు, ఎం.బాలాదిత్య 11 వ ర్యాంకు, రాఘవ్ శర్మ 12 వ ర్యాంకు, బిస్మిత్ సాహు 16 వ ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ 17వ ర్యాంకు, అమోఘ్ అగర్వాల్ 20వ ర్యాంకులను సాధించినట్లు వారు తెలిపారు. వీటితోపాటు తమ సంస్థకు చెందిన విద్యార్థులు 27,28,31,33,40,45,49,51,54,63,66,70,74,76,77,82,85,87,89,90, 91,94,99 ర్యాంకుల్ని కైవశం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

'శ్రీచైతన్య' అత్యుత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న శ్రీ చైతన్య డైరెక్టర్ సుష్మ

మాదాపూర్ (హైదరాబాద్): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరులు సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆలిండియా 1వ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఆలిండియా 1వ ర్యాంకు రాఘవశర్మ, 4వ ర్యాంకు రిథమ్ కేడియా, పుట్టి కుశాల్‌కుమార్ 5వ ర్యాంకు, రాజదీప్‌మిశ్రా 6వ ర్యాంకు, ధృవిన్ హేమంత్ దోషి 9వ ర్యాంకు, అల్లడబోయిన సిద్విక్ సుహాస్ 10వ ర్యాంకును కై వశం చేసుకున్నట్లు తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు 5ర్యాంకులు 100లోపు 27 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటిన రాష్ట్ర విద్యార్థులు

సాక్షి, అమరావతి : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో టాప్–10లో నలుగురు ఏపీ విద్యార్థులు ర్యాంకులు సాధించారు. వంద ర్యాంకుల్లో 20 మంది తెలుగు రాష్ట్రానికి చెందిన వాళ్లే ఉన్నారు. మొత్తంగా అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారిలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు 12 వేల మంది వరకు ఉన్నారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్‌కు చెందిన భోగలపల్లి సందేశ్ 360కి గాను 338 మార్కులతో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. అనంతపురం జిల్లాకు చెందిన పుట్టి కుశాల్ కుమార్ 334 మార్కులతో 5వ ర్యాంకు, కర్నూలు జిల్లాకు చెందిన కోడూరు తేజేశ్వర్ 331 మార్కులతో 8వ ర్యాంకు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అల్లడబోయిన ఎస్ఎస్‌డీటీ సిద్విక్ సుహాస్ 329 మార్కులతో 10వ ర్యాంకుతో మెరిశారు. ఏపీకి చెందిన మత బాలాదిత్య (ఐఐటీ భువనేశ్వర్ జోన్)కు 11వ ర్యాంకు రాగా, ఓబీసీ కేటగిరీలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్‌గా ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి 355 మార్కులతో సత్తా చాటాడు. తొలి పది ర్యాంకుల్లో ఐఐటీ రూర్కీ జోన్‌కు ఒకటి, ఐఐటీ ఢిల్లీ జోన్‌కు రెండు, ఐఐటీ బాంబే జోన్‌కు మూడు, అత్యధికంగా ఐఐటీ మద్రాస్ జోన్‌కు నాలుగు ర్యాంకులు దక్కడం విశేషం. ఇక ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజా ధర్మేష్ కుమార్ పటేల్ జాతీయ స్థాయిలో 332 మార్కులతో 7వ ర్యాంకు సాధించడమే కాకుండా బాలికల విభాగంలో టాపర్‌గా నిలిచింది. గతేడాది తొలి పది స్థానాల్లో ఆరుగురు హైదరాబాద్ జోన్‌కు చెందిన విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది ఆ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయారు.

టాప్ 10 ర్యాంకర్లు

పేరు	జోన్	మార్కులు	ర్యాంకు
వేద్ లహోటి	ఐఐటీ ఢిల్లీ	355	1
ఆదిత్య	ఐఐటీ ఢిల్లీ	346	2
భోగలపల్లి సందేశ్	ఐఐటీ మద్రాస్	338	3
రిథమ్ కేడియా	ఐఐటీ రూర్కీ	337	4
పుట్టి కుశాల్ కుమార్	ఐఐటీ మద్రాస్	334	5
రాజ్‌దీప్ మిశ్రా	ఐఐటీ బాంబే	333	6
ద్విజా ధర్మేష్‌కుమార్ పటేల్	ఐఐటీ బాంబే	332	7
కోడూరు తేజేశ్వర్ ఐఐటీ	మద్రాస్	331	8
ధృవిన్ హేమంత్ దోషి	ఐఐటీ బాంబే	329	9
అల్లడబోయిన ఎస్ఎస్‌డీటీ సిద్విక్ సుహాస్	ఐఐటీ మద్రాస్	329	10

(తెలుగు రాష్ట్రాలు మద్రాస్ జోన్‌లో ఉంటాయి)

పెరిగిన ఉత్తీర్ణత

దేశ వ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశాలకు సంబంధించి ఏటా 2.50 లక్షల మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఈ ఏడాది 1,86,584 లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,80,200 మంది పరీక్షకు హాజరవ్వగా 48,248 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇది 2023లో 43,773గా ఉంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణతలో బాలికల సంఖ్య కూడా పెరిగింది. 2023లో 7,509 మంది ఉంటే తాజాగా 7,964 మంది ఉత్తీర్ణులయ్యారు. 331 మంది ఓవర్‌సీస్ ఇండియన్స్ పరీక్ష రాస్తే 179 మంది, 158 విదేశీ విద్యార్థులు పరీక్షకు హాజరైతే కేవలం 7 మంది మాత్రమే అర్హత సాధించడం గమనార్హం.

నేటి నుంచి జోసా కౌన్సెలింగ్

ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్ఐటీలో ప్రవేశాలకు సంబంధించి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) సోమవారం (నేడు) నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనుంది. విద్యార్థులకు అవగాహన నిమిత్తం 17వ తేదీ వరకు మాక్ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. మొత్తం ఐదు దశల్లో కౌన్సెలింగ్‌ను పూర్తి చేసేందుకు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. 18వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు, ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పిస్తోంది. అనంతరం 20న తొలి దశ, 27న రెండో దశ, జూలై 4న మూడో దశ, జూలై 10న నాల్గవ దశ, జూలై 17న తుది విడత సీట్లను కేటాయించనుంది. జూలై 23న మిగిలిన సీట్లు ఉంటే వాటికి కూడా కౌన్సెలింగ్ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించింది.

నా లక్ష్యం ఐఏఎస్



మాది నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామం. అమ్మ వి.రాజేశ్వరి, నాన్న బి.రామ సుబ్బారెడ్డి.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. పదో తరగతిలో 10/10 పాయింట్లు వచ్చాయి. ఇంటర్‌లో 987 మార్కులు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 99.99 పర్సెంటైల్‌తో ఆల్ ఇండియా లెవెల్‌లో 252వ ర్యాంకు వచ్చింది. జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో 368 మార్కులకు 338 వచ్చాయి. ఓపెన్ క్యాటగిరీలో ఆలిండియాలో 3వ ర్యాంక్, సౌత్ ఇండియాలో మొదటి ర్యాంక్ రావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివి, సివిల్స్ పరీక్ష రాసి ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం.

– బొగ్గులపల్లి సందేశ్, 3వ ర్యాంకు

ముందస్తు ప్రణాళికతో చదివా



మాది కర్నూలు జిల్లా కృష్ణగిరి గ్రామం. అమ్మానాన్నలు కృష్ణవేణి, శేఖర్.. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. పదో తరగతిలో 570, ఇంటర్‌లో 981 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా లెవెల్‌లో 83వ ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా లెవెల్‌లో 8వ ర్యాంకు రావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. ఐఐటీ ముంబైలో సీఎస్ఈ చదవాలని ఉంది. ముందస్తు ప్రణాళికతో చదవడం వల్లే ఉత్తమ ర్యాంకు సాధించాను.

– కె.తేజేశ్వర్, 8వ ర్యాంకు

– కర్నూలు సిటీ

అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఐఐటీ జోన్ల వారీగా టాప్- 500 అభ్యర్థులు

జోన్	టాప్-10	టాప్-100	టాప్-200	టాప్-300	టాప్-400	టాప్-500	ఉత్తీర్ణులు
బాంబే	3	30	60	85	111	136	9,480
ఢిల్లీ	2	29	60	82	104	122	10,255
గౌహతి	0	2	2	4	5	5	2,458
కాన్పూర్	0	1	4	4	12	17	4,928
భువనేశ్వర్	0	4	8	10	18	27	4,811
మద్రాస్	4	25	53	88	112	145	11,180
రూర్కీ	1	9	13	27	38	48	5,136

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కేటగిరీ వారీగా అర్హుల సంఖ్య

కేటగిరీ	దరఖాస్తులు	పరీక్ష రాసింది	అర్హుల సంఖ్య
జనరల్	38,701	37,578	14,083
జనరల్ (పీడబ్ల్యూడీ)	857	798	236
ఓబీసీ-ఎన్‌సీఎల్	68,507	66,213	9,281
ఓబీసీ-ఎన్‌సీఎల్(పీడబ్ల్యూడీ)	1,139	1,070	218
ఈడబ్ల్యూఎస్	31,363	30,643	5,423
ఈడబ్ల్యూఎస్ (పీడబ్ల్యూడీ)	340	324	85
ఎస్సీ	30,370	29,432	13,794
ఎస్సీ (పీడబ్ల్యూడీ)	227	207	41
ఎస్టీ	14,651	13,869	5,073
ఎస్టీ (పీడబ్ల్యూడీ)	69	66	14

పెరిగిన కటాఫ్ మార్కులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హులుగా పరిగణనలోకి తీసుకునేందుకు ఈసారి కటాఫ్ మార్కులు పెరిగాయి. గతేడాది జనరల్ ర్యాంకు కటాఫ్ 86 ఉండగా ఇప్పుడు 109కి పెరిగింది. ఓబీసీ 98, ఈడబ్ల్యూఎస్ 98, ఎస్సీ, ఎస్టీ, వివిధ పీడబ్ల్యూడీ విభాగాల్లో 54గా ఉండటం గమనార్హం. 2017 తర్వాత భారీ స్థాయిలో కటాఫ్ మార్కులు పెరిగాయి.

వివిధ కేటగిరీల వారీగా టాపర్లు

కేటగిరీ	పేరు	జోన్
ఓపెన్	వేద్ లహోటి	ఐఐటీ ఢిల్లీ
ఈడబ్ల్యూఎస్	రాఘవ శర్మ	ఐఐటీ ఢిల్లీ
ఓబీసీ	మత బాలాదిత్య	ఐఐటీ భువనేశ్వర్
ఎస్సీ	బిబస్వాన్ బిస్వాన్	ఐఐటీ భువనేశ్వర్
ఎస్టీ	సుముఖ్ ఎంజీ	ఐఐటీ ఢిల్లీ
ఓపెన్ పీడబ్ల్యూడీ	గుండా జోష్నిత	ఐఐటీ మద్రాస్
ఓబీసీ పీడబ్ల్యూడీ	పార్థ్ బవాన్కులే	ఐఐటీ బాంబే
ఎస్సీ పీడబ్ల్యూడీ	హేమంత్ గాడ్వే	ఐఐటీ బాంబే
ఎస్టీ పీడబ్ల్యూడీ	సంగీ నార్పెల్ షెర్పా	ఐఐటీ గౌహతి


బాలురు, బాలికల వారీగా అర్హత

జెండర్	దరఖాస్తులు	పరీక్ష రాసింది	అర్హులు
పురుషుల	1,43,637	1,39,180	40,284
స్త్రీలు	42,947	41,020	7,964
మొత్తం	1,86,584	1,80,200	48,248

సత్తా చాటిన లారీ డ్రైవర్ కుమారుడు



నరసన్నపేట: ఒక సాధారణ లారీ డ్రైవర్ కుమారుడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 803వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 118 వ ర్యాంకు సాధించాడు. నరసన్నపేట మండలం దూకులపాడుకు చెందిన అల్లు ప్రసాదరావు కుమారుడు రామలింగన్నాయుడు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టాడు. పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి మొదటి నుంచి పట్టుదలతో చదివేవాడు. ఆరో తరగతి నుంచి వెన్నెలవలస నవోదయలో చదువుకున్నాడు. తండ్రి ప్రసాదరావు లారీ డ్రైవర్ అయినప్పటికీ, కుమారుడికి చదువుపై ఉన్న మక్కువను గుర్తించి ప్రోత్సహించారు. విద్యార్థి తల్లి సుగుణ గృహిణి. కోర్సు పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని రామలింగన్నాయుడు తెలిపారు.



- తీవ్రమవుతున్న మానసిక ఒత్తిళ్లు
- ఒత్తిడితో డిప్రెషన్, ఆందోళన
- వైద్యుల వద్దకు వస్తున్న కేసుల్లో ఇలాంటివే ఎక్కువ
- యోగా, ధ్యానం, నడక తప్పదంటున్న వైద్యులు
- సకాలంలో ఆహార తినడం ప్రధానం
- కంటినిండా నిద్ర కూడా ముఖ్యమే

టెన్షన్.. టెన్షన్!

కర్నూలు (హాస్పిటల్): వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక టెన్షన్ ఉంటోంది. పిల్లలకు చదువుపై టెన్షన్. ఇన్‌టైమ్‌లో హోమ్ వర్క్ చేయడం, చెప్పిన పాఠాలు అర్థం చేసుకోవడం, హోమ్‌వర్క్ చేయకపోతే టీచర్ కొడుతుందేమోనని భయం వారిది. చదువు పూర్తయ్యాక ఉద్యోగం కోసం యువత టెన్షన్. ఉద్యోగం వస్తేనే అమ్మాయిని ఇస్తారనేది ఇంకో టెన్షన్. ఇలా ఉద్యోగం లేక, పెళ్లి కాని యువత చాలామందే ఉన్నారు. తీరా ఉద్యోగం వచ్చాక ఆయా సంస్థలు, ఉన్నతాధికారులు ఇచ్చే లక్ష్యాలు నెరవేర్చాలంటే మరో టెన్షన్. వీకెండ్ వస్తే ఇంట్లో భార్యాపిల్లల ఇష్టాలు తీర్చేందుకు అవసరమైన డబ్బు లేదనేది మరికొందరి టెన్షన్. పిల్లలు పెద్దయ్యాక వారికి వివాహాలు చేయడం మరో టెన్షన్. దీంతోపాటు ఇంట్లో పెద్దల ఆరోగ్య విషయాలు, వారి ఆలనాపాలనా చూసేవారు కరువు కావడం, అందరూ ఉన్నా అనాథలు కావడం ఇంకో టెన్షన్. ఇలా ఎవరి స్థాయిలో వారికి టెన్షన్ ఉంటోంది. ఈ క్రమంలో టెన్షన్‌తో పాటు ఆందోళన, డిప్రెషన్ వస్తున్నాయి. వీటిని తగ్గించుకునేందుకు ఇటీవల మానసిక వైద్యుల వద్దకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఓపీ పెరుగుతోంది

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక వ్యాధుల విభాగం ఓపీకి ప్రతిరోజూ 75 నుంచి 90 మంది వరకు రోగులు వస్తుండగా.. అందులో 40 శాతం కొత్తవారు ఉండటం గమనార్హం. వీరిలో 40 నుంచి 50 శాతం వరకు ఆందోళన, కుంగుబాటు(డిప్రెషన్)కు గురై చికిత్స కోసం వస్తున్న వారే ఉంటున్నారు. వీరు గాక నగరంలోని ప్రైవేటు మానసిక వైద్యుల వద్దకు, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల వద్దకు సైతం ప్రతిరోజూ 220 నుంచి 250 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల వద్దకు సైకోసొమాటిక్ (శారీరక, మానసిక) జబ్బులతో బాధపడే వారే ఎక్కువ. దీంతోపాటు 30 శాతం మద్యం, సిగరెట్ అలవాట్లు, 20 నుంచి 30 శాతం మంది తీవ్రమైన మానసిక సమస్యలు (స్కిజోఫ్రీనియా, మానియా, డిల్యూషన్ డిజార్డర్లు, బైపోలార్, సివియర్ డిప్రెషన్)తో వస్తున్నారు. వృద్ధుల్లో 5 శాతం మంది నిద్రలేమి, మతిమరుపు సమస్యలతో వస్తున్నారు. చిన్నపిల్లల్లోనూ 5శాతం మంది మానసిక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. 2021లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక జబ్బుల విభాగానికి ఓపీ 15,942, ఇన్‌పేషెంట్లుగా 92 మంది చికిత్స పొందగా.. 2022లో ఈ సంఖ్య ఓపీలో 19,475కి, ఇన్‌పేషెంట్లు 175కి, 2023లో ఓపీ 20,323, ఇన్‌పేషెంట్ల సంఖ్య 245కు పెరిగింది.

మానసిక ఆరోగ్యానికి సూత్రాలు



- ఇష్టమైన పనులు చేయాలి
- బాధలు, కష్టాలను కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పంచుకోవాలి
- భావోద్వేగాలను అదుపులో ఉంచుకోకూడదు
- ఉదయాన్నే వాకింగ్ చేయడం, ధ్యానం, యోగా చేయాలి. దీనివల్ల డిప్రెషన్, మానసిక ఒత్తిడి అదుపులోకి వస్తాయి.
- వారాంతంలో కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్ర, సినిమాలు, షాపింగ్‌కు వెళ్లాలి.
- అందుబాటులో ఉంటే రోజులో ఒక్కసారైనా కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయాలి.

నిద్ర లేకపోవడంతోనే సమస్యలు

కొంతమంది కొద్దిపాటి సమయం లభించినా కూర్చున్న చోటే ఒక కునుకు తీస్తారు. మరికొందరు అర్ధరాత్రి దాటినా కళ్లు తెరుచుకుని అటూఇటూ చూస్తూనే ఉంటారు. ఇంకొందరు నిద్రపట్టక నిశాచర జీవుల్లా రాత్రిళ్లు ఊరంతా చుట్టేస్తుంటారు. పట్టణాల్లో అధికంగా రాత్రివేళ టీ స్టాల్స్ వద్ద ఇలాంటి వారే మనకు కనిపిస్తుంటారు. ఎప్పుడో తెల్లవారుజామున మూడు, నాలుగు సమయంలో వీరు ఇళ్లకు చేరుకుని నిద్రించి, మరునాడు ఉదయం 10 గంటల వరకు లేవడం లేదు. దీనికి మానసిక ఒత్తిళ్లు, డిప్రెషన్, ఆందోళనతో పాటు శారీరక వ్యాయామం లేకపోవడం, అధికంగా ఆహారం తీసుకోవడం, ఎక్కువగా మొబైల్ ఫోన్, టీవీ, కంప్యూటర్ స్క్రీన్‌లకు అతుక్కుపోవడమే కారణమని వైద్యులు చెబుతున్నారు. నిద్రలేమి కారణంగా మరుసటిరోజు శరీరం ఉత్సాహంగా గడిపేందుకు సహకరించడం లేదు. నిరుత్సాహం, నిస్సత్తువ ఆవహిస్తున్నట్టు ఉంటుంది. ఫలితంగా వీరికి గ్యాస్ట్రబుల్, గుండె దడ, ఊబకాయం, మలబద్దకం, బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలు కొత్తగా తలెత్తుతాయి.

మానసిక వ్యాధుల లక్షణాలు

- ఆందోళన, భయం, గుండెదడ, అధికంగా చెమట పట్టడం, కాళ్లు, చేతులు వణకడం
- గుండె ఆగినట్లు అనిపించడడం, ఛాతినొప్పి, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉండటం, భయం, ఆందోళన
- అనవసర ఆలోచనలు మళ్లీ మళ్లీ రావడం, అనవసర పనులు మళ్లీ మళ్లీ చేయడం, చేతులు అదే పనిగా కడగటం
- అకస్మాత్తుగా మాట రాకపోవడం, కాళ్లు చేతులు పడిపోవడం, మూర్ఛలాగా రావడం
- విచారంగా, పనిలో ఉత్సాహం లేకపోవడం
- ఆకలి, నిద్ర లేకపోవుట, ఆత్మహత్య చేసుకోవాలనిపించడం
- మతిమరుపు, జ్ఞాపకశక్తి తగ్గటం, ప్రవర్తనలో మార్పు, సంధి ప్రేలాపనలు
- అధికంగా ఆల్కహాల్, మాదకద్రవ్యాల అలవాటు
- మూర్ఛ వ్యాధితో వచ్చే మానసిక, దీర్ఘకాక వ్యాధులతో బాధలు, పక్షవాతం తర్వాత వచ్చే మార్పులు
- తనలో తాను నవ్వుకోవటం, మాట్లాడుకోవడం, చెవిలో మాటలు వినబడటం, ఇతరులను అనుమానించడం, భర్తలేక భార్య శీలాన్ని శంకించడం
- ఎక్కువగా మాట్లాడటం, తిరుగుట, అతి ఆనందం, అతి ధైర్యం లేదా అతికోపం, అతిగా డబ్బు ఖర్చు చేయడం
- పూనకాలు రావటం, తనకు తాను గుర్తుకు లేకుండా తిరుగుట
- ముసలితనంలో వచ్చే అనారోగ్య సమస్యలు
- అనవసరంగా భయాలు, అనుమానాలు పెంచుకోవడం
- అకస్మాత్తుగా గతంలో జరిగిన ఘటనలు మరిచిపోవడం
- బహిష్టు ముందు, తర్వాత వచ్చే మానసిక మార్పులు
- కాన్పు ముందు, తర్వాత వచ్చే మానసిక మార్పులు
- ఆకలి లేకపోవడం, నాజూకుతనానికై తినకపోవడం, అదుపు లేకుండా తినడం
- కలత నిద్ర, నిద్ర పట్టకపోవడం, నిద్రలో నడవటం, మాట్లాడటం, మూత్రవిసర్జన చేయడం, భయంకర కలవరింతలు, అతి నిద్ర, నిద్రలో పళ్లు కొరకడం
- నిగ్రహ శక్తి కోల్పోవడం, జూదానికి బానిసవటం, పరుల వస్తువులను అపహరించడం, అదే పనిగా షాపింగ్ చేయడం

చిన్నపిల్లల్లో మానసిక సమస్యలు



- తెలివి తక్కువ, బుద్ధిమాంద్యంతో కూడిన మానసిక వ్యాధులు
- చదువుపై ఏకాగ్రత లేకపోవడం, ఎక్కువగా బయట తిరగటం, బంధువులతో కలవలేకపోవడం, తనలో కంలో తానుండటం
- చదువులో వెనుకబడటం, చెడు సహవాసాలు, చెడు అలవాట్లకు గురవడం
- నిద్రలో మల, మూత్ర విసర్జనాలు చేయడం
- తినకూడని పదార్థాలు తినడం (ఉదా: మట్టి, సున్నం మొదలైనవి)

మానసిక రోగుల సంఖ్య పెరిగింది



కొంతకాలంగా మానసిక వ్యాధుల విభాగానికి బాధితులు ఎక్కువగా వస్తున్నారు. ఈ సంఖ్య ఏటా పెరుగుతోంది. ముఖ్యంగా కోవిడ్–19 పరిస్థితుల అనంతరం మానసిక వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరిగింది. తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల, జన్యుపరంగా, వ్యక్తిగత సమస్యల వల్ల, సమాజంలో పలు కారణాల వల్ల స్కిజోఫ్రీనియా, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు వస్తాయి. ప్రస్తుతం అన్నిరకాల మానసిక సమస్యలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందిస్తున్నాం. అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నాం.

– డాక్టర్ గంగాధర్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మానసిక వ్యాధుల విభాగం, జీజీహెచ్, కర్నూలు



12 భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన 12వ దేశంగా అమెరికా గుర్తింపు పొందింది. 1952లో భారత్‌లో తొలిసారి పాక్ జట్టు ఆడగా... 1955లో పాకిస్తాన్‌లో భారత జట్టు ఆడింది. ఆ తర్వాత ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్‌లకు యూఏఈ (1984లో), ఆస్ట్రేలియా (1985లో), బంగ్లాదేశ్ (1988లో), సింగపూర్ (1996లో), కెనడా (1996లో), శ్రీలంక (1997లో), ఇంగ్లండ్ (1999లో), దక్షిణాఫ్రికా (2003లో), నెదర్లాండ్స్ (2004లో), అమెరికా (2024లో) ఆతిథ్యమిచ్చాయి.

1 విరాట్ కోహ్లి అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేశాక భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన టి20 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో టాప్ స్కోరర్‌గా నిలవకపోవడం ఇదే తొలిసారి. గతంలో భారత్, పాక్ జట్ల మధ్య జరిగిన టి20 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో కోహ్లి (2012లో: 78 నాటౌట్), (2014లో 36 నాటౌట్), (2016లో 55 నాటౌట్), (2021లో 57), (2022లో 82 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



1 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్‌లో ఇద్దరు ప్లేయర్లు 'గోల్డెన్ డక్' (ఆడిన తొలి బంతికే అవుటవ్వడం) కావడం ఇదే తొలిసారి.

1 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగాక ఆలౌట్ కావడం భారత జట్టుకిదే తొలిసారి.

విజేత సుమిత్

పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు!



హేల్‌బ్రోన్ (జర్మనీ): భారత టెన్నిస్ నంబర్ వన్ సుమిత్ నగాల్ కెరీర్‌లో ఆరో ఏటీపీ చాలెంజర్ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన నెకర్ కప్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో సుమిత్ చాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 41 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 6–1, 6–7 (5/7), 6–3తో ప్రపంచ 184వ ర్యాంకర్ అలెగ్జాండర్ రిషార్డ్ (స్విట్జర్లాండ్)పై విజయం సాధించాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయిన భారత స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఈ విజయంతో సుమిత్‌కు 16,550 యూరోల (రూ. 14 లక్షల 96 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా టైటిల్‌తో సుమిత్ 77వ ర్యాంక్‌కు చేరుకునే అవకాశముంది. అంతేకాకుండా వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు కూడా అతనికి బెర్త్ దాదాపు ఖరారు కానుంది.

భారత ఫుట్‌బాల్ జట్టు కొత్త కెప్టెన్‌గా గుర్‌ప్రీత్

రేపు ఖతర్ జట్టుతో కీలక మ్యాచ్



దోహా: అంతర్జాతీయ కెరీర్‌కు రెగ్యులర్ కెప్టెన్ సునీల్ ఛెత్రి వీడ్కోలు పలకడంతో భారత ఫుట్‌బాల్ జట్టు పగ్గాలను గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూకు అప్పగించారు. ప్రపంచకప్–2026 ఆసియా జోన్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం దోహాలో ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో భారత్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గుర్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇప్పటికే దోహా చేరుకున్న భారత జట్టు ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా క్వాలిఫయర్స్ మూడో రౌండ్‌కు అర్హత పొందాలంటే ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి. పంజాబ్‌కు చెందిన గుర్‌ప్రీత్ 2011లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటి వరకు అతను 72 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భారత్ తరఫున బరిలోకి దిగాడు.

న్యూయార్క్‌లో నమో భారత్

పాకిస్తాన్‌పై టీమిండియా మరో విజయం

6 పరుగులతో నెగ్గిన రోహిత్ సేన • రాణించిన పంత్, బుమ్రా

పాకిస్తాన్‌తో ప్రపంచకప్ పోరు... భారత్ చేసింది 119 పరుగులే... బ్యాటింగ్‌కు అనుకూలించని పిచ్ అయినా సరే ఈ మాత్రం స్కోరును కాపాడుకోవడం కష్టంగానే అనిపించింది... లక్ష్యం ఎదురుగా కనిపిస్తుండగా... పాక్ నెమ్మదిగా అడుగులు వేసింది. 12 ఓవర్లు ముగిసేసరికి బంతికో పరుగు చొప్పున 72 పరుగులు వచ్చేశాయి. మిగిలిన 48 బంతుల్లో చేయాల్సింది 48 పరుగులే... చేతిలో 8 వికెట్లున్నాయి. కానీ అప్పుడు ఒక్కసారిగా మ్యాచ్ మలుపు తిరిగింది. పాండ్యా, బుమ్రా బౌలింగ్ దెబ్బకు పాక్ పరుగు తీయడమే గగనంగా మారిపోయింది. ఒక్కో పరుగు కోసం శ్రమించి ఆ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. అద్భుతమైన ఆటతో ఒత్తిడి పెంచిన భారత్ చివరి వరకు దానిని కొనసాగించింది. ఫలితంగా వరల్డ్ కప్‌లో మరో విజయం మన ఖాతాలో చేరింది. పాక్‌పై మనదే పైచేయి అని నిరూపితమైంది. బ్యాటింగ్‌లో కఠిన పరిస్థితుల్లో కీలక పరుగులు చేసిన పంత్, కీపింగ్‌లో చక్కటి క్యాచ్‌లతో గెలిపించాడు. మ్యాచ్ ఏకపక్షంగా సాగకపోయినా... ఉత్కంఠకు లోటు లేకపోయింది. వరల్డ్ కప్ మెల్‌బోర్న్ నుంచి న్యూయార్క్‌కు చేరినా... అక్కడా మన గెలుపు పిలుపు వినిపించింది.



బుమ్రా సంబరం

న్యూయార్క్: టి20 ప్రపంచకప్‌లో ఆసక్తి రేపిన మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. రిషభ్ పంత్ (31 బంతుల్లో 42; 6 ఫోర్లు) కీలక పరుగులు సాధించాడు. అనంతరం పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 113 పరుగులే చేయగలిగింది. రిజ్వాన్ (44 బంతుల్లో 31; 1 ఫోర్, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా (3/14), హార్దిక్ పాండ్యా (2/24) ప్రత్యర్థిని పడగొట్టారు.

పంత్ మినహా...

అనూహ్యంగా దూసుకొస్తున్న బంతులు, బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని పిచ్, నెమ్మదైన అవుట్‌ఫీల్డ్... అన్నీ వెరసి భారత ఆటగాళ్లు ప్రతీ పరుగు కోసం ఇబ్బంది పడ్డారు. పాక్ బౌలర్లంతా కట్టుదిట్టమైన బంతులతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ఓపెనర్లు కోహ్లి (4), రోహిత్ శర్మ (13) ఏడు పరుగుల వ్యవధిలో వెనుదిరగ్గా... నాలుగో స్థానంలో వచ్చిన అక్షర్ (18 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో పంత్ బాధ్యత తీసుకున్నాడు. సాధారణ షాట్లకు పరుగులు రాలేని స్థితిలో తనదైన శైలిలో భిన్నమైన షాట్లతో స్కోరును నడిపించాడు. ఈ క్రమంలో అతనికి అదృష్టం కూడా కలిసొచ్చింది. తన తొలి 14 బంతుల్లో 4 సార్లు పంత్ అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పాక్ వదిలిన క్యాచ్‌లు సునాయాసమైనవి కాకపోయినా అసాధ్యమైనవి కూడా కాదు! రవూఫ్ ఓవర్లో అతను వరుసగా 3 ఫోర్లతో ధాటిని ప్రదర్శించగా, 89/3 వద్ద భారత్ కాస్త మెరుగైన స్థితిలో కనిపించింది. అయితే ఇక్కడి నుంచి జట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. సూర్యకుమార్ (7) ప్రభావం చూపలేకపోగా, దూబే (3) విఫలమయ్యాడు. పంత్, జడేజా (0) వరుస బంతుల్లో వెనుదిరగ్గా... పాండ్యా (7), బుమ్రా (0) కూడా వరుస బంతుల్లో అవుటయ్యారు. అర్ష్‌దీప్ (9) రనౌట్‌తో మరో ఓవర్ మిగిలి ఉండగానే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

టపటపా...

స్వల్ప లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ కూడా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయలేకపోయింది. తడబడుతూనే ఆడిన బాబర్ ఆజమ్ (13) ఆరంభంలోనే వెనుదిరగ్గా... ఉస్మాన్ ఖాన్ (13), ఫఖర్ జమాన్ (13) కూడా విఫలమయ్యారు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన రిజ్వాన్‌ను కీలక సమయంలో బుమ్రా బౌల్డ్ చేయడంలో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. షాదాబ్ (4), ఇఫ్తికార్ (5) ప్రభావం చూపలేకపోగా, ఇమాద్ వసీమ్ (23 బంతుల్లో 15; 1 ఫోర్) బంతులు వృథా చేసి జట్టు ఓటమిని ఆహ్వానించాడు.



పంత్



హార్దిక్, రోహిత్

వర్షంతో అంతరాయం

మ్యాచ్‌కు అనూహ్యంగా వర్షం దెబ్బ పడింది. చిరు జల్లులు కురవడంతో టాస్ ఆలస్యం కాగా, నిర్ణీత సమయంకంటే 50 నిమిషాలు ఆలస్యంగా మ్యాచ్ మొదలైంది. అయితే భారత్ ఇన్నింగ్స్‌లో ఒక్క ఓవర్ పూర్తి కాగానే మళ్లీ వాన రావడంతో ఆటను నిలిపివేశారు. మరో 35 నిమిషాల తర్వాత ఇన్నింగ్స్ కొనసాగింది. విరామం తర్వాత నసీమ్ వేసిన తొలి ఓవర్లోనే కోహ్లి వెనుదిరగడంతో భారత్‌కు నిరాశాజనక ఆరంభం లభించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రవూఫ్ (బి) అఫ్రిది 13; కోహ్లి (సి) ఉస్మాన్ (బి) నసీమ్ 4; పంత్ (సి) బాబర్ (బి) ఆమిర్ 42; అక్షర్ (బి) నసీమ్ 20; సూర్యకుమార్ (సి) ఆమిర్ (బి) రవూఫ్ 7; దూబే (సి అండ్ బి) నసీమ్ 3; పాండ్యా (సి) ఇఫ్తికార్ (బి) రవూఫ్ 7; జడేజా (సి) ఇమాద్ (బి) ఆమిర్ 0; అర్ష్‌దీప్ (రనౌట్) 9; బుమ్రా (సి) ఇమాద్ (బి) రవూఫ్ 0; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19 ఓవర్లలో ఆలౌట్) 119. వికెట్ల పతనం**: 1–12, 2–19, 3–58, 4–89, 5–95, 6–96, 7–96, 8–112, 9–112, 10–119. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 4–0–29–1, నసీమ్ షా 4–0–21–3, ఆమిర్ 4–0–23–2, ఇఫ్తికార్ 1–0–7–0, ఇమాద్ 3–0–17–0, రవూఫ్ 3–0–21–3.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (బి) బుమ్రా 31; బాబర్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 13; ఉస్మాన్ (ఎల్బీ) (బి) అక్షర్ 13; ఫఖర్ (సి) పంత్ (బి) పాండ్యా 13; ఇమాద్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 15; షాదాబ్ (సి) పంత్ (బి) పాండ్యా 4; ఇఫ్తికార్ (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 5; అఫ్రిది (నాటౌట్) 0; నసీమ్ షా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 113. వికెట్ల పతనం:** 1–26, 2–57, 3–73, 4–80, 5–88, 6–102, 7–102. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–31–1, సిరాజ్ 4–0–19–0, బుమ్రా 4–0–14–3, పాండ్యా 4–0–24–2 జడేజా 2–0–10–0, అక్షర్ పటేల్ 2–0–11–1.

విండీస్‌కు భారీ విజయం

అకీల్ హోసేన్ స్పిన్‌కు ఉగాండా 39 ఆలౌట్ • 134 పరుగుల తేడాతో జయభేరి



అకీల్ హోసేన్

గయానా: టి20 ప్రపంచకప్‌లో క్రికెట్ కూన ఉగాండాపై మాజీ చాంపియన్, ఆతిథ్య వెస్టిండీస్ భారీ విజయాన్ని నమోదు చేసింది. ఎడంచేతి వాటం స్పిన్నర్ అకీల్ హోసేన్ (4–0–11–5) స్పెల్‌కు ఉగాండా బ్యాటర్లు కకావికలమయ్యారు. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేపట్టిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఓపెనర్లలో బ్రాండన్ కింగ్ (13) విఫలమైనా... జాన్సన్ చార్లెస్ (42 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కుదురుగా ఆడాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పూరన్ (17 బంతుల్లో 22; 3 సిక్స్‌లు), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్), రూథర్‌ఫర్డ్ (16 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇరవై పైచిలుకు స్కోరే చేశారు. ఆఖర్లో రసెల్ (17 బంతుల్లో 30 నాటౌట్; 6 ఫోర్లు) బౌండరీలతో కరీబియన్ జట్టు చెప్పుకోదగ్గ స్కోరు చేయగలిగింది. బ్రియాన్ మసబా 2 వికెట్లు తీయగా, రమ్‌జని, క్యెవుటా, దినేశ్ నక్రాని తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఉగాండా 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. ఎనిమిదో వరుస బ్యాటర్ వరకు ఎవరు కూడా కనీసం 6 పరుగులకు మించి చేయలేకపోయారు. తొమ్మిదో వరుస బ్యాటర్ జుమా మియాగి (13) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే అకీల్ హోసేన్ స్పిన్ ఉచ్చు బిగించాడు. తన మాయాజాలాన్ని స్పెల్ ఆసాంతం కొనసాగించడంతో ఉగాండా అత్యల్ప స్కోరుకే ఆలౌటైంది. అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. అకీల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఉగాండా చేసిన ఈ అత్యల్ప స్కోరు (39)తో నెదర్లాండ్స్ జట్టు సరసన నిలిచింది. టి20 ప్రపంచకప్‌ల చరిత్రలో ఇది ఉమ్మడి అత్యల్ప స్కోరు! 2014లో శ్రీలంక కూడా నెదర్లాండ్స్‌ను 39 పరుగులకే కూల్చేసింది.

ఆసీస్ ఆల్‌రౌండ్ గెలుపు

రాణించిన డేవిడ్ వార్నర్, జంపా

బ్రిడ్జ్‌టౌన్: ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఏ ఒక్కరు కూడా 40 పరుగులు చేయలేదు. బౌలర్లలో 2 వికెట్లకు మించి తీయలేదు! అయినా సరే డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఓడించింది. గ్రూప్ 'బి'లో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పోరులో ఆసీస్ 36 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. వార్నర్ (16 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెడ్ (18 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్టొయినిస్ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. జోర్డాన్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 165 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ బట్లర్ (28 బంతుల్లో 42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), సాల్ట్ (23 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఓపెనింగ్ వికెట్‌కు 7.1 ఓవర్లలో 73 పరుగులు జోడించి మెరుపు ఆరంభమిచ్చినా... తర్వాత వచ్చిన జాక్స్ (10), బెయిర్‌స్టో (7), లివింగ్‌స్టోన్ (15)ల వైఫల్యం జట్టును ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా, కమిన్స్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ తాజా ఫలితం ఇంగ్లండ్‌కు 'సూపర్–8'ను క్లిష్టం చేసింది. స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దవడం, ఈ మ్యాచ్‌లో ఓడటంతో గ్రూప్‌లో ఇంగ్లండ్ ఒక పాయింట్‌తో నాలుగో స్థానంలో ఉంది. ఆసీస్ (4), స్కాట్లాండ్ (3) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఇంగ్లండ్ ఒకవేళ నమీబియా, ఒమన్‌లపై గెలిచినా ముందుకెళ్లాలంటే ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది.



వార్నర్

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X బంగ్లాదేశ్
వేదిక: న్యూయార్క్ : రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



'ఫ్రెంచ్ కింగ్' అల్‌కరాజ్

ఫైనల్ చేరిన తొలిసారే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ స్టార్

- ఐదు సెట్‌ల తుది సమరంలో జ్వెరెవ్‌పై అద్భుత విజయం
- కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కైవసం
- రూ. 21 కోట్ల 71 లక్షల ప్రైజ్‌మనీ సొంతం


మట్టి కోర్టులపై కొత్త యువరాజు వచ్చాడు. ఇప్పటికే పచ్చిక కోర్టులపై, హార్డ్ కోర్టులపై గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ మట్టి కోర్టులపై కూడా తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తొలిసారే అల్‌కరాజ్ చాంపియన్‌గా అవతరించాడు. ఈ క్రమంలో పలు రికార్డులు నెలకొల్పాడు. మరోవైపు కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలని ఆశించిన జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు రెండోసారీ నిరాశే ఎదురైంది. 2020 యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఐదు సెట్‌లలో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయిన జ్వెరెవ్ ఈసారి ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఐదు సెట్‌ల సమరంలో పరాజయం చవిచూశాడు.

ఫైనల్ గణాంకాలు

అల్‌కరాజ్		జ్వెరెవ్
3	ఏస్‌లు	8
6	డబుల్ ఫాల్ట్‌లు	6
9	బ్రేక్ పాయింట్లు	6
52	విన్నర్స్	38
56	అనవసర తప్పిదాలు	41
25	నెట్ పాయింట్లు	30
20	డ్రాప్ షాట్‌లు	10
153	మొత్తం పాయింట్లు	139

పారిస్: అంచనాలకు అనుగుణంగా ఆద్యంతం పట్టుదల కోల్పోకుండా ఆడిన స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఆదివారం ముగిసిన టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 21 ఏళ్ల అల్‌కరాజ్ చాంపియన్‌గా అవతరించాడు. 4 గంటల 19 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–3, 2–6, 5–7, 6–1, 6–2తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై విజయం సాధించాడు. విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌కు 24 లక్షల యూరోలు (రూ. 21 కోట్ల 71 లక్షలు), రన్నరప్ జ్వెరెవ్‌కు 12 లక్షల యూరోలు (రూ. 10 కోట్ల 84 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన ఇద్దరు స్టార్ ఆటగాళ్ల మధ్య జరిగిన సమరం హోరాహోరీగా సాగింది. తొలి సెట్‌లో అల్‌కరాజ్ పైచేయి సాధించగా... రెండో సెట్‌లో జ్వెరెవ్ పుంజుకున్నాడు. మూడో సెట్‌లో ఒకదశలో జ్వెరెవ్ 2–5తో వెనుకబడ్డాడు. అయితే జ్వెరెవ్ సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా ఐదు గేమ్‌లు గెలిచి సెట్‌ను 7–5తో సొంతం చేసుకొని టైటిల్ దిశగా అడుగు వేశాడు. కానీ నాలుగో సెట్‌లో అల్‌కరాజ్ మళ్లీ చెలరేగాడు. జ్వెరెవ్‌కు కేవలం ఒక గేమ్ కోల్పోయి సెట్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక ఐదో సెట్‌లోనూ అల్‌కరాజ్ తన జోరు కొనసాగించాడు. రెండుసార్లు జ్వెరెవ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను నిలబెట్టుకొని ఈ స్పెయిన్ స్టార్ విజయకేతనం ఎగురవేశాడు.



విన్నర్స్ ట్రోఫీతో అల్‌కరాజ్

- ఓపెన్ శకంలో (1968 తర్వాత) మూడు ఉపరితలాలపై గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన పిన్న వయస్కుడిగా అల్‌కరాజ్ (21 ఏళ్లు) గుర్తింపు పొందాడు. గతంలో ఈ రికార్డు రాఫెల్ నాదల్ (23 ఏళ్లు) పేరిట ఉంది.హార్డ్ కోర్టులపై 2022 యూఎస్ ఓపెన్ నెగ్గిన అల్‌కరాజ్, 2023లో పచ్చిక కోర్టులపై వింబుల్డన్ టైటిల్ నెగ్గాడు.
- టెన్నిస్‌లోని మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీల (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) టైటిల్స్ సాధించిన ఏడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ ఘనత వహించాడు. రాఫెల్ నాదల్ (స్పెయిన్), మాట్స్ విలాండర్ (స్వీడన్), జిమ్మీ కానర్స్ (అమెరికా), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), జొకోవిచ్ (సెర్బియా), ఆంద్రీ అగస్సీ (అమెరికా) గతంలో ఈ ఘనత సాధించారు.
- కెరీర్‌లో ఫైనల్ చేరిన మొదటి మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన ఏడో ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు. గతంలో గుస్తావో కుయెర్టన్ (బ్రెజిల్), స్టీఫెన్ ఎడ్బర్గ్ (స్వీడన్), జాన్ బోర్గ్ (స్వీడన్), ఫెడరర్, జిమ్మీ కానర్స్, వావ్రింకా (స్విట్జర్లాండ్) ఈ ఘనత సాధించారు.
- నాదల్, సాంటానా, గిమెనో, సెర్గీ బ్రుగుయెరా, కార్లోస్ మోయా, అల్బెర్ట్ కోస్టా, కార్లోస్ ఫెరీరో తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన ఎనిమిదో స్పెయిన్ ప్లేయర్‌గా అల్‌కరాజ్ నిలిచాడు.



రన్నరప్ ట్రోఫీతో జ్వెరెవ్

రసెల్‌కు 'పోల్ పొజిషన్'

మాంట్రియల్: మెర్సిడెస్ జట్టు డ్రైవర్ జార్జి రసెల్ తన కెరీర్‌లో రెండోసారి 'పోల్ పొజిషన్' సాధించాడు. ఫార్ములావన్ సీజన్‌లో భాగంగా తొమ్మిదో రేసు కెనడా గ్రాండ్‌ప్రిని రసెల్ తొలి స్థానం నుంచి ప్రారంభిస్తాడు. క్వాలిఫయింగ్ సెషన్‌లో రసెల్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక నిమిషం 12 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేశారు. అయితే వెర్‌స్టాపెన్‌కంటే ముందుగా రసెల్ ఈ సమయాన్ని నమోదు చేయడంతో అతనికి పోల్ పొజిషన్ కేటాయించారు. మూడు క్వాలిఫయింగ్ సెషన్‌లు కలిపి రసెల్ 26 ల్యాప్‌లు... వెర్‌స్టాపెన్ 27 ల్యాప్‌లు పూర్తి చేశారు. 2022లో హంగేరి గ్రాండ్‌ప్రిలో తొలిసారి రసెల్ 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించాడు. ఆ తర్వాత రసెల్‌కు మళ్లీ పోల్ పొజిషన్ దక్కలేదు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) మూడో స్థానం నుంచి... ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) నాలుగో స్థానం నుంచి... డానియల్ రికార్డో (హోండా) ఐదో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఎనిమిది రేసులు జరగ్గా... తొలి ఏడు రేసుల్లో వెర్‌స్టాపెన్, ఎనిమిదో రేసులో చార్లెస్ లెక్‌లెర్క్ పోల్ పొజిషన్‌లు సాధించారు.



పూజా తోమర్ ఘనత

యూఎఫ్‌సీలో విజయం సాధించిన తొలి భారతీయ ఫైటర్‌గా రికార్డు



పూజ

కెంటకీ: భారత్‌కు చెందిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణి పూజా తోమర్ చరిత్ర లిఖించింది. అల్టిమేట్ ఫైటింగ్ చాంపియన్‌షిప్ (యూఎఫ్‌సీ)లో విజయం అందుకున్న తొలి భారతీయ ఫైటర్‌గా రికార్డు నెలకొల్పింది. లూయిస్‌విలెలో జరిగిన ఈ పోటీల్లో పూజ 52 కేజీల స్ట్రా–వెయిట్ కేటగిరీలో 30–27, 27–30, 29–28తో బ్రెజిల్‌కు చెందిన రేయాన్నెపై గెలిచింది. గట్టి పోటీ ఉండే యూఎఫ్‌సీలో ఇప్పటివరకు మన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులెవరూ కనీసం ఒకసారి కూడా నెగ్గలేకపోయారు. కానీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 30 ఏళ్ల పూజ గతేడాది యూఎఫ్‌సీతో కాంట్రాక్టు కుదుర్చుకోవడంతోనే అతిపెద్ద మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈవెంట్‌లో పోటీ పడే అవకాశం పొందిన తొలి భారత మహిళగా ఘనత వహించింది. గతంలో పురుషుల విభాగంలో భారత్‌కు చెందిన అన్షుల్ జూబ్లీ, భరత్ ప్రపంచ స్థాయి యూఎఫ్‌సీలో పోటీ పడ్డారు.

ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి రాజీనామా

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. 2019లో వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2021 ఆగస్ట్ 4న ఆయన ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. దాదాపు రెండేళ్ల 11 నెలలు సేవలు అందించారు. ఆయన హయాంలో రాష్ట్రంలో కొత్త బస్సులు కొనుగోలుతోపాటు ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు. ప్రభుత్వం మారడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద సంబరాలు

సాక్షి, అమరావతి: ప్రధానిగా నరేంద్ర మోదీ మూడో విడత ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చారు.

■ తెలంగాణ

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఈటల రాజేందర్?

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియామకం కానున్నట్టు ఆ పార్టీలోని విశ్వసనీయ వర్గాల సమాచారం. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి అమిత్ షాతో ఈటల సమావేశం కానున్నారు. అనంతరం ఈటలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న జి.కిషన్‌రెడ్డికి మళ్లీ కేంద్ర కేబినెట్ మంత్రిగా అవకాశం దక్కిన సంగతి తెలిసిందే.

పిన్న వయసులో పెద్ద పదవి

రామ్మోహన్‌కు కేబినెట్ హోదా ● పెమ్మసానికి జాక్‌పాట్

సాక్షి, అమరావతి : కేంద్ర మంత్రివర్గంలో టీడీపీకి రెండు స్థానాలు దక్కడంతో ఆ పార్టీలో హర్షం వ్యక్తమవుతోంది. ఉత్తరాంధ్రకు చెందిన ముఖ్య నేత కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేబినెట్ హోదాతో మంత్రి పదవి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కి సహాయ మంత్రి పదవి దక్కిన విషయం తెలిసిందే. అందరూ ఊహించినట్లుగానే శ్రీకాకుళం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన రామ్మోహన్‌నాయుడికి చంద్రబాబు ప్రాధాన్యతనిచ్చి మంత్రి పదవికి సిఫారసు చేశారు. ప్రస్తుత మోదీ మంత్రివర్గంలో అత్యంత పిన్న వయస్కుడు రామ్మోహనే. ఆయన వయసు 37 ఏళ్లు. చిన్న వయసులోనే ఆయన కేంద్రంలో కీలక బాధ్యతలు స్వీకరిస్తుండడం విశేషం. దివంగత కేంద్ర మాజీమంత్రి, సీనియర్ టీడీపీ నేత కింజరాపు ఎర్రంనాయుడి వారసుడిగా రాజకీయ రంగప్రవేశం చేసిన రామ్మోహన్ తక్కువ సమయంలోనే అందరి మన్ననలు పొందారు. ఐస్‌ల్యాండ్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎంబీఏ చేసిన తర్వాత సింగపూర్‌లో ఉద్యోగం చేశారు. 2012లో రామ్మోహన్ తండ్రి ఎర్రంనాయుడు రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతిచెందడంతో అనూహ్యంగా ఆయన రాజకీయాల్లో ప్రవేశించారు. తండ్రి వారసుడిగా 2014 ఎన్నికల్లో ఆయన తొలిసారి శ్రీకాకుళం ఎంపీగా గెలిచారు. 2019 ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆయన ఎంపీగా గెలుపొందారు. చంద్రబాబుతోపాటు ఆయన కుమారుడు లోకేశ్‌కి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ టీడీపీలోనే కీలకంగా మారారు. మూడుసార్లు ఎంపీగా ఉండడంతో ఢిల్లీ రాజకీయాల్లో అందరి గుర్తింపు పొందారు. పార్లమెంటులో మంచి వక్తగా పేరొందారు. పలు పార్లమెంటు స్టాండింగ్ కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు. ఉత్తమ ఎంపీగా 2020లో రామ్మోహన్ 'సంసద్ రత్న' అవార్డు అందుకున్నారు. 1996లో రామ్మోహన్ తండ్రి ఎర్రంనాయుడు యువ ఎంపీగా పార్లమెంటులో అడుగుపెట్టగా ఇప్పుడాయన తనయుడు యువ కేబినెట్ మంత్రిగా కేంద్రంలో అందరి గుర్తింపు పొందారు.


రామ్మోహన్‌నాయుడు


పెమ్మసాని చంద్రశేఖర్

'పెమ్మసాని'కి జాక్‌పాట్..

అలాగే, ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి గుంటూరు ఎంపీగా పోటీచేసి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రమంత్రి పదవితో జాక్‌పాట్ కొట్టారు. ఎన్‌ఆర్‌ఐగా ఉండి ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చి తొలిసారి ఎంపీగా విజయం సాధించారు. గెలిచిన వెంటనే ఆయన్ను మంత్రి పదవి వరించింది. ఈ ఎన్నికల్లో పోటీచేసిన ఎంపీ అభ్యర్థుల్లోనే ధనికుడిగా చంద్రశేఖర్ వార్తల్లోకెక్కారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలేనికి చెందిన చంద్రశేఖర్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివిన తర్వాత అమెరికా వెళ్లి పీజీ చేశారు. ఆ తర్వాత జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలో ఐదేళ్లు మెడికల్ ప్రొఫెసర్‌గా, ఫిజీషియన్‌గా పనిచేశారు. ఆ తర్వాత 'యువరల్డ్' పేరుతో మెడికల్ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ శిక్షణ సంస్థను స్థాపించి విజయవంతమయ్యారు. దానిద్వారా అమెరికాలో మంచి గుర్తింపు పొందారు. రాజకీయాలపై ఆసక్తితో ఇటీవలే ఆయన స్వదేశానికి తిరిగొచ్చి టీడీపీలో చేరి గుంటూరు ఎంపీగా పోటీచేసి గెలిచారు. వెంటనే కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

రెండింటితో సరి..

వాస్తవానికి.. కేంద్ర మంత్రివర్గంలో నాలుగు పదవులు వస్తాయని టీడీపీ ఆశించింది. చంద్రబాబు స్పీకర్ పదవితోపాటు నాలుగైదు మంత్రి పదవులు అడిగినట్లు ప్రచారం జరిగింది. కానీ, ప్రస్తుతానికి రెండు మంత్రి పదవులిచ్చి అందులో ఒకటి కేబినెట్ హోదా పదవి ఇచ్చి సరిపెట్టారు. కొద్దిరోజులు తర్వాత మంత్రివర్గ విస్తరణలో మరో రెండు సహాయ మంత్రి పదవులు టీడీపీకి దక్కుతాయనే ప్రచారం జరుగుతోంది.

పురందేశ్వరికి లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్?

- పరిశీలిస్తున్న బీజేపీ జాతీయ నాయకత్వం
- అనుభవం ఉన్నా కేబినెట్‌లో చోటు దక్కని వైనం
- మోదీ కేబినెట్‌లో జనసేనకు మొండి చెయ్యి



సాక్షి, న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై బీజేపీ దృష్టి సారించింది. ఈసారి మహిళలకు స్పీకర్ పదవి ఇవ్వనున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు తెరపైకి వచ్చింది. మోదీ ప్రభుత్వం నారీ శక్తికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో పురందేశ్వరి పేరును లోక్‌సభ స్పీకర్ పదవి కోసం బీజేపీ జాతీయ నాయకత్వం పరిశీలిస్తోందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా పురందేశ్వరిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారన్న ప్రచారం జరిగినప్పటికీ, నర్సాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మ వైపే బీజేపీ అధిష్టానం మొగ్గు చూపింది. అంతేకాకుండా పురందేశ్వరి సామాజిక వర్గానికి చెందిన గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేబినెట్‌లో చోటు దక్కడం చర్చనీయాంశమైంది. అయితే గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన అనుభవంతో పాటు హిందీ, ఇంగ్లిష్‌లో మంచి ప్రావీణ్యం ఉండడం లోక్‌సభ స్పీకర్ పదవికి పురందేశ్వరి పేరుకు బలం చేకూరుస్తోంది. దీంతోపాటు సంస్థాగతంగా జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఒడిషా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ బలోపేతానికి పురందేశ్వరి చేసిన సేవలను బీజేపీ జాతీయ నాయకత్వం పరిశీలించే అవకాశం ఉంది. ఒకవేళ లోక్‌సభ స్పీకర్ పదవి దక్కని పక్షంలో డిప్యూటీ స్పీకర్ పదవి కచ్చితంగా దక్కుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా మోదీ తొలి టర్మ్‌లో 2014 నుంచి 2019 మధ్య సుమిత్రా మహాజన్ మహిళా స్పీకర్‌గా ఉన్నారు. ఆ తర్వాత 2019 నుంచి 2024 మధ్య రాజస్థాన్ కోటా నియోజకవర్గ ఎంపీ ఓం బిర్లా స్పీకర్‌గా పని చేశారు.

నిజమైన కార్యకర్తకు కేంద్ర మంత్రి పదవి : పురందేశ్వరి

కేంద్ర కేబినెట్ కూర్పు ఎంతో బాగుందని, ఏపీకి సరైన ప్రాతినిధ్యం లభించిందని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. శ్రీనివాస వర్మ వంటి నిజమైన కార్యకర్తకు కేంద్ర మంత్రి పదవి లభించడం.. ఆయన్ను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవడంతో ప్రతి బీజేపీ కార్యకర్తకు ఎంతో ఉత్తేజం కలిగించే అంశమని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏపీ నుంచి కేంద్ర మంత్రులుగా అవకాశం దక్కించుకున్న వాళ్లు కచ్చితంగా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతారని, ఏపీకి నిధులు సాధించడానికి వీరంతా తమ వంతు కృషి కచ్చితంగా చేస్తారని పురందేశ్వరి తెలిపారు.

జనసేనకు షాక్!

మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో జనసేనకు చోటు దక్కలేదు. ఏపీలో టీడీపీ, బీజేపీలతో కలిసి కూటమిగా పోటీ చేసి రెండు పార్లమెంట్ స్థానాల్లో జనసేన గెలిచింది. ఇటీవల ప్రధాన మంత్రి సైతం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఎన్డీఏ సమావేశంలో ప్రత్యేకంగా అభినందించారు. దీంతో జనసేన ఎంపీని కచ్చితంగా కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారని ప్రచారం జరిగింది. జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి సైతం పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆదివారం తీసుకున్న కేంద్ర కేబినెట్‌లోకి జనసేనను తీసుకోకుండా బీజేపీ షాక్ ఇచ్చింది. కాగా ఏపీ నుంచి ఇద్దరు టీడీపీ ఎంపీలు, ఒక బీజేపీ ఎంపీని మోదీ కేంద్ర కేబినెట్‌లోకి తీసుకున్నారు.

అనూహ్యంగా అందలం...

ఇది కార్యకర్తలకు దక్కిన గౌరవం : వర్మ

సాక్షి, అమరావతి/సాక్షి, భీమవరం :మూడున్నర దశాబ్దాలకు పైగా పార్టీనే నమ్ముకున్న నిజమైన కార్యకర్తను బీజేపీ అధిష్టానం అందలం ఎక్కించింది. తొలిసారి ఎంపీగా నరసాపురం నుంచి ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రి పదవి వరించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఆ పార్టీ తరఫున బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన పురంధేశ్వరి.. గతంలో రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన సీఎం రమేష్‌లను కాదని బీజేపీ అధిష్టానం శ్రీనివాసవర్మను ఎంపిక చేయడం గమనార్హం. ఎంఏ, ఎంఎల్ఐఎస్‌సీ, బీఎల్ చదివిన ఆయన 1991లో జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా బీజేపీలో తన ప్రస్థానం ప్రారంభించి, వివిధ హోదాల్లో పార్టీ కోసం పనిచేశారు. 2009లో నరసాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీచేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను జిల్లాలోనూ, పార్టీలోనూ బీజేపీ వర్మగానే పిలుస్తారు. నిజానికి.. పార్టీ అధిష్టానం కేంద్ర మంత్రివర్గంలో తన పేరును ప్రకటిస్తారని ఆయన ఏమాత్రం ఊహించలేదు. ఎంపీగా ఎన్నికైన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా రాష్ట్ర పార్టీ పెద్దలను కలిసేందుకు విజయవాడ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన వర్మను కేంద్ర మంత్రివర్గంలో స్థానంపై విలేకరులు ప్రశ్నించగా ఆయన కొట్టిపారేశారు. 'నాకు వచ్చిన ఎంపీ పదవిని మంత్రి పదవి కంటే పెద్ద బాధ్యతగా భావించి పనిచేస్తాను' అంటూ బదులిచ్చారు. కానీ, అదృష్టం వెతుక్కుంటూ ఏకంగా కేంద్ర మంత్రి పదవే ఆయన చెంతకు వచ్చింది. ఇదిలా ఉంటే.. శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రి పదవి రావడంపట్ల ఆదివారం భీమవరంలోని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.



కష్టపడే కార్యకర్తలకు బీజేపీలో అవకాశాలు..

బీజేపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తకు కూడా అవకాశాలు ఉంటాయని చెప్పేందుకు తానే ఓ ఉదాహరణ అని భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. తనకు కేంద్రమంత్రి పదవి రావడంపై ఆయన స్పందిస్తూ.. 'కేంద్రమంత్రిగా అవకాశం రావడం సంతోషకరం. ఇది ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బీజేపీ కార్యకర్తలకు దక్కిన గౌరవం. నన్ను ప్రోత్సహించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతా'.. అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

పెరిగిన గృహావసరాల వినియోగ వ్యయం

సాక్షి, అమరావతి: దేశంలో గృహావసరాల వినియోగ వ్యయంలో వివిధ సామాజికవర్గాల మధ్య అంతరాలు క్రమేణా తగ్గుతున్నాయి. దశాబ్దకాలంలో దేశంలో సగటు గృహావసరాల వినియోగ వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ మేరకు జాతీయ గృహావసరాల వినియోగ వ్యయ(హెచ్‌సీఈఎస్) నివేదిక వెల్లడించింది. 2011–12 నుంచి 2022–23 మధ్యకాలంలో దేశ పౌరులు సగటున గృహావసరాల కోసం వెచ్చిస్తున్న వ్యయాన్ని అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వినియోగ వ్యయం 9.20శాతం పెరిగింది. కాగా, ఇతర వర్గాల్లో 8.5శాతం పెరిగిందని ఈ నివేదిక వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో గృహావసరాల వినియోగ వ్యయం అధికంగా పెరిగిందని తెలిపింది.

హెచ్‌సీఈఎస్ నివేదికలోని ప్రధాన అంశాలు

- 2011–12 దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సగటు కుటుంబ నెల వ్యయం (ఎంపీసీఈ) రూ.1,430 ఉండగా, 2022–23లో రూ.3,773కు పెరిగింది.
- పట్టణ ప్రాంతాల్లో సగటు కుటుంబ నెల వ్యయం 2011–12లో రూ.2,630 ఉండగా, 2022–23లో రూ.6,459కు పెరిగింది.
- గృహావసరాల వినియోగ వ్యయంలో గ్రామీణ ప్రాంతాల్లో 46శాతం ఆహార పదార్థాలకు, 54శాతం ఇతర అవసరాలకు వెచ్చిస్తున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 39శాతం ఆహార పదార్థాలకు, 61శాతం ఇతర అవసరాలకు ఖర్చు చేస్తున్నారు.
- సగటు గృహావసరాల వినియోగ వ్యయంలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా, ఛత్తీస్‌గఢ్ చివరి స్థానంలో ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీసీఈ గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,870 ఉండగా, పట్టణ ప్రాంతాల్లో రూ.6,782లుగా ఉంది.

సామాజికవర్గాల పరంగా ఎంపీసీఈ పెరుగుదల ఇలా...

గ్రామీణ ప్రాంతాల్లో ...

కేటగిరీ	2011–12	2022–23
ఎస్టీలు	రూ.1,122	రూ.3,016
ఎస్సీలు	రూ.1,252	రూ.3,474
బీసీలు	రూ.1,439	రూ.3,838
ఇతర వర్గాలు	రూ.1,719	రూ.4,392

పట్టణ ప్రాంతాల్లో ...

కేటగిరీ	2011–12	2022–23
ఎస్టీలు	రూ.2,193	రూ.5,414
ఎస్సీలు	రూ.2,028	రూ.5,307
బీసీలు	రూ.2,275	రూ.6,177
ఇతర వర్గాలు	రూ.3,242	రూ.7,333

తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు

- ఏపీ నుంచి శ్రీనివాసవర్మ, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్
- తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు చోటు
- వీరిలో కేబినెట్ మంత్రులుగా కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు.. సహాయ మంత్రులుగా మిగతా ముగ్గురు
- మంత్రులకు మోదీ, షాలతో పాటు చంద్రబాబు, పవన్, సహచర ఎంపీల అభినందనలు

సాక్షి, న్యూఢిల్లీ : కేంద్రంలో వరుసగా మూడోసారి కొలువుదీరిన నరేంద్ర మోదీ మంత్రివర్గంలో తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లో నరసాపురం నుంచి బీజేపీ తరఫున తొలిసారి గెలిచిన భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ నుంచి శ్రీకాకుళం ఎంపీగా మూడోసారి గెలిచిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, గుంటూరు నుంచి తొలిసారి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్‌లు ఆదివారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఉన్నారు. ఇందులో కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయగా, మిగతా ముగ్గురు సహాయ మంత్రులుగా ప్రమాణం చేశారు.

ఉదయం ఫోన్‌లు.. మధ్యాహ్నం తేనీటి విందు..

ఆదివారం ఉ.10 గంటల నుంచే మంత్రులుగా ఎంపికైన తెలుగు ఎంపీలు సహా ఇతరులకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్‌లు వెళ్లాయి. మధ్యాహ్నం నుంచే అందుబాటులో ఉండాలని వారికి పీఎం కార్యాలయం సమాచారమిచ్చింది. ఫోన్లు వచ్చిన కొద్దిసేపటికే వారందరికీ లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో భేటీ ఉంటుందని తెలపడంతో పెమ్మసాని, రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు అక్కడికి చేరుకున్నారు. వారిని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలు అభినందించారు. మధ్యాహ్నం పన్నెండున్నర గంటల సమయంలో ప్రధాని తేనీటి విందిచ్చారు. అనంతరం వారికి మార్గనిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని ప్రధాని సూచించారు. గత ప్రభుత్వంలో మిగిలిపోయిన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

ఇంగ్లీష్‌లో ముగ్గురు..హిందీలో ఇద్దరు..

ఇక రామ్మోహన్‌నాయుడు ఇంగ్లీష్‌లో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. మంత్రిగా సంతకం చేసిన అనంతరం ఆకాశం వైపు చూస్తూ తన తండ్రిని స్మరించుకున్నారు. కిషన్‌రెడ్డి హిందీలో ఈశ్వరుని సాక్షిగా ప్రమాణం చేశారు. మిగతా వారిలో పెమ్మసాని ఇంగ్లీష్‌లో, శ్రీనివాసవర్మ హిందీలో ప్రమాణం చేశారు. బండి సంజయ్ కూడా హిందీలో ప్రమాణం చేశారు. మరోవైపు.. ప్రమాణస్వీకారం చేసిన తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులకు మోదీతో పాటు సీనియర్ నేతలు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులతో పాటు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, ఇతర నేతలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎంపీలు పురందేశ్వరి, సీఎం రమేష్‌లతో పాటు టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, కేశినేని చిన్ని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు.. జనసేన ఎంపీలు బాలశౌరి, ఉదయ్, సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు హాజరయ్యారు.

అందరూ ఒకలా.. వీరు మరొకలా..

ప్రమాణ స్వీకారం సమయంలో టీడీపీ, రాష్ట్ర బీజేపీ ఎంపీలు వ్యవహరించిన తీరు అందరికీ కొత్తగా అనిపించింది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పుస్తకంలో సంతకం చేసిన తర్వాత రాష్ట్రపతికి అభివందనం చేసి అక్కడి నుంచి వెళ్లడం ఆనవాయితీ. కానీ, టీడీపీ, బీజేపీ నుంచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బి. శ్రీనివాస వర్మలు మాత్రం ప్రమాణ స్వీకారం తర్వాత రాష్ట్రపతి ముర్ముకు నమస్కారం చేసి ఆ తర్వాత పుస్తకంలో సంతకం చేశారు. ఇదిలా ఉంటే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కన్నా ముందుగానే పెమ్మసాని ప్రమాణ స్వీకారం మొదలుపెట్టారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

ప్రమాణ స్వీకారం అనంతరం ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు మీడియాతో మాట్లాడారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ''దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానంలో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో నిధులు కొరత ఉందని, విభజన అంశాలు, పోలవరం, రైల్వేజోన్ వంటి పెండింగ్ అంశాలను కేంద్ర సహకారంతో పరిష్కరించుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం. ఐదేళ్లుగా కుంటుపడిన ఉత్తరాంధ్రను వడ్డీతో సహా అభివృద్ధి చేస్తాం'' అని పేర్కొన్నారు. కేంద్రంలో మంత్రి పదవి ద్వారా రాష్ట్రానికి మేలు జరిగేలా పనిచేస్తానని, కేంద్ర సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేస్తానని, కేంద్ర నుంచి మనకు రావలసిన న్యాయమైన వాటాలు సాధిస్తానని, విభజన అంశాలు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని పెమ్మసాని చెప్పారు. ప్రధాని మోదీ సహకారంతో పోలవరం పూర్తయ్యేలా చూస్తానని శ్రీనివాసవర్మ అన్నారు. ప్రత్యేక హోదా ద్వారా వచ్చే ప్రయోజనాలు ప్రత్యేక ప్యాకేజీ రూపంలో కేంద్రం ఇచ్చిందని, అయితే.. ఇంకా కేంద్ర నుంచి రావాల్సినవి ఏమైనా ఉంటే అవి కూడా సాధిస్తానని చెప్పారు.



అనుమానాస్పదస్థితిలో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

నూజివీడు మండలం తూర్పు దిగవల్లిలో ఘటన


వేణుగోపాలరెడ్డి

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పు దిగవల్లి సర్పంచ్ జగ్గవరపు విజయ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగ్గవరపు వేణుగోపాలరెడ్డి (54) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. గ్రామాన్ని ఆనుకుని ముక్కొల్లుపాడు రోడ్డులోని తన మామడితోటలోని షెడ్డులో ఆదివారం వేణుగోపాలరెడ్డి మృతిచెంది ఉన్నాడు. ఆయన భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. 'నేను, నా భర్త, కుమారుడు నాలుగు రోజుల నుంచి గ్రామంలో లేము. నాలుగు రోజుల నుంచి నా భర్త ఆందోళనగా ఉంటున్నారు. శనివారం రాత్రి ఆయన దిగవల్లి వెళ్తున్నానని చెప్పారు. ఆదివారం విజయవాడలో ఉన్న మా బంధువులు నా భర్త చనిపోయినట్లు తెలియజేయడంతో వెంటనే బయలుదేరి గ్రామానికి వచ్చాను. నా భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయి.' అని విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. వేణుగోపాలరెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. వేణుగోపాలరెడ్డి, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు అమెరికాలో ఎంఎస్ చేస్తున్నాడు.

పందేలే కారణమా..?

ఎన్నికల్లో పందేలు కాయడమే వేణుగోపాలరెడ్డి మృతికి కారణమనే ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన పోలింగ్ అనంతరం పందేలు ముమ్మరంగా జరిగాయి. ఆయన మధ్యవర్తిగా ఉండటంతో పందేలు పెట్టినవారు వేణుగోపాలరెడ్డి వద్ద రూ.20కోట్లకు పైగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ నగదును వేణుగోపాలరెడ్డి తిరిగి పందేల్లో పెట్టడం, వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో ఆ డబ్బు మొత్తం పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆయన, భార్య, కుమారుడిని తీసుకుని ఈ నెల ఐదో తేదీ ఉదయమే ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఎక్కడికి వెళ్లారో కూడా గ్రామంలో ఎవరికీ తెలియదు. దీంతో పందేలకు సంబంధించి నగదును ఇచ్చిన వారు మూడు రోజుల క్రితం తూర్పు దిగవల్లిలోని వేణుగోపాలరెడ్డి ఇంటికి వచ్చి తాళాలు పగులగొట్టి ఇంట్లోని సామగ్రి, టీవీ, మంచాలు, ఫ్యాన్లు, ఇతర వస్తువులను ట్రాక్టర్ లో వేసుకుని ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో వేణుగోపాలరెడ్డి తన మామడితోటలోని షెడ్‌లో ఆదివారం మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



SCALING NEW HEIGHTS in JEE ADVANCED 2024

50 YEARS OF BRILLIANCE


All India Rank	Name	R.No.
8	G.NAVEEN	246161014 (R)
36	P.RAKESH KUMAR	246025153 (R)
39	K.VINOD	246146088 (R)
123	J.SNEHITH SANDESH	246192185 (R)
125	V.RAMBABU	246174019 (R)
127	V.VEDAVACHAN REDDY	246029007 (R)
133	J.SHRETHAN REDDY	246195007 (R)
135	S.ARUN SINGH	246150386 (R)
157	B.DINESH	246177009 (R)
185	M.VENKATESHWARLU	246194092 (R)
299	D.KARTHIK	246018009 (R)
323	T.AKHIL NAIK	246175113 (R)
324	K.SREERAM REDDY	246195226 (R)
397	B.ESHWARI	246197150 (R)
450	N.NITHIN	246195114 (R)
598	D.PRAGNA TEJA	246197108 (R)
621	W.VERONIKA HASINI	246192298 (R)
654	P.NIHAL SRIVATSAV	246196001 (R)
689	T.TEJASWI	246200036 (R)
708	B.RAJESH	246146013 (R)
737	D.NIHARIKA	246160036 (R)
737	B.ANAND SAI	246163068 (R)
751	V.KRANTHI KIRAN	246138023 (R)
901	V.HARILAL	246118153 (R)
966	R.DEEPANSH REDDY	246197175
1003	A.BHAGAWANDAS	246157224 (R)
1043	P.NITHIN NAIK	246199082 (R)
1097	B.ABHILASH RAJU	246171283 (R)
1100	R.AADHI	246157623 (R)
1170	D.VARSHITH	246019048 (R)
1186	M.MALLU NAIK	246029567 (R)
1201	M.SAI SIDDHARDHA	246011037 (R)
1214	A.SAI CHARAN	246150195 (R)
1270	G.APARNAJINI	246197189 (R)
1276	D.MANISH	246197114

LONG TERM JEE (ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110, 096421 15777 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

SR Educational Academy

TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 79

సోమవారం 10-6-2024


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 10 । జూన్ । 2024



నిత్యాన్నదానానికి విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ కానూరు కేసీపీ కాలనీకి చెందిన చిట్టూరి యఘ్నేశ్వర నారాయణ గుప్తా కుటుంబం రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

గరిష్టం/కనిష్టం
35/25

	కనిష్టం	గరిష్టం
నందిగామ	28.2	34.8
జగ్గయ్యపేట	25	35
మచిలీపట్నం	28	33
గుడివాడ	28	34

న్యూస్‌రీల్

రేపు యూటీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం

కంచికచర్ల: స్థానిక గొట్టుముక్కల రోడ్డులోని ఎస్. లక్ష్మీనారాయణ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 11వ తేదీన యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా మధ్యంతర సమావేశం కంచికచర్ల, వీరులపాడు మండలాల సంఘ నాయకులు సౌజన్యంతో జరుగుతుందని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, సుందరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంఘ పూర్వ రాష్ట్ర కోశాధికారి కె. సంజీవరెడ్డి అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వరరావు, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ హాజరుకానున్నారని తెలిపారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులను చర్చించటంతో పాటు, విద్యారంగ పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా పని చేయుటకు తగు సూచనలు, కార్యాచరణ గురించి ఉపాధ్యాయులతో చర్చిస్తామని చెప్పారు.

సెంట్రల్ జోన్ చాంపియన్ పశ్చిమ గోదావరి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్‌మెన్ టీ20 క్రికెట్ చాంపియన్‌గా పశ్చిమ గోదావరి జట్టు నిలిచింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో మే 31న ప్రారంభమైన సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ మెన్ టీ20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు వెస్ట్‌గోదావరి–ప్రకాశం, కృష్ణా–గుంటూరు జిల్లాల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో వెస్ట్‌గోదావరి జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 20 ఓవర్లలో 4వికెట్లకు 146 పరుగులు చేసింది. అనంతరం వెస్ట్ గోదావరి జట్టు 19.2 ఓవర్లలో 6వికెట్లకు 147 పరుగులతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొని కృష్ణా జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 20 ఓవర్లలో 8వికెట్లకు 151 పరుగులు చేయగా గుంటూరు జట్టు 17.1 ఓవర్లలో 7వికెట్లకు 156 పరుగులు చేసి విజేతగా నిలించింది. వెస్ట్ గోదావరి, గుంటూరు, కృష్ణా జట్లు చెరో 8 పాయింట్లతో నిలవగా, ప్రకాశం జట్టు పాయింట్లు ఏమీ సాధించలేదు. వెస్ట్ గోదావరి మెరుగైన నెట్ రన్‌రేట్ ఉండటంతో విజేతగా నిలిచినట్లు ప్రకటించారు.

13న మహా కుంభాభిషేకం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 13వ తేదీ మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అందులో భాగంగా ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, దీక్షా స్వీకరణ, వాస్తు హోమం, అంకురారోపణ ఉంటుందని తెలిపారు. 11వ తేదీ మంగళవారం ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అగ్ని ప్రణయనం, రుద్రాభిషేకం, ప్రధాన హోమాలు ఉంటాయని, రాత్రికి సర్వతోభద్ర మండప ఆవాహన కలశస్థాపన ఉంటుందని చెప్పారు. 12వ తేదీ బుధవారం ఉదయం 8.10 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, రాత్రికి మహాశాంతి హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13వ తేదీ గురువారం ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, 9.18 గంటలకు ఆలయశిఖరాన మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, స్వామివారి శాంతి కల్యాణం, అనంతరం అన్న సమారాధన ఉంటాయని వివరించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం అన్న ప్రసాద పంపిణీ ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

నందిగామ కోర్టులో జిల్లా జడ్జి



నందిగామ: నందిగామ కోర్టును ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణసారిక ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. 16వ అదనపు జిల్లా కోర్టును పీడీఎం కోర్టుకు మార్చాలని పీడీఎం కోర్టును ఏడీఎం కోర్టుకు మార్చాలని అదేవిధంగా పాత సబ్‌కోర్టును సీనియర్ అడ్వకేట్ బార్ రూమ్‌కు కేటాయించాలని 16వ అదనపు జిల్లా కోర్టు కొత్త భవనాలు నిర్మించాలని కోరుతూ న్యాయవాదులు వినతిపత్రం అందించారు.

శాంతి భద్రతలకు
స్పెషల్ టాస్క్‌ఫోర్స్

- హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్టీఆర్ జిల్లా పోలీసుల చర్యలు
- విజయవాడలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకూ ప్రత్యేక ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సామాన్య జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు విధుల్లో చేరిన ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రచించి ముందుకు సాగుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ఫోకస్..

జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసులు వాటిపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా అన్ని స్టేషన్ల పరిధిలో ఉన్న యువకులైన కానిస్టేబుళ్లను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల నుంచి మెరికల్లాంటి 400 మంది కానిస్టేబుళ్లను గుర్తించారు. ఇందులో ఇప్పటికే కొంత మందికి శిక్షణ సైతం ఇచ్చారు. వీరందరితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ప్రాంతాల వారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగినా.. అల్లర్లకు పాల్పడిన నిమిషాల్లో సంఘటన ప్రాంతానికి చేరుకొనేలా ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ కోసం..

విజయవాడలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. త్వరలో అడ్వైజరీ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, విద్యాసంస్థలతో బహిరంగ సమావేశాలకు రూపకల్పన చేస్తున్నారు. రెవెన్యూ, వీఎంసీ, రవాణా, ఆర్అండ్‌బీ శాఖలను సమన్వయం చేస్తున్నారు. సమస్యలను మూడు రకాలుగా వర్గీకరణ చేసుకొంటున్నారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలు, షార్ట్ టైంలో పరిష్కారం అయ్యేవి, లాంగ్ టర్మ్‌లో పరిష్కారమయ్యేవిగా విభజిస్తున్నారు.



వల్లభనేని వంశీ ఇంటి వద్ద గస్తీ కాస్తున్న పోలీసులు(ఫైల్)

నేరాల అదుపునకు..

విజయవాడ నగరంలో నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోకి రోజూ ఐదు లక్షల మందిపైగా జనాలు రైలు, బస్సులు, లారీల ద్వారా నగరంలోకి రాష్ట్రంతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. వీరిలో కొంత మంది దొంగతనాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఇందులో కొన్ని రిపోర్ట్ అవుతుండగా, చిన్న దొంగతనాలు అయితే రిపోర్ట్ కావటం లేదు. వీటిని పసిగట్టేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. సైబర్ క్రైం వింగ్‌ను పటిష్టం చేస్తున్నారు. ప్రధానంగా టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెట్టి.. వారి ప్రవర్తనలో తేడా కనిపిస్తే నిర్దాక్షిణ్యంగా నగర బహిష్కరణ వేటు వేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు ఏడుగురుపైన నగర బహిష్కరణ వేటు వేశారు. ఇద్దరిపై పీడీ యాక్టు ప్రయోగించారు. 200 మందిపై రౌడీషీట్లు తెరిచారు.

వరుస ఘటనలు..

విజయవాడ లబ్బీపేట మునిసిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంటిపై ఈ నెల ఏడో తేదీన టీడీపీ కార్యకర్తలు, నాయకులు దాడిచేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన ఈ విధ్వంస కాండ ఐదు గంటల పాటు కొనసాగింది. అరుపులు, కేకలు, రాయలేని పదాలతో బూతులతో ఆ ప్రాంతాన్ని అట్టుడికించారు. అత్యుత్సాహంతో పెద్ద సంఖ్యలో వచ్చిన టీడీపీ నాయకులను ఎట్టకేలకు పోలీసులు అదుపు చేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన నాయకులు దాడులకు పాల్పడ్డారు. విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీపై దాడిచేసి వైఎస్సార్ పేరు తొలగించారు. పలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు చేపట్టారు.

చట్ట వ్యతిరేక చర్యలను సహించం..



జిల్లా వ్యాప్తంగా చెడు నడత కలిగిన వ్యక్తులపై ఇప్పటికే పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి, సమాచారం సేకరిస్తున్నాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. నగర బహిష్కరణ చేస్తాం, అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగిస్తాం. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాంతాల వారీగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం, నేరాల నియంత్రకు టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిరోధానికి ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నాం.

– పీహెచ్‌డీ రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్

జోరుగా జూనియర్ అడ్మిషన్లు

- ఇంటర్ కళాశాలల్లో కొనసాగుతున్న అడ్మిషన్లు
- ముగిసిన మొదటి విడత షెడ్యూల్
- నేటి నుంచి రెండో విడత అడ్మిషన్లు
- అడ్మిషన్లు పెరిగే అవకాశం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్ల సందడి జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఆదేశానుసారం జూన్ మొదటి తేదీ నుంచే జూనియర్ కళాశాలలు అధికారికంగా పనిచేస్తున్నాయి. ఎండల తీవ్రత కారణంగా శుక్రవారం నుంచి కొన్ని, వచ్చే వారం నుంచి మరికొన్ని కళాశాలలు తెరచుకోనున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కళాశాలలకు తరలుతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గడిచిన నాలుగు రోజుల నుంచి ఇంటర్మీడియెట్ తొలి సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్ల జోరు కనిపించింది. ఆయా కళాశాలలు రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులను సైతం ప్రారంభించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు పెరగటంతో అడ్మిషన్లు సైతం బాగుంటాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఊపందుకున్నాయి.

పెరగనున్న అడ్మిషన్లు..

విద్యా సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 24,763 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే కృష్ణా జిల్లాలో 19,011 మంది పది ఉత్తీర్ణులయ్యారు. వీరు కాకుండా సప్లిమెంటరీ పరీక్షల్లో రెండు జిల్లాలు కలిపి సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారని అంచనా. అలాగే ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 40 వేల మంది ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. అదేవిధంగా కృష్ణాజిల్లాలోనూ సుమారు పాతిక వేల మంది వరకూ ద్వితీయ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో జూనియర్ కళాశాలలు..

ప్రైవేట్ యాజమాన్యంలోని కళాశాలలు	152
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	10
ఏపీటీడబ్ల్యూఆర్‌జేసీ	1
కేజీబీవీ	3
ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ	7
మోడల్ జూనియర్ కళాశాలలు	2
హైస్కూల్ ప్లస్	16
ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు	5

నేటి నుంచి రెండో దశ..

ఈ నెల 10వ తేదీ నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంటర్మీడియెట్ రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. జూన్ మొదటి తేదీతో తొలి దశ అడ్మిషన్లను పూర్తి చేసి కళాశాల్లో తరగతులను సైతం ప్రారంభించారు. జూలై మొదటి తేదీ నాటికి రెండో దశ అడ్మిషన్లను పూర్తి చేయాలని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా బోర్డు అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రెండు జిల్లాల్లోనూ అడ్మిషన్ల సందడి జోరుగా కొనసాగుతోంది.

అడ్మిషన్లు కొనసాగుతున్నాయి..

ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశాం. రెండో విడత అడ్మిషన్లను ఈ నెల పదో తేదీన ప్రారంభం అవుతాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాలల యాజమాన్యాలు నడుచుకోవాలి. షెడ్యూల్ ప్రకారం తరగతులను నిర్వహించాలి. అదే విధంగా ప్రభుత్వ రంగ జూనియర్ కళాశాల్లోనూ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

– సీఎస్ఎస్ రెడ్డి, ఆర్ఐవో, ఎన్టీఆర్ జిల్లా

పకడ్బందీగా ప్రమాణ స్వీకార ఏర్పాట్లు

గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరంలో ఈ నెల 12న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలంలోని కేసరపల్లి ఐటీ పార్కు పక్కన జరుగుతున్న ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, కార్యక్రమ ప్రత్యేకాధికారులు ప్రద్యుమ్న, బాబు.ఎ, ఎ.వీరపాండ్యన్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్‌తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎస్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న దృష్ట్యా అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభాస్థలి వెనుక భాగంలో ఉన్న గుంతలను పూడ్చివేసి వీవీపీలు వచ్చేందుకు వీలుగా చదునుచేయాలని ఆదేశించారు. వేదిక వద్ద బారికేడింగ్, బ్లాక్‌ల విభజన పక్కాగా చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం పార్కింగ్ ఏరియాల కోసం ఎంపిక చేసిన వెటర్నరీ కళాశాల, పెట్రోల్ బంక్, మేధ టవర్, సావరగూడెం రోడ్డులోని వెంచర్లను సీఎస్, డీజీపీ పరిశీలించారు. పార్కింగ్ ఏరియాల నుంచి సభ ప్రాంగణానికి వెళ్లేందుకు వీలుగా అప్రోచ్ రోడ్లను నిర్మించాలన్నారు. రాష్ట్ర అదనపు డీజీపీ బాగ్చీ, ఐజీలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రామకృష్ణ, కృష్ణా, గుంటూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు గీతాంజలిశర్మ, జి. రాజకుమారి, విజయవాడ, రాజమండ్రి మునిసిపల్ కమిషనర్లు స్వప్నిల్ దినకర్, దినేష్‌కుమార్, డీఐజీ గోపినాథ్‌జెట్టి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తదితరులు పరిశీలించారు.



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్, డీజీపీ, అధికారులు



భద్రత ఏర్పాట్లు గురించి చర్చిస్తున్న ఎస్పీజీ ఐజీ

ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

గన్నవరం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీజీ ఐజీ నవనీత్‌కుమార్ మెహతా అధికారులకు సూచించారు. మండలంలోని కేసరపల్లిలో బుధవారం జరగనున్న సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీఎం హాజరుకానున్న నేపథ్యంలో ఆయన ముందస్తు భద్రత ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సభ ప్రాంగణాన్ని పరిశీలించడంతో పాటు ప్రధాన మంత్రి కాన్వాయ్ రూట్‌మ్యాప్ గురించి రాష్ట్ర అధికారులతో సమీక్షించారు.

అన్నప్రాసన రోజే తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, ఆరు నెలల చిన్నారి మృతి

నూజివీడు: మనుమడికి అన్నప్రాసన చేసుకొని ఆనందంగా వెళ్తున్న వారి ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. నూజివీడు మండలం గొల్లపల్లి వద్ద ఆదివారం సాయంత్రం ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో అమ్మమ్మ, మనుమడు మృతి చెందిన హృదయ విదారక సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని చిన్నాపురానికి చెందిన బొందిలి నాగరాజుసింగ్ తన పెద్ద కుమార్తె బొందిలి సంతోషీబాయిని నూజివీడు పట్టణంలోని బొందిలీపేటకు చెందిన బొందిలి బాలాజీ సింగ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరి కొడుకైన బొందిలి హియాన్ సాయి సింగ్‌కు అన్నప్రసాన నిమిత్తం ఆటోలో ఉదయం నూజివీడు వచ్చారు. అన్నప్రాసన ముగించుకుని సాయంత్రం ఆటోలో చిన్నాపురం వెళ్తుండగా 6.10గంటల సమయంలో గొల్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆరు నెలల బాబుతో పాటు అమ్మమ్మ బొందిలి సునీతాబాయి(48) మృతిచెందింది. ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో పట్టణంలోని బొందిలిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ప్రమాదంలో ఆటో పక్కకు వెళ్లి పడటంతో అక్కడే నిల్చున్న పామర్తి రమేష్(32)కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ మోర్ల నాగరాజు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే సీఐ రామకృష్ణ హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూశారు. వ్యాన్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.





మృతిచెందిన బొందిలి సునీతాబాయి, బొందిలి హియాన్ సాయి సింగ్

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



దుర్గమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



ముఖమండపం వద్ద భక్తులు

- వేసవి సెలవులు ముగియనుండటంతో రికార్డు స్థాయిలో దర్శనాలు
- సర్వ దర్శనానికి మూడు గంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగియనుండటంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాధారణంగా సెలవు రోజులలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే వీలుంది. అయితే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపే ఆ సంఖ్యను దాటేసింది. భక్తుల తాకిడితో అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. మహా మండపంలో మెట్లు, లిఫ్టు ద్వారా కొండపైకి చేరుకున్న భక్తుల క్యూ 5వ అంతస్తు వరకు చేరింది. ఇక ఘాట్‌రోడ్డు వైపున ఓం టర్నింగ్ వరకు చేరింది. దీంత భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కేఎస్ రామరావు అధికారులను అప్రమత్తం చేశారు. 5 అంచల కంపార్టుమెంట్ విధానంతో క్యూలైన్లలో రద్దీని నియంత్రిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఇక రైల్వే స్టేషన్, బస్టాండ్‌లతో పాటు కొండ దిగువన దుర్గాఘాట్ నుంచి కొండపైకి నడిచే బస్సులలో భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. సర్వదర్శనం క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకునే వారికి మూడు గంటల సమయం పట్టింది. మరో వైపున వీఐపీల పేరిట వచ్చే వారిని టికెట్ ఉంటేనే రూ. 500 క్యూలైన్‌లోకి అనుమతించారు. సీఎం గేట్‌తో పాటు ఆలయం దక్షిణ వైపు గేట్లకు తాళాలు వేసి రద్దీని నియంత్రించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబు, ఇతర అధికారులు రద్దీని నియంత్రిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. అమ్మవారిని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

కొండ దిగువన బార్లు తీరిన కార్లు..

తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి తమ సొంత వాహనాలపై వచ్చిన భక్తుల కార్లతో కొండ దిగువన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కుమ్మరిపాలెం వైపు నుంచి కొండవైపునకు కార్లు, ఇతర రవాణా వాహనాలను పోలీసులు అనుమతించలేదు. మరో వైపున సీతమ్మ వారి పాదాలు, ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి వచ్చిన కార్లతో హెడ్ వాటర్ వర్క్స్ పరిసరాలు కిటకిటలాడాయి. కొండ దిగువన తమ కార్లను నిలుపుకుని దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకున్నారు. హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు సీతమ్మ వారి పాదాలు, కెనాల్‌రోడ్డు, వీఎంసీ కార్యాలయం, ఇరిగేషన్ స్థలాలు కార్లు, ద్విచక్రవాహనాలతో నిండిపోయింది.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



జిల్లా జడ్జిని సత్కరిస్తున్న ఆలయాధికారులు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ వారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు శుభ కార్యాలు ఉండటంతో ఆదివారం అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ నుంచి వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. ఆలయం చుట్టూ కాకుండా గ్రామంలో ఎక్కడ చూసినా వాహనాలు నిలిచి పోయాయి. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. దర్శనం అనంతరం మునేరు అవతల మామిడి తోటల్లో సందడి చేస్తూ వంటలు వండుకుని భోజనాలు చేశారు.

తిరుపతమ్మ సేవలో జిల్లా జడ్జి..

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని ఆదివారం ఉమ్మడి జిల్లా జడ్జి అరుణసారిక, జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రావణి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఎస్ఐ పి. రాంబాబు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సుస్థిర దిగుబడులు


డాక్టర్ పి.శ్రీలత, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్

ఘంటసాల:భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా రైతులు తమ పంటలను సక్రమంగా పండించుకోవడంతో పాటు తక్కువ ఖర్చుతో ఆదాయం పొందే మార్గాలను తెలుసుకోవచ్చు. రైతులు సుస్థిరమైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అత్యుత్తమైన ఫలితాలు పొందడానికి అవకాశాలు ఉన్నాయని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలిపారు.

1.భూసార (మట్టి లేదా మృత్తిక) పరీక్ష

నేలలు వాటిలోని సహజంగా ఉన్న పోషక పదార్థాలతో పాటు అదనంగా వేసిన సేంద్రియ, రసాయనిక ఎరువుల్లోని పోషకాలను మొక్కలకు అందజేసి పంట దిగుబడికి దోహదపడతాయి. కాబట్టి నేలల్లో ఉన్న భూసారాన్ని తరుచూ తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో అనవసరపు ఖర్చులు చేయకుండా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందవచ్చు. దీనికి సంబంధించి రైతులు తమ పొలంలోని మట్టిని వర్షాధార భూములలో 3 సంవత్సరాలకు ఒకసారి, నీటి వసతి క్రింద 3 పంటల కొకసారి పరీక్ష చేయించుకుంటే మంచిది. పోషక పదార్థాల గురించే కాక భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా మృత్తిక (మట్టి) పరీక్ష చేయించుకోవాలి. భూసార పరీక్షలో అన్నిటికన్నా ముందు తెలుసుకోవాల్సింది మట్టి నమూనాను సేకరించడం. భూసార పరీక్ష కోసం తీయాల్సిన మట్టి నమూనా సరియైనది కానిచో దాని భౌతిక, రసాయనిక, జీవ లక్షణాలు మన పొలం లక్షణాలను ప్రతిబింబించేదిగా ఉండదు. దీని వలన చేయించిన భూసార పరీక్ష, దానికి అనుగుణంగా చేసిన ఎరువుల సిఫార్సులు వ్యర్థమవుతాయి.


వరి పొలాల్లో మట్టి నమూనా సేకరిస్తున్న రైతులు


మట్టి నమూనాలు భద్రపరుస్తున్న దృశ్యం

- వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, చెరకు మొదలగు పంటలకు 15 సెం.మీ. వరకు, లోతైన వేరు వ్యవస్థ గల వేరుశనగ, పత్తి, అపరాలు, కూరగాయలు మొదలగు పంటలలో 30 సెం.మీ.ల వరకు పారతో గుంట తీసి అందులో పైపార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.

2.సాగునీటి పరీక్ష.....

పూర్వం సాగునీటి నాణ్యతపై ఎక్కువ అనుమానాలు లేక రైతులు నిర్భయంగా వాడుతుండేవారు. కానీ పెరుగుతున్న నీటి కొరత వలన భూమిలోని పొరల నుంచి నీటిని తోడుట వలన (బోర్లు) ఎక్కువ లవణాలు పోవటమే కాకుండా నేలలు కూడా బాగు చేసేందుకు వీలుపడని రీతిలో చెడిపోయేందుకు ఆస్కారముంది. ఇటువంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడకుండా కొత్తగా తవ్విన బోరు బావుల నీరు, నర్సరీల కోసం వేరే ప్రాంతం నుంచి తెప్పించి వాడే నీటిని మొదట పరీక్ష చేసి ఆ తర్వాత వాడుకోవడం మంచిది.

- సాగునీటి పరీక్ష కోసం పొలంలోని బోరు బావి నీటిని పంపులో సుమారు 20-30 నిమిషాలు బయటకు వదిలిపెట్టిన తర్వాత మంచి ప్లాస్టిక్ సీసాలో సుమారు 500 మి.లీ. (అర లీటరు) తీసి సమీప భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. వీలైనంత వరకు గాజు సీసా బదులు ప్లాస్టిక్ సీసాను వాడటమే శ్రేయస్కరం.
- కాలువలు లేదా చెరువుల నుంచి నమూనా నీటిని తీసేటప్పుడు ఒక పెద్ద కర్రకు చిన్న బక్కెట్‌ను కట్టి ఒడ్డుకు దూరంగా నీటిని తీయాలి. ఆ నీటితో 2-3 సార్లు కడిగి, ఆ తర్వాత నమూనాతో నింపాలి.

3. పంట మొక్కలు / పండ్ల చెట్ల ఆకుల నమూనా పరీక్ష

కొన్ని పరిస్థితుల్లో ముఖ్యంగా పండ్ల తోటల్లో చెట్లు కొన్ని సంవత్సరాల తర్వాత భూమి అడుగు పొరలలోని ప్రతికూల పరిస్థితుల వలన గానీ, భూమి నిస్సారమవడం వలన గానీ, పోషక పదార్థాల లోప లక్షణాలు చూపిస్తాయి. ఇటువంటి సందర్భాల్లో నేల ఉపరితల పొరల మట్టి కన్నా చెట్ల భాగాలను ముఖ్యంగా ఆకులను పరీక్షచేసి పోషక పదార్థాల లోపాలను సవరించుకోవచ్చు. కొన్ని పరిస్థితుల్లో సాధారణ వార్షిక పంటల్లో కూడా పంట నాటిన తర్వాత పోషక పదార్థాలు ముఖ్యంగా సూక్ష్మపోషక పదార్థాల లోపాలు కనిపిస్తాయి. ఈ పరిస్థితుల్లో పంట భాగాలను పరీక్ష చేయించి తదనుగుణంగా చర్యలు తీసుకొని పంట దిగుబడి, నాణ్యత తగ్గకుండా చేసుకోవచ్చు.

- పంట ఆకులు, చెట్ల ఆకులలో ఏవైనా లోపాలున్నట్లు సందేహం కలిగినప్పుడు ముఖ్యంగా అవి పెరగకుండా చిన్నవిగ, పసుపు రంగుగా లేక ఎర్రగా మారుతున్నట్లయితే వెంటనే పరీక్ష చేయించాలి. అయితే ఈ చిహ్నాలు కీటకాలు లేదా రోగం వలన వచ్చినవి కావని నిర్ధారణ చేసుకున్న తర్వాతే మొక్క / చెట్టు ఆకులను పోషక పదార్థ లోపాల కొరకు పరీక్ష చేయించాలి. ఇటువంటి

4.పరీక్ష ఫలితాల విశ్లేషణ

భూసార, సాగునీటి, పంటల ఆకుల పరీక్షా ఫలితాలను విశ్లేషించేందుకు పరీక్షలు జరిపిన చోట ఉన్న అధికారుల సహాయం తీసుకోవాలి. ఫలితాలు పోస్ట ద్వారా వస్తే సమీపంలో ఉన్న వ్యవసాయశాఖ అధికారులను గానీ, వ్యవసాయ పరిశోధనా స్థానాల్లోని సంబంధిత శాస్త్రవేత్తలను గానీ సంప్రదించాలి. అందుకు అనుగుణంగా తక్షణం చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా

ట్రాక్టరు బోల్తా పడి రైతు మృతి



తిరువూరు:తిరువూరు శివారు పీటీకొత్తూరు వద్ద ఆదివారం సాయంత్రం ట్రాక్టరు బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి శివారు గొల్లగూడెంకు చెందిన బట్టు శ్రీను (30) తిరువూరు సమీపంలో పొలం కౌలుకు తీసుకుని ఖరీఫ్ సాగుకు ఉపక్రమించాడు. ఆదివారం పొలం దున్నడానికి ట్రాక్టరు డ్రైవ్ చేస్తున్న తరుణంలో బ్రేకులు ఫెయిలై పంటకాలువలోకి దూసుకెళ్లింది. ట్రాక్టరు బోల్తా పడగా శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. పొక్లెయిన్‌తో ట్రాక్టరును, శ్రీను మృతదేహాన్ని పంట కాలువ నుంచి స్థానికులు బయటికి తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని యువకుడి దుర్మరణం



కోనేరుసెంటర్: లారీని ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం గోసంఘ సమీపంలోని ఎస్సీకాలనీకి చెందిన బాపట్ల బంగారం (18) అనే యువకుడు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం పనుల నిమిత్తం బయటికి వెళ్లిన బంగారం తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా వెళ్లి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బంగారం తలకు బలమైన గాయం కావటంతో పాటు కాలు విరిగిపోయింది. బంగారం అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదస్థలిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి:స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజామునుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. క్యూలైలన్నీ భక్తులతో బారులు తీరాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెండిళ్లలో భారీ చోరీ



ఇబ్రహీంపట్నం:ఎన్టీటీపీఎస్ కాలనీలో తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. రిటైర్డ్ ఉద్యోగి చప్పిడి రెడ్డిమ్మ శనివారం ఉదయం గుడివాడలోని తమ బంధువుల వివాహానికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చే సమయానికి ఇంటి తాళం, గడియ పగులగొట్ట బీరులో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదు, 10 కాసుల బంగారం దోచుకెళ్లారు. మరో రిటైర్డ్ ఉద్యోగి రామచంద్రరావు తమ కుటుంబ సభ్యుడిని ట్రైన్ ఎక్కించేందుకు తెల్లవారుజామున విజయవాడ వెళ్లాడు. తిరిగి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో దాచి ఉంచిన 25 కాసుల బంగారం నగలు, రూ.1.20 లక్షల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం దహనం

- ఇంటి ముందు పెట్టిన బైక్‌ను తగలపెట్టిన వైనం
- తూర్పులోని ఫకీరుగూడెంలో ఘటన
- ఆ బైక్ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పిల్లి వెంకట్‌ది
- పరామర్శించి ధైర్యం చెప్పిన వై.సిద్ధార్థ్


దహనమైన బైక్‌ను పరిశీలించి బాధితుడు పిల్లి వెంకట్‌ను పరామర్శిస్తున్న సిద్ధార్థ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫకీర్‌గూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లబ్బీపేట, ఫకీర్‌గూడెంకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఆయన తన ద్విచక్ర వాహనాన్ని అవసరాల నిమిత్తం వాడుకుని ఇంటి ముందు పార్కింగ్ చేస్తుంటాడు. రోజులాగే శనివారం రాత్రి 9 గంటలకు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో పనులు ముగించుకుని నిద్ర పోయాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటి ముందు పెద్ద శబ్దం రావడంతో అతను తన భార్యతో కలిసి బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కాలి పోతుంది. హుటాహుటిని వాహనంపై నీళ్ల చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే వాహనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే తన వాహనంపై పెట్రోల్ పోసి తగలబెట్టారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న దాడులు...

లబ్బీపేట(విజయవాడతూర్పు):కొత్త ప్రభుత్వం కొలువు తీరక ముందే టీడీపీ అరాచకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేస్తూ వారి ఇళ్లపై దాడులు చేయడమే కాకుండా, ఇళ్ల ముందు పెట్టిన బైక్‌లను దహనం చేస్తున్నారు. తాజాగా విజయవాడ తూర్పు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పిల్లి వెంకట్ పల్సర్ బైక్‌ను శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పచ్చమూకలు పెట్రోలు పోసి తగులబెట్టి పరారయ్యారు. ఫకీరుగూడెంలో జరిగిన ఈ ఘటనలో బైక్ పూర్తిగా కాలిపోయింది. కాగా విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా పార్టీనేత వై.సిద్ధార్థ్ ఫకీరుగూడెంలోని ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో శాంతియుత వాతావరణాన్ని టీడీపీ నేతలు కలుషితం చేస్తూ, అరాచకాలు చేస్తున్నారని మండిపడుతున్నారు.

అండగా నిలిచిన వారికి తోడుగా ఉంటాం

వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇంఛార్జి ఉప్పాల రాము

పెడన:సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి నాయకుడు, కార్యకర్తకు తోడుగా ఉంటానని, వారందరికి కూడా పాదాభివందనమని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారని, అయినా దురదృష్టవశాత్తు ఓటమి పాలయ్యామని తెలిపారు. అయినా అధైర్యపడకుండా మరింత పార్టీని బలోపేతం చేయడానికి మనమంత కలిసి శ్రమిద్దామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత రెట్టింపు ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ముఖ్య నాయకులు కూడా అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ ముందుంటుందని భరోసా ఇచ్చారు. గతంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో ముందుకు అడుగులు వేశారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరూ కూడా అధైర్యపడవద్దని అన్నారు. గెలుపోటములు అనేవి సహజమేనని, వాటిని ఒక సవాలుగా తీసుకొని పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులుపై దాడులకు పాల్పడుతున్నారనే విషయంలో భయపడవద్దని, భయపెట్టే కొద్ది ఇంకా భయపెడుతుంటారని, మీకు మేము అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. ఈయనతో పాటు గరికిపాటి వెంకటరామానాయుడు, ఝాన్సీ తదితరులున్నారు.

12న కృష్ణా జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



కోనేరుసెంటర్:గన్నవరం మండలం కేసరపల్లి ఐటీపార్కులో ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. ఆ రోజు జరిగే కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఇతర రాష్ట్రాల గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు, అధికారులు హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పలు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రయాణికులు పోలీసు ఆంక్షలతో పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలను దృష్టిలో పెట్టుకుని 12వ తేదీ ప్రయాణాలను నిర్ణంచుకోవాలని తెలిపారు. అలాగే పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు ఇవే.....

- విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను కత్తిపూడి నుంచి జాతీయ రహదారి 216 మీదుగా ఒంగోలు వైపు మళ్లిస్తారు.
- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లి వచ్చే వాహనాలను కత్తిపూడి నుంచి ఒంగోలు వైపు మళ్లిస్తారు.
- చెన్నై నుంచి విశాఖపట్నం వైపు వచ్చే వాహనాలకు సంబంధించి ఒంగోలు నుంచి రేపల్లె మీదుగా వయా మచిలీపట్నం - లోసర్‌బ్రిడ్జి- నరసాపురం - అమలాపురం - కాకినాడ - కత్తిపూడి మీదుగా విశాఖపట్నం వైపు మరలిస్తారు.
- బుడంపాడు నుంచి తెనాలి - పులిగడ్డ - మచిలీపట్నం - లోసర్ బ్రిడ్జి - నర్సాపురం - కాకినాడ - కత్తిపూడి వైపు మళ్లిస్తారు.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గామన బ్రిడ్జి - దేవరపల్లి - జంగారెడ్డిగూడెం - అశ్వరావుపేట -ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తారు.
- భీమడోలు - ద్వారకతిరుమల - కామవరపుకోట- చింతలపూడి నుంచి ఖమ్మం వైపు మళ్లించటం జరుగుతుంది.
- ఏలూరు బైపాస్‌నుంచి - జంగారెడ్డిగూడెం మీదుగా అశ్వరావుపేట - ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తారు.
- ఏలూరు బైపాస్ - చింతలపూడి నుంచి సత్తుపల్లి మీదుగా మళ్లిస్తారు.
- హనుమాన్‌జంక్షన్ - నూజివీడు, మైలవరం - ఇబ్రహీంపట్నం - నందిగామ మీదుగా హైదరాబాదు వైపు మళ్లిస్తారు.
- హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలకు సంబంధించి నందిగామ - మధిర - వైరా - సత్తుపల్లి - అశ్వరావుపేట - జంగారెడ్డిగూడెం - దేవరపల్లి - గామన బ్రిడ్జి మీదుగా విశాఖపట్నం వైపునకు మళ్లిస్తారు.
- ఇబ్రహీంపట్నం - మైలవరం - నూజివీడు - హనుమాన్‌జంక్షన్ నుంచి ఏలూరు బైపాస్‌మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు.
- రామవరప్పాడు - నున్న - పాములకాలువ - వెలగలేరు - జి కొండూరు - మైలవరం - నూజివీడు- హనుమాన్‌జంక్షన్ - ఏలూరు బైపాస్‌రోడ్డు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లింపు.
- విజయవాడ నుంచి ఎనికేపాడు మీదుగా 100 అడుగుల రోడ్డు - తాడిగడప - కంకిపాడు - పామర్రు - గుడివాడ నుంచి భీమవరం వైపు మళ్లిస్తారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఫిట్జీ విద్యార్థి ప్రతిభ

ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన తేజశ్వర్



ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన తేజశ్వర్‌ను అభినందిస్తున్న పిన్నెపు రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో విజయవాడలోని ఫిట్జీ విద్యార్థి కోడూరు తేజేశ్వర్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించినట్లు ఫిట్జీ డైరెక్టర్ పిన్నెపు రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంజీరోడ్డులోని ఆ విద్యాసంస్థలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థి అత్యుత్తమ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఆలిండియా 8వ ర్యాంకు కాగా, ఏపీ స్థాయిలో మొదటి ర్యాంకు కావడం గర్వకారణం అన్నారు. దాదాపు 300 మందికిపైగా తమ విద్యార్థులు ఈ పలితాల్లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీల్లో ప్రవేశం పొందారని తెలిపారు. కాగా జేఈఈ మెయిన్స్‌లో కూడా తమ విద్యార్థులు వందశాతం విజయం సాధించినట్లు తెలిపారు. ఈ విజయాలు భవిషత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియచేశారు.

శ్రీ చైతన్య విద్యార్థుల విజయకేతనం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ-2024 అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 10 లోపు 4, 5, 6, 9, 10 ర్యాంకులతో విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థలల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీచైతన్య బ్రాంచ్‌లో చదువుతున్న విద్యార్థులు నలుగురు ఆలిండియా ఓపెన్ కేటగి వందలోపు ర్యాంకులు పొందారని వివరించారు. ఎస్.సిద్ధార్థ రెడ్డి 34వ ర్యాంకు, ఎస్.జ్యోతిరాదిత్య 55, పి.వి.ఎస్.డి.సాయిమెహీత్ 71, టి.వి.ఎస్.ఎస్. నాగభూషణ్ 100వ ర్యాంకు పొందారని తెలిపారు. 27 మంది విద్యార్థులు 500లోపు ర్యాంకులు, 46 మంది వెయ్యి లోపు ర్యాంకులు పొందారని పేర్కొన్నారు. సూపర్ 60, సీ 120, సీఐపీఎల్, ఐపీఎల్ ఐసీ వంటి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల వల్లనే ఈ విధమైన ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ర్యాంకులు పొందేలా విద్యార్థులను తీర్చిద్దిడంలో ముఖ్యపాత్ర పోషించిన అధ్యాపకులను అభినందించారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను విద్యాసంస్థల డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి మిర్చి యార్డులో క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి యథావిధిగా మిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, హమాలీల అభ్యర్థన మేరకు మే నెల 11 నుంచి జూన్ 9 వరకు యార్డుకు సెలవులు ప్రకటించినట్టు వివరించారు. సుమారు నెల రోజుల అనంతరం యార్డులో క్రయవిక్రయాలకు అనుమతిచ్చినట్లు వెల్లడించారు. మిర్చి రైతులు తమ సరుకును ఆదివారం అర్ధరాత్రి నుంచి మిర్చి యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

హనుమనామ స్మరణ భక్తకోటికి కొండంత అండ

ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు


అభయాంజనేయ స్వామి సన్నిధిలో చాగంటి కోటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అంజనీపుత్రుడైన హనుమాన్‌ను స్మరించటం వల్ల సకల కష్టాలు తొలగిపోతాయని, భక్తుల మనోవాంఛ ఫలిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలోలో ఆదివారం సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం జరిగింది. హనుమంతుడు బలశాలి మాత్రమే కాదని ఎంతో జ్ఞానశాలి అని చెప్పారు. ఆంజనేయ స్వామికి తమలపాకులు, సింధూరంతో అర్చన చేయటానికి ఆయనకు గల ప్రత్యేక సుగుణాలే కారణామని వివరించారు. రావణుడు కుయుక్తితో సీతమ్మను అపహరించి లంకలో బంధించగా, ఆ సీతారాములను తిరిగి కలిపిన వీరుడు వాయుపుత్రుడేనని తెలిపారు. అలాగే ఎలాంటి ఆపదలో ఉన్న వారికైనా అభయమిచ్చి ఆదుకునే స్వామి హనుమంతుడని చెప్పారు. హనుమంతుడిని స్మరించటంతో మనోధైర్యం తప్పక కలుగుతుందని, ఎలాంటి లక్ష్యాన్ని అయిన సాధించగలమని వివరించారు. తొలుత ఆయన అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు చాగంటి కోటేశ్వరరావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను ఆయనకు బహుకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన ఆర్ఎస్‌వై.రాజేశ్వరికి చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన చిన్నారులు ఆంధ్ర నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టి గారి పార్కు ప్రాంతంలో చనుమోలు శ్రీను కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనుకు ముగ్గురు సంతానం. కుమార్తె 7వ తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల వారిని ఆరా తీయగా ఓ ఆటోలో వెళ్లినట్లు చెప్పడంతో ఆందోళన చెందిన శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మానవ సేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తోటివారికి సాయం చేయాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సూచించారు. దుర్గాపురానికి చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వీరంకి గోకర్ణేశ్వరరావు ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో బ్రహ్మదేశం వసంత కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లభించదని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన గోకర్ణేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. వాకర్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, జోన్ కార్యదర్శి గుర్రం ఏడుకొండలు, రాజారావు, ఆశ్రమ నిర్వాహకులు దుర్గ, జ్ఞానేంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

శ్రీహర్షకు ఉత్తమ సేవ అవార్డు



భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ భవానీపురానికి చెందిన పీవీకే శ్రీహర్షకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ పక్షాన సేవలు అందిస్తున్న పలువురికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ.. మానవ హక్కులకు సంబంధించి ఎవరైనా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్న తమ సంస్థ ప్రతినిధుల సేవలను గుర్తించి ప్రోత్సాహకరంగా అవార్డులను అందచేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులకు భంగం కలిగించిన ఘటనలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాదులు రమణ కోటేశ్వరరావు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గంగానమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు మరింగా సహకరించాలని సర్పంచ్ కూన పరెడ్డి చంద్రశేఖర్ రావు, గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలో ఏర్పాటు చేసే గంగానమ్మ ఆలయంలో గంగానమ్మ విగ్రహం కొనుగోలుకు గ్రామస్తులు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఇంటింటికీ తిరిగి విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయాన్ని సుమారు రూ.35 లక్షలతో నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల నుంచి వచ్చిన విరాళాలతోనే అమ్మవారి విగ్రహం కొనుగోలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులుపాల్గొన్నారు.



అమ్మ సన్నిధిలో భక్తజనం



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆంధ్రా, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. పుష్కర ఘాట్, మెట్ల మార్గం, కనకదుర్గా నగర్, కొండపై భక్తుల కోలాహలం నెలకొంది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అల్లర్లు, వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ చేసేందుకు కూడా వెనకాడమన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించకుండా మీ జీవితాలను మీ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపుకోవాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను పేరుపేరున ఆరా తీయడంతో పాటు వారి దిన చర్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించినా, స్థానికంగా ఎటువంటి వివాదాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తపేట సీఐ గణేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ-2024(అడ్వాన్స్‌డ్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ర్యాంకులు సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన జేఈఈ-2024(అడ్వాన్స్‌డ్)లో ఎ.సంపత్(729), కె.నాగరాహుల్ ధృవ(3,670), ఎం.నాగలక్ష్మి లలితాదేవి(5,366), పి.పవిత్ర(5,544), పి.వెంకట ఫణికుమార్(7,689)ర్యాంకులు పొందారన్నారు. జేఈఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ర్యాంకులు పొంది జాతీయ విద్యాసంస్థలో సీట్లు పొందుతున్నారని తెలిపారు. ఈ విధమైన ర్యాంకులు సాధించడానికి చక్కని ప్రణాళిక, అధ్యాపకుల సలహాలు సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు. తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని శారదా విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. తమ విద్యా సంస్థలలో చదివే ప్రతి విద్యార్థి కూడా అన్ని జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. పరిమితమైన విద్యార్థులతో ఈ స్థాయిలో ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌తో పాటు జాతీయ స్థాయిలో జరిగే ఇతర అన్ని ప్రవేశ పరీక్షల్లో కూడా సీటు పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, విద్యాసంస్థల జనరల్ మేనేజర్ జీవీ రావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



గన్నవరం: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవార్చుకోవాలని విశ్రాంత హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు సూచించారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా హాజరైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లోని అమూల్యమైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీసం వారంలో ఒక రోజైన గ్రంథాలయాలను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథాలయ సిబ్బందిని ఆయన అభినందించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి.బాబూరావు, పలువురు సిబ్బంది పి. దుర్గలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడమే బక్రీద్

నున్న(విజయవాడరూరల్): పేదలకు సహాయం చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఏపీ 31వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని నున్న టీచర్ కాలనీ మక్కా మసీద్ వద్ద పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఆర్థికపరమైన సంతోషాలతో ఉన్న కుటుంబాలు బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, అదే పేదలకు సహాయం చేయడమన్నారు. మనతో పాటు పేద కుటుంబాలను సహాయం చేసి ఆదుకోవడమే ఆజాద్ ముస్లిం కమిటీ విధానమన్నారు. ప్రతి నెలా ఒక్కొక్క నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, గన్నవరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మస్తాన్ వలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ రహీం, నున్న గ్రామ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్, కార్యదర్శి సుభాని, సెంట్రల్ నియోజకవర్గం కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం సాధ్యమని విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు చెన్నకేశవరావు అన్నారు. స్థానిక చుట్టుగుంటలో ఆదివారం విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యాన శాకాహారం తీసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడ్డుతో సహా మాంసాహారం తినడం వల్ల 159 రకాల రోగాలు వస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. మానవులు ఆచరించాల్సిన అత్యంత ఉదాత్తమైన, మహోన్నతమైన ధర్మం అహింస అని పేర్కొన్నారు. ప్రపంచ మేధావులంతా శాకాహారు లేనని జీవహింస మానుకోవాలని సూచించారు. అనంతరం జీవహింస మానుకోవాలని, శాకాహారమే తీసుకోవాలని నినాదాలు చేస్తూ చుట్టుగుంట, దుర్గాపురం తదితర ప్రాంతాల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్



సమావేశంలో మాట్లాడుతున్న కేఎంఏ సుభాన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వెల్ఫేర్ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కేఎంఏ సుభాన్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వ నిర్మాణంలో చంద్రబాబు పాత్ర కీలకమైందన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, సెక్యులర్ ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం నుంచి సాధించాలని చంద్రబాబుకు సూచించారు. రాష్ట్ర ప్రజల కలల పంట పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రాబట్టాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కేజీ బేసిన్‌లో రాష్ట్ర వాటాను సాధించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు అందించే స్కాలర్‌షిప్స్ పునరుద్ధరణ కోసం వారి ఆర్థిక, విద్యా, వైద్య, ఉద్యోగ సాధనలో సహకారం అందించాలన్నారు. మత సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో మైనారిటీలకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జానీ, కార్యదర్శులు సత్యనారాయణ, హకీమ్, మున్వర్, కరీమ్, జమాన్, ఇనాయతుల్లా, కోశాధికారి మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు దీవెన ఫౌండేషన్ చేయూత



తాతారావు కుటుంబ సభ్యులకు సరుకులు, నగదు అందజేస్తున్న తరుణ్, రవి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైన 65 సంవత్సరాల వృద్ధుడి కుటుంబానికి దీవెన ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు, నగదు అందించి చేయూత ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో మచ్చ తాతారావు(65)కు పక్షవాతం వచ్చి గత కొన్ని నెలలుగా మంచానికి పరిమితమై దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు సాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు.

సరుకులు, నగదు అందజేత..

స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున గ్రూప్ సభ్యులు పెనమలూరు హెడ్‌కానిస్టేబుల్ తరుణ్, రవి ఆదివారం వారి ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, వారి మందుల ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమ లాంటి పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ.. విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామన్నారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.



నగరంలో సండే సందడి

నగరంలో సండే సందడి నెలకొంది. బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, రాజీవ్ గాంధీ పార్క్, బీఆర్ అంబేడ్కర్ పార్క్, కృష్ణానది ఒడ్డున ఉన్న రివర్ ఫ్రంట్ పార్క్‌తోపాటు బీసెంట్ రోడ్డు తదితర ప్రాంతాలు నగర వాసులతో కిటకిటలాడాయి. పార్కుల్లో సందర్శకులు సెల్ఫీలు తీసుకొని ఆనందంగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రెండు కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 17 నుంచి ప్లంబింగ్, శానిటరీ ఫిట్టింగ్, కార్ రిపేర్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. శిక్షణ పూర్తి ఉచితమని ఆసక్తి కలవారు 95050 12312 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బక్రీద్ పొట్టేళ్లకు భలే డిమాండ్

- శనివారం నాటి సంతలో ఒక్కరోజే రూ.20 కోట్ల దాకా వ్యాపారం
- మూడు రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు
- రాష్ట్రంలోనే పొట్టేళ్ల సంతగా బైరెడ్డిపల్లి ప్రత్యేకత

జత రూ.3 లక్షలు పలికిన ధర



వ్యాపారులు, రైతులు, దళారులతో కిటకిటలాడుతున్న బైరెడ్డిపల్లి పొట్టేళ్ల సంత

బైరెడ్డిపల్లి/పలమనేరు(చిత్తూరు జిల్లా) : చిత్తూరు జిల్లాలోని బైరెడ్డిపల్లిలో పొట్టేళ్ల సంతకు ప్రసిద్ధి. ఈ నెల 16న బక్రీద్ పండగను పురస్కరించుకుని ముందస్తుగానే కొందరు మాంసాహారం కోసం పొట్టేళ్లను ఇక్కడకొచ్చి కొనడం ఆనవాయితీ. ఆ మేరకు శనివారం జరిగిన వారపు సంతలో జత పొట్టేళ్లు గరిష్టంగా రూ.3 లక్షల దాకా పలికాయి. సాధారణంగా జత పొట్టేళ్లు రూ.40 వేల దాకా ఉంటాయి. రాష్ట్రంలోనే పొట్టేళ్ల వారపుసంతగా పేరొందిన సంత చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లిలో జరుగుతుంది. ఇక్కడ లభించే నాణ్యమైన, రుచికరమైన పొట్టేళ్ల కోసం మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళల నుంచి వచ్చి వ్యాపారులు పొట్టేళ్లను కొని తీసుకెళుతుంటారు. పండుగకు ముందు సంత కావడంతో పొట్టేళ్లను విక్రయించే రైతులు, కొనే వ్యాపారులతో సంత ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. ఇక వాహనాలైతే మూడు కిలోమీటర్ల మేర బారులుతీశాయి. ముఖ్యంగా కాశ్మీరీ మేకపోతులు, స్థానికంగా పెంచిన పొట్టేళ్లు మాత్రం లక్షల్లో ధరలు పలకడం విశేషం. బక్రీద్ నేపథ్యంలో శనివారం జరిగిన వారపు సంతకు పొట్టేళ్లు, మేకలు, గొర్రెలు సుమారుగా 40 నుంచి 50 వేల దాకా వచ్చాయి. మొత్తం మీద ఇక్కడ పండుగ సంతలో రూ.20 కోట్ల దాకా క్రయ, విక్రయాలు జరిగాయి. వచ్చే శనివారమూ ఇదే స్థాయిలో వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

దళారులకు పండగే..

ఇక్కడి పొట్టేళ్ల సంతలో పండుగసంత కావడంతో దళారుల హవా కొనసాగింది. మొత్తం వ్యవహారం చేతిరుమాళ్ల ద్వారా రహస్య వ్యాపారాలతోనే జరిగింది. అటు రైతులు, ఇటు వ్యాపారులకు మధ్య బేరం కుదర్చడంలో దళారులే ఇక్కడ కీలకం. వీరికి ఇరువైపుల నుంచి నిర్ణయించిన మేర కమీషన్లు దక్కుతాయి. కేవలం బక్రీద్ పండుగకు పొట్టేళ్లను పెంచి మంచి ధరలకు అమ్ముకోవడం రైతులకు మంచి ఆదాయంగా మారింది. దీంతో చిత్తూరు, అనంతపురం జిల్లాలు, కర్ణాటకలోని కోలారు, చింతామణి, శ్రీనివాసపురం, మాలూరు జిల్లాల్లో బక్రీద్ పొట్టేళ్ల పెంపకం సాగుతోంది. ఏటా మేలో మంచి పొట్టేళ్ల కోసం రైతుల అన్వేషణ మొదలవుతుంది. కందూరు, సోమల, సదుం, పీలేరు, అంగళ్లు, బైరెడ్డిపల్లె, బంగారుపేట(కర్ణాటక) తదితర ప్రాంతాల నుంచి మంచి గొర్రె పొట్టేళ్లను రైతులు కొనుగోలు చేస్తారు. అప్పటికే వీటి ధర రూ.10 వేల దాకా ఉంటుంది. ఆ తర్వాత వీటిని బాగా సంరక్షిస్తారు. పచ్చిగడ్డితో పాటు బూసా, గానుగపిండి, మొక్కజొన్న తదితరాలను పెట్టి ఏడాది పాటు సాకుతారు. దీంతో బక్రీద్ పండుగకల్లా కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు మంచి మాంసంతో సిద్ధమవుతాయి.

ఇక్కడి పొట్టేళ్ల మాంసం చాలా రుచి



నేను బైరెడ్డిపల్లి సంతంలో 30 ఏళ్ల నుంచి బక్రీద్ పొట్టేళ్లను కొంటున్నా. మా ప్రాంతంలో బైరెడ్డిపల్లి పొట్టేళ్లకు భలే డిమాండ్. వీటి మాంసం చాలా రుచిగా ఉంటుంది. ఫారాల్లో మేపే పొట్టేళ్లలో ఈ రుచి రాదు. అందుకే ఇక్కడి కొచ్చి కొంటుంటాం.

– అబ్దుల్ బాషా, గుడియాత్తం, తమిళనాడు

ఇక్కడి పొట్టేళ్లకు భలే డిమాండ్



ఈ ప్రాంతంలోని రైతులు కొండల్లో, బీడు భూముల్లో పొట్టేళ్లను మేపుతుంటారు. దీంతో ఫామ్‌లో ఉండే వాటి కన్నా వీటి శరీరం దృఢంగా ఉంటుంది. దీంతో పాటు రుచి బాగుంటుంది. ఇక మేకలను అటవీప్రాంతంలో మేపుతారు. అవి అడవుల్లోని పలురకాల ఔషధ గుణాలున్న ఆకులను తినడంతో వీటికీ డిమాండ్ ఎక్కువగా ఉంది.

– డా.వేణు, గొర్రెల పరిశోధన కేంద్ర చీఫ్ సైంటిస్ట్, పలమనేరు

విద్యుత్‌శాఖలో వింత ఆచారం

- ఏళ్ల తరబడి ఒకేచోట డిప్యుటేషన్లలో ఉద్యోగులు
- ఏటా ఆనవాయితీగా పొడిగింపు
- ఇకపై ఆ అవసరం కూడా లేకుండా ఆదేశాలు
- ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో విచిత్రం
- 35 మంది ఉద్యోగులు ఇక అక్కడే పర్మినెంట్



సాక్షి, అమరావతి: విద్యుత్‌శాఖలో డిప్యుటేషన్లపై పనిచేస్తున్నవారి విషయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఉద్యోగవర్గాల్లో సంచలనం సృష్టించింది. డిప్యుటేషన్‌పై వచ్చినవారు శాశ్వతంగా అక్కడే పనిచేసేలా జారీచేసిన ఈ ఉత్తర్వులు.. సంస్థ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి రగిలించాయి. ఒక ప్రభుత్వ విభాగంలో ఒక అధికారినిగానీ, సిబ్బందిగానీ వారి సొంత కారణాలతోనో, ఆ శాఖ అవసరానికో ఒకచోటు నుంచి మరోచోటుకి, ఒక శాఖ నుంచి మరో శాఖకు డిప్యుటేషన్‌పై పంపడం సాధారణంగా జరుగుతుంటుంది. దీనికి కాలాన్ని కూడా చాలా తక్కువగా నిర్ణయిస్తారు. అంటే మూడునెలల నుంచి ఏడాది పాటు తాత్కాలిక విధుల్లో కొనసాగేలా ఆ ఆదేశాలు ఇస్తుంటారు. అయితే ఒకసారి ఒక చోటుకిగానీ, ఒక శాఖకుగానీ వెళ్లిన వారిలో కొందరు అక్కడి నుంచి తిరిగిరావడానికి ఇష్టపడరు. మరికొందరు ఎప్పుడు వెనక్కి వచ్చేద్దామా అని చూస్తుంటారు. వారికిచ్చిన గడువు ప్రకారం డిప్యుటేషన్‌ను పొడిగించడం, రద్దుచేయడం వంటివి ఉన్నతాధికారులు చేస్తుంటారు. ఇదీ సాధారణంగా జరిగేది. రాష్ట్రంలో 11 జిల్లాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో మాత్రం ఇందుకు విరుద్ధంగా సరికొత్త ఆచారం పుట్టుకొచ్చింది.

ఇచ్చిపడేశారంతే..

ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం (కార్పొరేట్ ఆఫీస్) విశాఖపట్నంలో ఉంది. అక్కడ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్ హోదాల్లో 35 మంది ఉద్యోగులు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరిలో వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి దాదాపు తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న వారు ఉన్నారు. 2015 నుంచి 2023 వరకు ఏటా కొంతమంది చొప్పున వీరంతా వచ్చారు. ఏటా వీరి విజ్ఞప్తిని, సంస్థ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిప్యుటేషన్లు పొడిగిస్తున్నారు. కానీ సడన్‌గా ఏమైందో ఏమోగానీ.. ఇకపై వీరు ఎన్నాళ్లయినా కార్పొరేట్ ఆఫీసులోనే ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ 35 మందికి ఇకపై ఏటేటా డిప్యుటేషన్ పొడించాలా, రద్దుచేయాలా అనే చర్చే రాకుండా చేసేశారు. ఇకపై వీరంతా పర్మినెంట్‌గా కార్పొరేట్ కార్యాలయంలోనే విధులు నిర్వర్తించేలా సంస్థ ఫైనాన్స్, హెచ్‌ఆర్‌డీ విభాగం డైరెక్టర్ డి.చంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. దీంతో జిల్లాల నుంచి ఎవరైనా ఉద్యోగి విశాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లాలంటే ఇప్పుడున్నవారు ఉద్యోగ విరమణ చేస్తేగానీ కుదరదు. ఇలాంటి ముఖ్యమైన విధాన నిర్ణయాలు సీఎండీ స్థాయిలోనే తీసుకుంటారు. అలా కాకుండా డైరెక్టర్ స్థాయి అధికారి ఉత్తర్వులు ఇవ్వడం కూడా చర్చనీయాంశమైంది. ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం వెనుక ఏవో బలమైన కారణాలున్నాయనే చర్చ విద్యుత్ ఉద్యోగుల మధ్య జరుగుతోంది.

ఏటా ఎందుకని..

డిప్యుటేషన్లపై ఏటా ఫైలు నడపడం పెద్ద ప్రాసెస్‌గా ఉంటోంది. అలాంటిదేం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నాం. అయినప్పటికీ ఈ డిప్యుటేషన్లను ఎప్పుడైనా రద్దు చేసే అధికారం సంస్థకు ఉంది.

– ఐ.పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

కావేరికి గోదావరి.. ఇచ్ఛంపల్లి నుంచి లేనట్లే!

- గోదావరి ట్రిబ్యునల్ అవార్డు, ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలతో వెనక్కి తగ్గిన ఎన్‌డబ్ల్యూడీఏ
- సమ్మక్క బ్యారేజ్, కంతనపల్లి, పోలవరం నుంచి కావేరికి గోదావరిపై అధ్యయనం
- సమ్మక్క బ్యారేజ్ లేదా కంతనపల్లి నుంచి అనుసంధానం చేపట్టాలన్న తెలంగాణ



సాక్షి, అమరావతి : గోదావరి ట్రిబ్యునల్ అవార్డు.. ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాల నేపథ్యంలో ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలన్న ప్రతిపాదనను జాతీయ జలవనరుల అభివృద్ధి (ఎన్‌డబ్ల్యూడీఏ) సంస్థ పునఃసమీక్షిస్తోంది. ఇచ్ఛంపల్లికి దిగువన సమ్మక్క బ్యారేజ్, కంతనపల్లి, పోలవరం ప్రాజెక్టుల నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించడంపై తాజాగా అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇచ్ఛంపల్లి నుంచి 141.3 టీఎంసీల గోదావరి జలాలను కావేరికి తరలించేలా రెండున్నరేళ్ల క్రితం ప్రతిపాదించిన ఎన్‌డబ్ల్యూడీఏ.. పరీవాహక ప్రాంతం (బేసిన్) పరిధిలోని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపింది. కానీ, ఇచ్ఛంపల్లి నుంచి 85 టీఎంసీలను మించి ఉమ్మడి రాష్ట్రం వాడుకోవడానికి వీల్లేదని 1975, డిసెంబర్ 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇదే అంశాన్ని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో.. ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపడితే న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని న్యాయనిపుణులు స్పష్టంచేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు..

ఇచ్ఛంపల్లి వద్ద 118 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మాణానికి గోదావరి ట్రిబ్యునల్ అనుమతిచ్చింది. ఆ తర్వాత మహారాష్ట్ర, ఉమ్మడి మధ్యప్రదేశ్ అభ్యంతరాలతో ఇచ్ఛంపల్లి బ్యారేజ్ ఎత్తును 108 మీటర్లకు 1986–88లో తగ్గించారు. నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్ఛంపల్లి బ్యారేజ్ ఎత్తును 87 మీటర్లకు ఎన్‌డబ్ల్యూడీఏ తగ్గించింది. బ్యారేజ్ ఎత్తును 87 మీటర్లకు తగ్గించినా ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు గ్రామాలు ముంపునకు గురవుతాయి. దీనిపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం వ్యక్తంచేస్తోంది. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి బేసిన్‌లో ఇంద్రావతి సబ్ బేసిన్‌లోని తమ కోటాలో వాడుకోని జలాలను కావేరికి ఎలా తరలిస్తారని ఎన్‌డబ్ల్యూడీఏని నిలదీసింది. కాదూ కూడదని తరలిస్తే న్యాయపోరాటం చేస్తామని తేల్చిచెప్పింది.

దిగువన కట్టాలని తెలంగాణ ప్రతిపాదన..

ఇక ఇచ్ఛంపల్లికి 24 కిమీల దిగువన తెలంగాణ సర్కార్ ఇప్పటికే గోదావరిపై సమ్మక్క బ్యారేజ్‌ను నిర్మించింది. గోదావరిపై ఇచ్ఛంపల్లి వద్ద బ్యారేజ్ నిర్మిస్తే.. గరిష్ఠంగా వరద వచ్చినప్పుడు ఆకస్మికంగా దిగువకు విడుదల చేస్తే సమ్మక్క బ్యారేజ్‌కు ప్రమాదం వాటిల్లే అవకాశముందని తెలంగాణ సర్కార్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇచ్ఛంపల్లి నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజ్ లేదా కంతనపల్లి నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్ సర్కార్ పోలవరం నుంచి అనుసంధానం చేపట్టాలని సూచించింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సర్కార్‌ల అభ్యంతరాలతో ఇచ్ఛంపల్లి నుంచి కావేరికి గోదావరి తరలింపుపై ఎన్‌డబ్ల్యూడీఏ పునరాలోచనలో పడింది.

గుడి కోసం టీడీపీ–జనసేన కుమ్ములాట

- తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో రెండు పార్టీల మధ్య ఆధిపత్య పోరు
- తాళాల కోసం తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు
- పిఠాపురం కూటమి నేతల్లో తగ్గని వివాదాలు



ఆలయం వద్ద టీడీపీ జనసేన నేతల బాహాబాహీ

పిఠాపురం/సాక్షి, అమరావతి : కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో రెండ్రోజుల క్రితం టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కారుపై జనసేన శ్రేణుల దాడి ఘటన మరువక ముందే.. అదే మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణాదేవి ఆలయ నిర్వహణ విషయంలో రెండు పార్టీలు ఆదివారం మళ్లీ కుమ్ములాడుకున్నాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలు తమదేనని టీడీపీ నేతలు.. కాదు తమదేనంటూ జనసేన నేతలు రచ్చకెక్కారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఈ ఘటన వివరాలివీ..తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ నిర్వహణ విషయంలో గ్రామంలో పూర్వం నుంచీ ఒక ఆనవాయితీ ఉంది. నియోజకవర్గంలో ఎవరు ఎమ్మెల్యేగా నెగ్గితే ఆ పార్టీకి చెందిన నేతలు ఐదేళ్లు ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటారు. వారి ఆధ్వర్యంలోనే ఉత్సవాల వంటి అన్ని కార్యక్రమాలూ నిర్వహిస్తారు. ఇప్పటివరకూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీకి చెందిన నాయకులు ఆలయ బాధ్యతలు చూసేవారు. ఇటీవల టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆలయ బాధ్యతలు అప్పగించేస్తామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు టీడీపీ, జనసేన నాయకులకు సమాచారం ఇచ్చారు. ఆలయం వద్దకు వస్తే అందరి సమక్షంలో ఆలయ తాళాలు ఇచ్చేస్తామని చెప్పారు. దీంతో కూటమి నేతలు ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వచ్చారు. పిఠాపురంలో జనసేన నెగ్గడంతో ఆ పార్టీకి చెందిన నేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అందరి సమక్షంలో ఆలయ తాళాలు అందజేశారు. దీనికి గ్రామస్తులందరూ ఆమోదం తెలిపారు.

వివాదానికి టీడీపీ ఆజ్యం..

అయితే, ఈ విషయం టీడీపీ నియోజకవర్గ నేతకు తెలిసింది. జనసేనను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న ఆ నేత టీడీపీ వారికే ఆలయ పెత్తనం ఇచ్చేలా పట్టుబట్టాలని ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దీంతో అప్పటివరకూ అన్నింటికీ అంగీకారం తెలిపిన టీడీపీ నేతలు.. ఒక్కసారిగా వివాదానికి తెరలేపారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల్లో నెగ్గింది జనసేన అయినా గెలిపించింది తామేనని.. అందుకే తమకే ఆలయ తాళాలు అప్పగించాలని టీడీపీ నాయకులు ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో జనసేన–టీడీపీ వర్గాల మధ్య ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలూ బాహాబాహీకి దిగడంతో ఒక దశలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు నేతృత్వంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, ఇరువర్గాలనూ చెదరగొట్టారు. అయినప్పటికీ తాళాలిచ్చే వరకూ కదిలేదిలేదని టీడీపీ నేతలు ఆలయం వద్ద బైఠాయించారు. ఇరువర్గాలతో చర్చించిన పోలీసులు వివాదం తేలేవరకు ఆలయ తాళాలు అధికారుల వద్ద ఉండేలా ఒప్పించారు. అనంతరం తాళాలను స్థానిక వీఆర్‌ఓకు అప్పగించారు. తమకు ఎలాగూ ఆలయం దక్కేదిలేదని గ్రహించిన టీడీపీ నేతలు ఆలయాన్ని దేవదాయ శాఖకు అప్పగించాలనే డిమాండును తెరపైకి తీసుకువచ్చారనే ప్రచారం గ్రామంలో జోరుగా జరుగుతోంది. అపర్ణాదేవి ఆలయం దేశంలోనే పేరొందింది. ఇక్కడకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం అనేకమంది భక్తులు, వీఐపీలు వస్తూంటారు. ఆదాయం కూడా అంతలా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆలయంపై పెత్తనం తమకు దక్కకపోతే.. జనసేనకూ దక్కకూడదని భావించిన టీడీపీ నేతలు.. ఈ ఆలయాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

సంయమనం పాటించాలి : నాగబాబు

మరోవైపు.. ఈ ఘటనపై జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు స్పందిస్తూ.. కూటమి సభ్యుల్లో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరిగిన ఘటన వివరాలు సేకరిస్తున్నామని, ఇందులో తమ పార్టీ వారు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాటిపర్తిలో ఆదివారం చోటుచేసుకున్న ఘటనపై కూడా నాయకులు చర్చించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. పదిరోజుల్లో పవన్ పిఠాపురం వస్తారని చెప్పారు.

అపరాలలోనూ విత్తన మార్పిడి

మినుము, పెసలు, కందులులో కొత్త రకాలు

- శనగలో కొత్త వంగడాలకు ప్రోత్సాహం
- ప్రస్తుత ఖరీఫ్ నుంచే విత్తన మార్పిడి
- దశలవారీగా కొత్త వంగడాలు

సాక్షి, అమరావతి: విత్తన మార్పిడిపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టింది. ఏళ్ల తరబడి సాగులో ఉన్న రకాల స్థానంలో కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో విస్తారంగా సాగయ్యే అపరాలతో పాటు రబీ సీజన్‌లో ఎక్కువగా సాగయ్యే శనగలో కొత్త వంగడాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఖరీఫ్‌లో వరి తర్వాత ఎక్కువగా 5.9 లక్షల ఎకరాల్లో కందులు, 1.5 లక్షల ఎకరాల్లో మినుములు, పెసలుతో పాటు ఇతర అపరాలు సాగవుతుంటాయి. రబీలో వరి తర్వాత 10.92 లక్షల ఎకరాల్లో శనగ, 7.25 లక్షల ఎకరాల్లో మినుము, 1.75 లక్షల ఎకరాల్లో పెసలు, మరో 1.10 లక్షల ఎకరాల్లో ఇతర అపరాలు సాగవుతుంటాయి. అపరాలు, శనగలలో కొన్ని రకాలు 30 ఏళ్లకు పైబడి సాగులో ఉన్నాయి. ప్రధానంగా ఖరీఫ్‌లో కందులులో ఎల్‌ఆర్‌జీ 52 (2015) వంగడం 1.50 లక్షల ఎకరాలలో సాగవుతుండగా, ఎల్‌ఆర్‌జీ 41 రకం (2007) 29వేల ఎకరాలు, ఆషా (1992) వంగడం 11వేల ఎకరాల్లో సాగవుతోంది. మినుములో పీయూ–31 (2005) రకం 58 వేల ఎకరాల్లో సాగవుతోంది. రబీలో శనగలు అత్యధికంగా 1999లో విడుదలైన జేజీ–11 రకం ఏకంగా 7.25 లక్షల ఎకరాల్లో, కేఏకే–2 (2000) రకం 44 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ రకాలు చీడ పీడలను తట్టుకోలేకపోతున్నాయి. తుపాన్లు, వర్షాల సమయంలో ముంపునకు గురై రైతులకు భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ఇటీవల విడుదలైన తెగుళ్లను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది.

దశలవారీగా విస్తరణ

డీఏఏటీఐ, కేవీకే శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో జిల్లా స్థాయిలో నిర్వహించిన సదస్సులతో కొత్త విత్తనాల సాగుపై వ్యవసాయ శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. దశలవారీగా కొత్త రకాల సాగును విస్తరించనుంది. 2024–25 సీజన్‌లో 10 శాతం, 2025–26 సీజన్‌లో 15 శాతం, 2026–27లో 25 శాతం విస్తీర్ణంలో విత్తన మార్పిడి చేయనున్నారు. తరువాత సంవత్సరాల్లో ఇదే విధానం కొనసాగుతుంది. ఈ విత్తనాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. కొత్త రకాల ప్రత్యేకతను అందరికీ అర్థమయ్యే రీతిలో వాల్ పోస్టర్లు, కరపత్రాలు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతుల సందేశాలతో కూడిన వీడియోలు, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివరిస్తారు.

మినుములో ప్రత్యామ్నాయ రకాలు

- పీయూ–31కు బదులుగా ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌బీజీ 884, టీబీజీ 104, వీబీఎన్8, ఎల్‌జీబీ 904, జీబీజీ1, టీబీజీ 129, ఎల్‌బీజీ 787, ఎల్‌బీజీ 752 ప్రవేశపెడతారు. రబీలో ఎల్‌బీజీ 752 మినహా మిగిలిన వంగడాల సాగును ప్రోత్సహిస్తారు.
- తరచూ తెగుళ్ల బారిన పడుతున్న ఐపీయూ 2–43 కి ప్రత్యామ్నాయంగా రెండు సీజన్లలో ఎల్‌బీజీ 904 రకం
- ఎల్‌బీజీ 752కు బదులుగా ఖరీఫ్‌లో టీబీజీ 129, రబీలో టీబీజీ 104, వీబీఎన్ 8, ఎల్‌బీజీ 904, జీబీజీ1, ఎల్‌బీజీ 787



- టీ–9కు బదులుగా రెండు సీజన్‌లలో ఎల్‌బీజీ 884 రకాన్ని, టీబీజీ 104కు బదులుగా ఎల్‌బీజీ 904 రకం

కందులులో ప్రత్యామ్నాయ వంగడాలు

- ఎల్‌ఆర్‌జీ 52 స్థానంలో ఖరీఫ్‌లో టీఆర్‌జీ 59 (తిరుపతి కంది), ఎల్‌ఆర్‌జీ 105, ఎల్‌ఆర్‌జీ 133–33, పీఆర్‌జీ 176 రకాలను, రబీలో ఎల్‌ఆర్‌జీ 105 (కృష్ణ) రకాలను ప్రవేశపెడతారు.
- ఎల్‌ఆర్‌జీ 41 స్థానంలో ఖరీఫ్‌లో పీఆర్‌జీ 158, టీఆర్‌జీ 59, ఎల్‌ఆర్‌జీ 105, ఎల్‌ఆర్‌జీ 133–33 (సౌభాగ్య), పీఆర్‌జీ 176, ఎల్‌ఆర్‌జీ 52 రకాలను, రబీలో ఎల్‌ఆర్‌జీ 105 రకాలు
- ఐసీపీహెచ్ 2740, ఐసీపీఎల్ 87119, పీఆర్‌జీ 158 రకాలకు బదులుగా రెండు సీజన్‌లలోనూ ఎల్‌ఆర్‌జీ 105 రకం
- ఐసీపీహెచ్ 87063 కు బదులుగా రెండు సీజన్‌లలోనూ ఎల్‌ఆర్‌జీ 105, ఎల్‌ఆర్‌జీ 133–33 రకాలను ప్రవేశపెడతారు.





ఏపీ సీడ్స్ ద్వారా సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి

బ్రీడర్ విత్తనాన్ని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉత్పత్తి చేసింది. ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో బ్రీడర్ సీడ్ నుంచి మూల విత్తనాన్ని పండిస్తారు. ఈ మూల విత్తనాన్ని ఏపీ సీడ్స్ ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో నాటి సర్టిఫైడ్ సీడ్‌ను పండిస్తారు. వీటిని ఏపీ విత్తన ధ్రువీకరణ అథారిటీ ధ్రువీకరిస్తుంది. బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ముందుగా ప్రాధాన్యతనిస్తారు. పూర్తిస్థాయిలో విత్తనం అందుబాటులోకి తెచ్చిన తర్వాత సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తారు.

పెసలులో ప్రత్యామ్నాయ రకాలు:



- ఐపీఎం 2–14కు ప్రత్యామ్నాయంగా రెండు సీజన్‌లలో ఎల్‌జీజీ 574, ఎల్‌జీజీ 607,ఎల్‌జీజీ 630 ఎల్‌జీజీ 600 రకాలు. రబీలో వీటితో పాటు అదనంగా విరాట్, శిఖ రకాలు
- ఎల్‌జీజీ 407కు ప్రత్యామ్నాయంగా రెండు సీజన్‌లలో ఎల్‌జీజీ 607 రకాలు, ఎల్‌జీజీ 460కు బదులుగా ఐపీఎం 2–14, ఎల్‌జీజీ 630, ఎల్‌జీజీ 607 రకాలు

శనగలో ప్రత్యామ్నాయ రకాలు



శనగలో కేఏకే 2కు బదులుగా ఎన్‌బీఈజీ 119 రకాన్ని, జేజీ 11కు బదులుగా ఎన్‌బీఈజీ 776 రకాలు, ఎన్‌ఈజీ 452 (నంద్యాల గ్రామ్ 452), ఎన్‌బీఈజీ 810 (నంద్యాల గ్రామ్ 810), ఎన్‌బీఈజీ 857 (నంద్యాల గ్రామ్) వంటి కొత్త వంగడాల సాగును ప్రోత్సహించనున్నారు



గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి.. ఎందుకోసం?

గృహప్రవేశం చేయాలి. అప్పుడు యజుర్వేదం అంతా మనకు వచ్చా, రాదా అన్న దానితో సంబంధం లేదు. గృహప్రవేశ సందర్భంలో రాముడేం చేసాడో ఆ ఘట్టం చదువుకుంటే చాలు... ఓహో, గృహప్రవేశం ఇలా చేయాలన్న మాట.. అన్నది తెలుస్తుంది. తండ్రిగారికి తద్దినం పెట్టాల్సి వస్తే రాముడేం చేశాడో చదువుకుంటే సరిపోతుంది. అది పెట్టవలసి వచ్చినప్పుడు ఇలా పెట్టాలని అర్థమవుతుంది. అందుకే వేదం రామాయణంగా ప్రవర్తించింది.

చంద్రవంశాన్ని అంతటినీ వ్యాసుడు రచించాడు. సూర్యవంశాన్ని అంతటినీ కూడా వాల్మీకి వర్ణించాడు. సూర్యుడు, చంద్రుడు పగలూ రాత్రి ప్రకాశిస్తారు. ఒక పగలు, ఒక రాత్రి కలిస్తే ఒక రోజు పూర్తవుతుంది. వాఙ్మయంలో రామాయణం, భారతం ఇతర పురాణాలను వాల్మీకి, వ్యాసుడు అందించారు. స్వార్థంతోనో, ప్రత్యుపకారం ఆశించో కాక దీనివల్ల ధర్మానుష్ఠాన పద్ధతులను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో విడమరిచి చెప్పకపోతే జనసామాన్యానికి ఎలా తెలుస్తుందనే సదుద్దేశంతో వారు మనకు ఈ మహోపకారం చేసారు.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వివాహం ఎంత గొప్పది! వివాహం అంటేనే విశిష్టమైనది–అని. దానిని మనకు సంప్రాప్తింప చేయడానికి జరిపే సంస్కారమే వివాహం. అది ఏదో సరదాకోసం కాదురా నాయనా, వివాహం చేసుకుంటా నంటున్నావు కదా, ముందు దానిగురించి, దానిలోని ధర్మసూక్ష్మాలను గురించి తెలుసుకో. వివాహం అంటే విశిష్టమైనదానిని పొందుట. మరి ఆ విశిష్టమైనదేది? అదే మోక్షం. దీనిని పొందడానికి యోగ్యమైనది ధర్మానుష్ఠానం. అది సక్రమంగా జరగకుండా దానికి అడ్డుపడుతున్నవి ఏవి? అర్థకామాలు రాగద్వేషాలయి పాపపుణ్యాలకు, పునర్జన్మలకు కారణమవుతాయి. అలాకాకుండా దానిని ధర్మబద్ధం చేసి పాశాలు విడిపోవడానికి సంసార ప్రవేశం జరగాలి. అటువంటి గృహస్థాశ్రమంలోకి నీవు ప్రవేశిస్తున్నావు. అలా ప్రవేశించి రాముడేం చేసాడో తెలుసా? సీతారామకళ్యాణ ఘట్టం చూడు. అక్కడ సీతమ్మ ఏం చేసింది ? అసలు పెద్దవాళ్ళనే వాళ్ళు పెళ్ళికూతురిని, పెళ్లికొడుకుని కూర్చోబెట్టి ఏం మాట్లాడారో పరిశీలించు. పెద్దరికం అంటే ఏమిటో కూడా తెలుస్తుంది. ఇవన్నీ తెలిస్తే సంసారంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి, కుటుంబ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతో రుషులు దేశకాలాలతో సంబంధం లేకుండా సర్వకాలాల్లో సర్వజనులకు ఉపయోగపడే విధంగా వాటిని అందించారు. అటువంటి రుషుల రుణం మనకు జన్మతః ఉంది.

మీరు ఎంతో చదువుకున్నారు... సరే. మంచిదే. నేను చదువును తక్కువ చేసి చెప్పడం లేదు. కానీ చదువుతో పాటుగా నిత్యజీవితంలో మనిషి మనిషిగా ఉండడానికి కావలసిన మానవత్వాన్ని నిలబెట్టడం చాలా అవసరం. అలా అది నిలబడాలంటే... రామాయణం, భారతం తదితర గ్రంథాలను బాగా పరిశీలించాలి. అవి నిత్యపారాయణకు యోగ్యత ఉన్న గ్రంథాలు. వాటిని కనీసం రోజుకో అధ్యాయం చొప్పున అయినా చదువుకుంటూ ఉండాలి. ఇంటిపట్టున పెద్దవాళ్ళు పిల్లలతో వాటిగురించి తరచూ మాట్లాడుతూ ఉండాలి. దానివల్ల ధార్మిక జీవనం అలవడడమే గాక, మనుషుల్లో మానవత్వం మిగులుతుంది. అది లేనప్పుడు మీరు సమకూర్చుకున్న జ్ఞానం, ప్రతిభాపాటవాలు సమాజానికి ప్రమాదకరంగా మారవచ్చు.

ఆధ్యాత్మికథ

దృష్టిని బట్టి సృష్టి



ఉత్తర భారత దేశానికి చెందిన ఒక ప్రొఫెసర్ స్వామి వారి దర్శనార్థం తిరుపతి వెళ్ళాడు. తనతో పాటు సహాయకుడిగా పరిశోధక విద్యార్థిని కూడా వెంట తీసుకు వచ్చాడు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి గుండా తిరుమలకు కాలినడకన వెళ్ళాలనేది ప్రొఫెసర్ గారి ఆలోచన. అలిపిరికి వెళ్ళి ఎత్తైన శేషాచల శిఖరాన్ని చూశారు. సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్న ఏడుకొండల్ని చూసి భక్తి భావంతో దణ్ణం పెట్టుకున్నారు. పాదాల మండపం వద్ద శ్రీవారి లోహ పాదాలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఉండగా పరిశోధక విద్యార్థి చిన్నగా ప్రొఫెసర్‌ని ఇలా అడిగాడు. ''దేవుడు నిజంగా ఉన్నాడంటారా?'' అని.

ప్రొఫెసర్ నవ్వి ''దారిలో కనిపిస్తాడు పద!'' అని చెప్పి కాలి నడకకు పురమాయించాడు.

అలిపిరినుంచి ఆనంద నిలయుని సన్నిధికి దారి తీసే ఆ పడికట్ల దోవలో ప్రకృతి అందాలను వీక్షిస్తూ నడక ప్రారంభించారు. తలయేరు గుండు, గాలి గోపురం, ఏడవ మైలు ప్రసన్నాంజనేయ స్వామి, అక్కగార్ల గుడి, అవ్వాచారి కోన... దాటి మోకాలి మెట్టు చేరారు.

తిరుమల కొండ 'ఆదిశేషుని అంశ' అని భక్త జన విశ్వాసం. అందుకే చెప్పులు లేకుండా కొండ ఎక్కుతారు భక్తులు. ఈ కొండను పాదాలతో నడిచి అపవిత్రం చేయకూడదని శ్రీరామానుజులు, హథీరాంజీ బావాజీ మోకాళ్ళ మీద నడిచారని చెబుతారు. అప్పటినుంచి అది మోకాలి మెట్టు అయ్యిందని కూడా తెలుసుకున్నారు. అక్కడ మెట్లు నిలువుగా మోకాలి ఎత్తు ఉండటం వల్ల మోకాళ్ళు పట్టుకుపోసాగాయి పరిశోధక విద్యార్థికి.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువైన ఆ విద్యార్థి గట్టిగా ''దేవుడు కనిపిస్తున్నాడు!'' అని చెప్పాడు.

చిన్న నవ్వు నవ్విన ప్రొఫెసర్, ''అనుకున్నది అనుకున్నట్లు ఎవరికీ జరగదు. అలా జరిగితే ఎవ్వరూ చెప్పిన మాట వినరు. తలచినట్లే అన్నీ జరిగితే... మనిషి దేవుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. కష్టాలు, కన్నీళ్లు లేకుంటే తనంత గొప్పవాడు లేడని విర్రవీగుతాడు. అహాన్ని తలకి ఎక్కించుకున్నవాడు తనే దేవుడని చెప్పి ఊరేగుతాడు. జీవితం కష్టసుఖాల మయం కాబట్టే, మనిషి ఆ అతీత శక్తిని ఆరాధిస్తున్నాడు! అందుకే అలిపిరి వద్ద నేల మీద నడిచేటప్పుడు నీకు దేవుడి ఉనికి ప్రశ్నార్థకమయ్యింది. మోకాలిమెట్టు దగ్గరికి వచ్చేసరికి దేవుడు ఉన్నాడని అనిపించింది'' అని చెప్పి గబగబా మెట్లు ఎక్కసాగాడు.

'దృష్టిని బట్టి సృష్టి' అని తెలుసుకున్న విద్యార్థి గోవింద నామస్మరణ చేస్తూ ప్రొఫెసర్ వెనుకనే నడవసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

మంచిమాట

పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం?



''పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం'' అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్న ప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది.

ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీలైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు.

1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చనిపోయారు. కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు.

దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్ల కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది.

ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడ పీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు.

సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడేనేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

– డా. ఎన్. అనంత లక్ష్మి

సినిమా



● ఎన్టీఆర్

గోవాలో ఆటా పాటా...

మళ్లీ గోవా వెళ్లాడు దేవర. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్, కొంత టాకీ పార్ట్, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది మార్చిలో 'దేవర' యూనిట్ గోవాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఇప్పుడు మళ్లీ గోవాలో షూటింగ్ జరుగుతోంది.



● అమితాబ్

సీక్వెల్ సెట్‌లో...

గుజరాతీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అమితాబ్ బచ్చన్. 2022లో అమితాబ్ ఓ కీలక పాత్రలో నటించిన 'ఫక్త్ మహిళా మాటే' చిత్రానికి సీక్వెల్ ఇది. యశ్ సోనీ, దీక్షా జోషి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఫక్త్ మహిళా మాటే'కు మంచి ప్రేక్షకాదరణ దక్కింది. జై బోదాస్ దర్శకత్వంలో ఆనంద్ పండిట్, వైశాల్ షా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఫక్త్ పురుషో మాటే' అనే సినిమాను ఆరంభించారు. అమితాబ్, యశ్ సోనీ, మిత్ర గాద్వీ, ఇషా కన్సారా, దర్శన్ జరీవాలా సీక్వెల్‌లో ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఈ సీక్వెల్‌ని పార్థ్ త్రివేదీతో కలిసి జై బోదాస్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''అమితాబ్ బచ్చన్‌గారితో ఓసారి పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ వర్క్ చేయాలనుకుంటారు. అమితాబ్‌గారి ఎనర్జీ, అంకితభావం సెట్స్‌లో ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది'' అని పేర్కొన్నారు నిర్మాత ఆనంద్ పండిట్. ఈ సంగతి ఇలా ఉంచితే... మహిళల మనసుల్లో ఏముందో తెలుసుకోగల శక్తులు ఓ కుర్రాడికి వస్తాయి. వాటితో ఆ యువకుడు ఏం చేశాడు? విడిపోతున్న ప్రేమికులను ఎలా కలిపాడు? అనే అంశాలతో 'ఫక్త్ మహిళా మాటే' చిత్రం సాగుతుంది. ఇక సీక్వెల్ మగవారి కోణంలో ఉంటుందని టైటిల్ స్పష్టం చేస్తోంది.

ఆమెతో నమ్మకం మొదలవుతుంది



● దీపికా పదుకోన్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, దీపికా పదుకోన్ లుక్‌ను విడుదల చేసింది. 'ది హోప్ బిగిన్స్ విత్ హర్' (ఆమెతో నమ్మకం మొదలవుతుంది) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన దీపిక లుక్ నెట్టింట వైరల్‌గా మారింది. ''సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా 'కల్కి 2898 ఏడీ' రూపొందింది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరువేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.

విలన్ వచ్చేశాడు

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలోని విలన్ పాత్రకు బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, సెట్స్‌లో విద్యుత్ జమాల్ పాల్గొన్న వీడియోను కూడా షేర్ చేశారు. ''నా స్నేహితుడు విద్యుత్ జమాల్‌తో కలిసి మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు మురుగదాస్. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ 'తుపాకీ'లో విద్యుత్ జమాల్ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.



● విద్యుత్ జమాల్

ఈ నెలలోనే లాక్‌డౌన్!



● అనుపమా పరమేశ్వరన్

ఈ నెలలోనే లాక్‌డౌన్ అంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. కానీ కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే... ఆమె చెబుతున్నది 'లాక్‌డౌన్' సినిమా గురించి. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలో అనిత అనే పాత్రలో అనుపమా పరమేశ్వరన్ నటించినట్లుగా తెలుస్తోంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. లాక్‌డౌన్ కష్టాలతోపాటు కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఎన్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: వీజే సాబు జోసెఫ్.

టీజర్ రొమాంటిక్‌గా ఉంది

– అక్కినేని అమల



● బాల రాజశేఖరుని, అమల

చైతన్యా రావ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అక్కినేని అమల మాట్లాడుతూ– ''తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలన్న బాల రాజశేఖరుని ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. మా అన్నపూర్ణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బందిని కూడా ఈ మూవీలోకి తీసుకున్నందుకు హ్యాపీగా ఉంది. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. నేటి సమాజంలోని వివాహ బంధాల గురించి ఒక బలమైన కథను ప్రేక్షకులకు చూపించబోతున్నట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''రొమాంటిక్ కామెడీగా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సుచిన్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు మా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు'' అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని, అరవింద్ కృష్ణ, అలీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కల్యాణీ మాలిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్పీ పట్నాయక్, కెమెరా: శిష్లా వీఎమ్‌కే.

భూగోళానికే నా చెలి అందం

● శ్రీకమల్, తాన్వీ



''ప్రపంచానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం... ఇంతందాన్ని ఎవరైనా చూశారా..'' అంటూ సాగే పాట 'ఉషా పరిణయం' సినిమాలోనిది. 'నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి చిత్రాలను తెరకెక్కించిన కె. విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉషా పరిణయం'. ఈ మూవీలో ఆయన తనయుడు శ్రీకమల్ హీరోగా నటించారు. తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకాశానికే జాబిలి అందం...' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్ పాడిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ''ప్రేమకు నేనిచ్చే నిర్వచనం ఈ సినిమా. అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు కె. విజయభాస్కర్.

● అవినాష్, స్రిమాన్



మూడు షెడ్యూల్స్‌లో...

అవినాష్ తిరువీధుల, స్రిమాన్ చౌదరి జంటగా కొత్త సినిమా షురూ అయింది. కార్తీ దర్శకత్వంలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్‌పీపై శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాష్ బుయాని, అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ దర్శకత్వం వహించారు. దర్శకుడు కార్తీ మాట్లాడుతూ– ''కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. నేడు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం'' అన్నారు. ''మంచి సినిమా తీయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చాం'' అన్నారు శాంతనూపతి. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు అంబికా కృష్ణ, దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌నాయుడు, రచయిత విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ. విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: రాంబాబు కుంపట్ల.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
10-6-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,619	76,693
నిఫ్టీ ▲	469	23,290

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,133	▽	40
డోజోన్స్	38,799	▽	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▽	40
డాక్స్	18,557	▽	95
షాంఘై	3,051	▲	2
నికాయ్	38,684	▽	20

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.54	85.22
£	బ్రిటన్ పౌండ్	104.33	109.19
€	యూరో	88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)	41.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.23	58.01
S$	సింగపూర్ డాలర్	59.69	64.36
SAR	సౌదీ రియాల్	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	21.81	23.60
¥	చైనా యువాన్	10.39	12.46

బంగారం బంగారమే



కాలంతో పాటే దేశీ కరెన్సీ విలువ తరిగిపోతుంటుంది. కానీ, కాలంతోపాటే విలువ పెంచుకుంటూ వెళ్లే వాటిల్లో బంగారం కూడా ఒకటి. అందుకే ప్రతి ఒక్కరి పెట్టుబడుల్లో బంగారానికి (గోల్డ్) తప్పక చోటు ఇవ్వాలి. ఇటీవలి కాలంలో బంగారంలో మంచి ర్యాలీ చూస్తున్నాం. ప్రతి ఏటా పసిడి ఇదే మాదిరి పరుగు పెట్టుకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే విషయంలో నిజంగా 'బంగారమే' అని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. 2017–18 సంవత్సరం సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసినవారికి గడిచిన ఐదేళ్లలో ఏటా 16.5 శాతం రాబడి వచ్చింది. సంప్రదాయ డెట్ సాధనాల కంటే రెట్టింపు రాబడి బంగారంలో రావడం అంటే మామూలు విషయం కాదు. ఈక్విటీల స్థాయిలో బంగారం రాబడి ఇవ్వడం విశేషం. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలి. ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ ప్రయోజనమో తెలియజేసే కథనమే ఇది.



వివిధ సాధనాలు

బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఆభరణాలను పెట్టుబడిగా చూడొద్దు. ధరించడానికి కావాల్సినంత వరకే ఆభరణాలకు పరిమితం కావాలి. పెట్టుబడి కోసం అయితే ఎలక్ట్రానిక్ రూపంలో ఎన్నో సాధనాలు ఉన్నాయి. వీటిల్లో తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్, సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు), డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్న పలు రకాల సాధనాలు. వీటన్నింటిలోకి ఎస్‌జీబీలు ఎక్కువ ప్రయోజనకరం.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

స్టాక్స్ మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నిత్యం ట్రేడ్ అవుతుంటాయి. ఇందులో చార్జీలు, వ్యయాలు చాలా తక్కువ. భౌతిక బంగారం ధరలకు అనుగుణంగానే గోల్డ్ ఈటీఎఫ్ ధర ఏరోజుకారోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మారుతుంటుంది. నచ్చినప్పుడు కొనుగోలు చేసుకుని, అవసరమైనప్పుడు సులభంగా విక్రయించుకోవచ్చు. వీటిల్లో ఎక్స్‌పెన్స్ రేషియో రూపంలో ఏటా నిర్ణీత మొత్తాన్ని చార్జీగా తీసుకుంటారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. ఉదాహరణకు ఎల్ఐసీ గోల్డ్ ఈటీఎఫ్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో 0.41 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశారనుకోండి. దీనిపై 0.41 శాతం ప్రకారం రూ.410ని ఎక్స్‌పెన్స్ రేషియో కింద ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంది. ఇది కూడా సంవత్సరానికి ఒకే విడతగా కాకుండా, ఏ రోజుకారోజు ఇన్వెస్టర్ యూనిట్ల నుంచి తీసుకుంటుంది. పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ ఉండదు. పెట్టుబడులపై వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి చూపించి, తాము ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ మేరకు పన్ను చెల్లించాలి.

గోల్డ్ ఫండ్స్

ఇన్వెస్టర్ల పెట్టుబడులను తీసుకెళ్లి గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడమే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ చేసే పని. కనుక వీటికి బదులు నేరుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనే పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కానీ, కొందరికి గోల్డ్ మ్యూచువల్ ఫండ్సే అనుకూలం. ఎలా అంటే.. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారం పరిమాణంలో ట్రేడవుతుంటుంది. కనుక ఎంతలేదన్నా ఒక గ్రాము బంగారం స్థాయిలో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. అదే గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడికి డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కొనుగోలు చేసిన యూనిట్లు డీమ్యాట్ ఖాతాకే జమ అవుతాయి. కానీ గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. కాకపోతే గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునే వారికి కొంచెం అదనపు భారం పడుతుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల అక్కడ ఎక్స్‌పెన్స్ రేషియో.. తిరిగి గోల్డ్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో పేరిట రెండు సార్లు చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వీటిల్లో పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని రిటర్నుల్లో చూపించి, తమ శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి.



డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం, పలు ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు వీలు కల్పిస్తున్నాయి. రూపాయి నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించుకోవచ్చు. ఇన్వెస్టర్ కొనుగోలు చేసిన పరిమాణం మేర అసలైన బంగారం ఖజానాల్లో భద్రపరుస్తారు. కొంత మొత్తం సమకూరిన తర్వాత (కనీసం 10 గ్రాములు అంతకుమించి) భౌతిక రూపంలో తీసుకోవచ్చు. లేదా ఎంపిక చేసిన జ్యుయలరీ సంస్థల్లో ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు. అవసరం ఏర్పడితే దీనిపై రుణం పొందొచ్చు. ఇందులో కాస్త చార్జీలు ఎక్కువ. ఒక ఇన్వెస్టర్ ఒక ప్లాట్‌ఫామ్‌లో గరిష్టంగా రూ.2లక్షలు మించి కొనుగోలు చేయలేరు. ఆర్‌బీఐ, సెబీ తదితర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ వీటిపై ఉండదు. ఇందులో వచ్చే లాభాలు సైతం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.



బంగారం బాండ్లు

భౌతిక బంగారంపై పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించేందుకు.. డిజిటల్ రూపంలో బంగారంపై పెట్టుబడులను, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సాధనమే సావరీన్ గోల్డ్ బాండ్స్ పథకం. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ఒకటికి మించిన పర్యాయాలు ఎస్‌జీబీలను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ విక్రయిస్తుంటుంది. ఒక గ్రాము డినామినేషన్ రూపంలో బాండ్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇష్యూ సమయంలో ఒక గ్రాము ధర ఎంతన్నది ఆర్‌బీఐ ప్రకటిస్తుంటుంది. బ్యాంక్‌లు, బ్రోకరేజీ సంస్థలు, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కొనుగోలుకు అవకాశం కల్పిస్తుంటాయి. ఈ బాండ్ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఇందులో పెట్టుబడిపై ఏటా 2.5 శాతం చొప్పున ఎనిమిదేళ్ల పాటు వడ్డీని ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత బంగారం మార్కెట్ ధర ప్రకారం ఇన్వెస్టర్‌కు ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. లాభంపై పన్ను లేకపోవడం, ఏటా 2.5 శాతం రాబడి వల్ల అన్నింటిలోకి ఇది మెరుగైన సాధనం అని చెప్పుకోవాలి. ఇక ఎస్‌జీబీపై ఏటా వచ్చే 2.5 శాతం వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. రిటర్నుల్లో 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్'లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడి కొనసాగించినట్టయితే.. వచ్చే మూలధన లాభంపై పన్ను ఉండదు. మధ్యలోనే వైదొలిగితే లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. ''ఏడాదిలోపే విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించేట్టు అయితే లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణాన్ని తీసేసే ఇండెక్సేషన్ ఎంపిక చేసుకుంటే కనుక 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది''అని ఆర్ఎస్ఎం ఇండియా వ్యవస్థాపకుడు సురేష్ సురానా తెలిపారు. ఈ బాండ్‌కు ప్రభుత్వ హామీ ఉంటుంది.

రాబడులు

బంగారంపై పెట్టుబడి దీర్ఘకాలంలో డెట్ కంటే మెరుగైన రాబడే ఇచ్చినట్టు చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 20 ఏళ్లలో ఏటా 11 శాతం కాంపౌండెడ్ రాబడిని బంగారం ఇచ్చింది.

సంవత్సరం వారీ 10 గ్రాముల బంగారం ధరలు (రూపాయిల్లో)

సంవత్సరం	ధర
2015	26,343
2016	28,623
2017	29,667
2018	31,438
2019	35,220
2020	48,651
2021	48,720
2022	52,670
2023	65,330
2024	71,913



ఎస్‌జీబీల్లో రాబడి

ఇండియా బులియన్‌అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం (గత మూడు పనిదినాల్లోని సగటు)ధరను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఐబీజేఏ ధర మార్కెట్ ఆధారితమే. మొదటి విడత జారీ చేసిన ఎస్‌జీబీ 2016– సిరీస్1 బాండ్ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ముగిసింది. నాడు ఒక గ్రాము బాండ్ రూ.2,600కు విక్రయించారు. గడువు ముగిసిన రోజు ఆర్‌బీఐ నిర్ణయించిన ధర రూ.6,271. ఇందులో ఇన్వెస్ట్ చేసి చివరి వరకు కొనసాగిన వారికి ఏటా 11% రాబడి వచ్చింది. 2.5% వడ్డీ రాబడిని కలిపి చూస్తే వార్షికంగా 11.63 శాతం చొప్పున నికర రాబడి వచ్చినట్టు. ఇది బంగారం గత 20 ఏళ్ల సగటు రాబడి కంటే ఎక్కువే ఉండడం గమనార్హం. తర్వాత వచ్చిన సిరీస్‌లపై రాబడులు మరింత అధికంగా ఉంటున్నాయి.

సిరీస్-8, 9 రాబడులు

బాండ్	జారీ తేదీ	జారీ ధర (రూ.లో)	మెచ్యూరిటీ ధర (రూ.లో)	వడ్డీ రాబడి
ఎస్‌జీబీ 2017-18,సిరీస్-8	20 నవంబర్ 2017	2,961	7,217	16.50
ఎస్‌జీబీ 2017-18, సిరీస్-9	27 నవంబర్ 2017	2,964	7,217	16.44

2017 నవంబర్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య నిఫ్టీ50 సూచీ ఇచ్చిన వార్షిక కాంపౌండెడ్ రాబడి 13.62% ఎస్‌జీబీ సిరీస్-8,9 కంటే తక్కువగా ఉండడం గమనించొచ్చు. (వడ్డీ శాతాల్లో)

ఇతర వివరాలు

ఎస్‌జీబీలపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. చివరి ఆరు నెలల వడ్డీ, మెచ్యూరిటీతో కలిపి ఇస్తారు. ఒక ఇన్వెస్టర్ కనిష్టంగా ఒక గ్రాము, గరిష్టంగా ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఎనిమిదేళ్ల పాటు గడువు పూర్తయ్యే వరకు కొనసాగించినప్పుడే లాభంపై ఎలాంటి పన్ను పడదు. ఒకవేళ ఈ మధ్యలోనే వైదొలిగితే లాభం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి ప్రతి గ్రాముపై రూ.50 తగ్గింపు లభిస్తుంది.

కేటాయింపులు ఎంత మేర?

ఒకరి మొత్తం పెట్టుబడుల్లో కనీసం 5% బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిపుణుల సూచన. గరిష్టంగా 10 వరకు కేటాయించుకోవ చ్చు. మోస్త రు రాబడులు వచ్చినా ఫర్వాలేదు, రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో 15% వరకు కూడా బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవ చ్చు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం అంత మెరుగైన ఆప్షన్ కాబోదు. ఎందుకంటే అసలు బంగారం ధరకు తోడు, కొనుగోలు ధరపై 3% మేర జీఎస్‌టీని భరించాల్సి ఉంటుంది. అదే పెట్టుబడి కోసం అని చెప్పి ఆభరణాలు కొనుగోలు చేస్తే దానిపై తయారీ చార్జీలు, తరుగు భరించాల్సి వస్తుంది. ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చేస్తాయి. కనుక బంగారంపై పెట్టుబడి ఎప్పుడూ కూడా డిజిటల్‌గానే ఉంచుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది. దీనివల్ల భద్రతాపరమైన రిస్క్ కూడా ఉండదు.

ముందస్తు ఉపసంహరణ ఎలా?

ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు అయినప్పటికీ.. కోరుకుంటే ఆ లోపు కూడా విక్రయించుకోవచ్చు. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాత ఆర్‌బీఐ ముందస్తు ఉపసంహరణకు వీలు కల్పిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ అవకాశం ఉంటుంది. బంగారం బాండ్‌పై ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బీఐ వడ్డీ చెలిస్తుందని చెప్పుకున్నాం కదా. ఆ వడ్డీ చెల్లింపు తేదీ నుంచి 21 రోజుల ముందు వరకు ఇన్వెస్టర్ తన వద్దనున్న బాండ్‌ను ఆర్‌బీఐకి ఇచ్చేయాలి. దీనిపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఇక ఇన్వెస్ట్ చేసిన తేదీ నుంచి ఐదేళ్లలోపే బాండ్‌ను విక్రయించుకోవాలంటే.. ఉన్న ఏకైక మార్గం స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ). కాకపోతే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో కొనుగోలుదారులు పరిమితంగా ఉంటుంటారు. లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కొనుగోలుదారు అందుబాటులో ఉంటే విక్రయించుకోవచ్చు. కాకపోతే డిమాండ్ తక్కువ కనుక మార్కెట్ రేటు కంటే తక్కువకే ఇక్కడ విక్రయాలు నమోదవుతుంటాయి. బంగారం బాండ్ భౌతిక రూపంలో ఉంటే దాన్ని డీమెటీరియలైజ్ చేసుకున్న తర్వాతే విక్రయించుకోవడం సాధ్యపడుతుంది.



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్

మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్



ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. యూనిట్ ఎన్ఏవీ రూ.10గా ఉంటుంది. టాటా ఏఐఏ పాలసీదారులు కంపెనీకి చెందిన ఫార్చ్యూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చ్యూన్ మ్యాక్సిమా వంటి యులిప్ పథకాలు, వినూత్న పరమ్ రక్షక్ ప్లస్, ప్రో-ఫిట్ వంటి పథకాల ద్వారా ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌లో అధిక వృద్ధి అవకాశాలున్న టాప్ 50 కంపెనీల పనితీరును ఇది ట్రాక్ చేస్తుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని, మెరుగైన రాబడులను కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ తెలిపింది. గడిచిన 9 ఏళ్లలో మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ 11 రెట్లు పెరిగినట్లు వివరించింది. తయారీ.. సర్వీసులు వృద్ధి చెందుతుండటం, వినియోగ డిమాండ్ పెరుగుతుండటం, పొదుపు మొత్తాలు ఈక్విటీల వైపు మళ్లుతుండటం వంటి అంశాలు ఈ విభాగ సంస్థలకు సానుకూలమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2024	
విశాఖ	475-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	475-00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00

రాబడుల్లో స్థిరత్వం.. డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



మార్కెట్లో అన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు తమ పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు చోటు కల్పించుకోవచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో ఒకటిగా ఉంది.

రాబడులు

గడిచిన ఆరు నెలల కాంలో ఈ పథకం 7.32 శాతం రాబడిని ఇచ్చింది. అదే ఏడాది కాలంలో రాబడి 27.50 శాతంగా ఉంది. మూడేళ్లలో 13.43 శాతం, ఐదేళ్లలో 16.58 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14.30 శాతం చొప్పున ఏటా రాబడులు ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకం 1997 ఏప్రిల్ 29న ప్రారంభమైంది. నాటి నుంచి చూస్తే ఏటా 19 శాతం రాబడిని ఇచ్చింది. గతంలో ఈ పథకం మల్టీక్యాప్‌గా ఉండేది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్‌వ్యవస్థీకరణ అనంతరం సెబీ ఆదేశాల మేరకు ఫ్లెక్సీక్యాప్ విభాగం కిందకు మారింది. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడి కనీసం 12 శాతంపైన ఉంటే దాన్ని మెరుగైనదిగా నిపుణులు పరిగణిస్తుంటారు.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఒక విభాగంలో వ్యాల్యూయేషన్స్ ఖరీదుగా మారిన సందర్భాల్లో పెట్టుబడులు తగ్గించుకుని, ఆకర్షణీయంగా ఉన్న ఇతర విభాగాల్లోకి అధిక పెట్టుబడులు మళ్లిస్తుంటుంది. నాణ్యమైన, సత్తా ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని, ఎక్కువ కాలం పాటు కొనసాగడాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ కరెక్షన్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటుంది. లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా 2008, 2011, 2015, 2020 మార్కెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేసింది. అదే సమయంలో మార్కెట్ ర్యాలీల్లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2020 మార్చి మార్కెట్ పతనం సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులు 93 శాతంగానే ఉన్నాయి. మార్కెట్ల విలువలు గరిష్టాలకు చేరాయన్న జాగ్రత్తతో నగదు నిల్వలను 7 శాతానికి పెంచుకుంది. అదే ఏడాది దిద్దుబాటు అనంతరం క్రమంగా ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ. 10,409 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.39 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.61 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. 63 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.63 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 4.77 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.75 శాతంగా ఉంది. ఒక విధంగా ఈ పథకం ఇన్వెస్టర్ల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్టు భావించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని పరిశీలిస్తే.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 33 శాతం మేర పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్‌కు 11.95 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీకి 11.22 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 10 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.79 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
బజాజ్ ఫైనాన్స్	6.49
ఐసీఐసీఐ బ్యాంక్	5.96
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.25
మదర్సన్ సుమీ	4.08
యాక్సిస్ బ్యాంక్	3.47
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.21
పాలీక్యాబ్ ఇండియా	2.81
ఇన్ఫోసిస్	2.72
ఇండస్ టవర్స్	2.64
గుజరాత్ ఫ్లోరోకెమ్	2.37

స్టాక్స్ వ్యూ

జాగిల్ ప్రీపెయిడ్	ఈక్విరస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 281 **టార్గెట్: రూ. 400**

ఎందుకంటే: జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. సాస్(ఎస్ఏఏఎస్) ఆధారిత వినియోగ వ్యయ(స్పెండ్స్) మేనేజ్‌మెంట్, అనలిటిక్స్ లీడింగ్ ప్లాట్‌ఫామ్. కంపెనీ ప్రత్యేక బిజినెస్ మోడల్‌ను కలిగి ఉంది. ప్రధానంగా చానల్ భాగస్వాములు, ఉద్యోగులు, వెండార్ ప్లాట్‌ఫామ్స్ కోసం ఉద్యోగుల(ఎంప్లాయీ) రీఇంబర్స్‌మెంట్స్, పన్ను లబ్ధి(ట్యాక్స్ బెనిఫిట్స్), రివార్డులు, ప్రోత్సాహకాల(ఇన్సెంటివ్స్) సంబంధ సర్వీసులు అందిస్తోంది. ప్రొడక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల నుంచి ఆదాయంలో ప్రత్యక్షంగా 10 నుంచి 20 శాతమే సమకూర్చుకుంటోంది. ఇది అటు కార్పొరేట్లకు ఇటు కంపెనీకి ప్రయోజకారిగా నిలుస్తోంది. కార్డుల వినియోగం జరిగే లేదా రివార్డ్ వోచర్లు రీడీమ్ అయ్యే మర్చంట్ల నుంచి మిగిలిన ఆదాయాన్ని పొందుతోంది. కార్యకలాపాలు విస్తరించిన మూడు ప్రొడక్టుల విభాగాలలోనూ సరైన పోటీదారులు లేకపోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ సర్వీసులందిస్తున్న రంగం దేశీ మార్కెట్ పరిమాణం రూ. 13,900 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. కంపెనీ లైఫ్‌సైకిల్‌లో ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉన్నట్లు భావిస్తున్నాం. వెరసి కొత్త కస్టమర్లను పొందడం, ప్రస్తుత కస్టమర్లకూ ఇతర ప్రొడక్టులను విక్రయించగలగడం(క్రాస్ సెల్లింగ్), కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, విదేశాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం తదితరాల ద్వారా కంపెనీ భారీ వృద్ధికి పలు అవకాశాలున్నాయి. ఇటీవల జోయర్ పేరుతో విడుదల చేసిన వెండార్ పేమెంట్స్ సొల్యూషన్స్ దీనికి జత కలవనుంది.



ఆస్క్ ఆటోమోటివ్	జేఎమ్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుతధర:రూ. 314 **టార్గెట్: రూ. 375**

ఎందుకంటే: ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలో బ్రేక్ షూ, డ్రమ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో దేశీయంగా ఆస్క్ ఆటోమోటివ్ నాయకత్వ స్థాయిలో ఉంది. రెండు విభాగాలు కలిపి 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టూవీలర్ బ్రేకింగ్‌లోకి ఆలస్యంగా ప్రవేశించినప్పటికీ ఈ రంగంలో వినియోగించే తేలికపరచే(లైట్ వెయిటింగ్) అల్యూమినియం విడిభాగాలు, సేఫ్టీ కంట్రోల్ కేబుళ్ల(ఎస్‌సీసీ) తయారీలో సుప్రసిద్ధ కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఇందుకు సొంత సాంకేతికతల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్ సామర్థ్యాలు తోడ్పాటునిస్తున్నాయి. ప్రొప్రయిటరీ ఫార్ములేషన్స్ వినియోగించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన సొల్యూషన్లను అభివృద్ధి చేసి అందిస్తోంది. అంతేకాకుండా నాణ్యత, ధర, డెలివరీలపై దృష్టి పెట్టడం ద్వారా కస్టమర్లకు చేరువగా నిలుస్తోంది. వెరసి గత కొన్నేళ్లుగా ద్విచక్ర వాహన పరిశ్రమను మించిన వృద్ధిని సాధిస్తోంది. 2013–23 కాలంలో ద్విచక్ర వాహన పరిశ్రమ సగటున 10 శాతం వార్షిక వృద్ధిని అందుకుంది. అయితే విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, ప్రస్తుత కస్టమర్ల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోవడం ద్వారా పరిశ్రమను మించి ప్రగతి పథంలో పరుగెడుతోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) మార్పు కారణంగా అల్యూమినియం లైట్‌వెయిటింగ్ పరికరాల విభాగంలో కిట్ విలువ బలపడుతోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.